ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 10.03.2026 | సంపుటి :12 సంచిక : 230 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## జనాభా ప్రాతిపదికన పోలీసు
# నియామకాలుండాలి

### కొత్త సవాళ్లు ఎదుర్కొనేందుకు అప్‌గ్రేడ్ అవ్వండి

- దేశమైనా,రాష్ట్రమైనాఅభివృద్ధి చెందాలంటే శాంతి భద్రతలు బాగుండాలి
- ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందుంటారు
- సాయం కోసం ప్రజలు మీవైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరు మారి..సైబర్ క్రైమ్ పెరిగింది
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి9(జనంసాక్షి):**

ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామోతెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమిలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్‌-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారు. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చన్నారు.

మిగతా 2లో..

*'దేశ రాజధాని ఢిల్లీ అత్యంత తీవ్రమైన కాలుష్యాన్ని ఎదుర్కొంటోంది. బెంగళూరును ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. ముంబయి, చెన్నై నగరాలు వరద సమస్యను ఎదుర్కొంటున్నాయి. పాలకులకు దూరదృష్టి లేకపోవటం వల్లే ఇలాంటి సమస్య వస్తోంది. 24 గంటల్లో 2 సె.మీ. వర్షపాతాన్ని మాత్రమే తట్టుకునే డ్రైనేజీ వ్యవస్థ మన నగరాలకు ఉంది. ఈ మెట్రోపాలిటన్ నగరాల నుంచి మన రాష్ట్ర పోలీసుశాఖ చాలా నేర్చుకోవాలి. అలా కాకుండా ఏ చర్యలు తీసుకోవాలో ఆలోచించాలి"* – సీఎం రేవంత్ రెడ్డి

### ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోండి

- అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్ వర్సిటీలు
- సకల సదుపాయాలను ఉండేలా నిర్మిస్తాం
- అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- విశ్వక్రీడలే లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



2లో..

### త్వరలో నాలుగు రాష్ట్రాలకు
# అసెంబ్లీ ఎన్నికలు!

- సీఈసీ బెంగాల్ పర్యటన ముగిసిన తర్వాత షెడ్యూల్ ప్రకటనకు అవకాశం
- ఐదు ప్రాంతాల్లో మొదటిసారి అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈ వారం ప్రకటించే అవకాశం ఉందని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు ఎన్నికల సంఘం సిద్ధంగా ఉందని సమాచారం. ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని పూర్తి స్థాయి ఎన్నికల సంఘం బృందం బంగాల్‌లో

మిగతా 2లో..



### ఎల్‌పీజీ సిలిండర్ బుకింగ్
# గడువు పెంపు

- 21 నుంచి 25 రోజులకు మార్పు
- బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించేందుకు కేంద్రం కీలక నిర్ణయం

9లో..





# సెక్యులరిజానికి కేరాఫ్ కాంగ్రెస్

### సర్వమతాలను సమానంగా చూస్తాం

ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీనే

ముస్లింల రక్షణతో పాటుసంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట(జనంసాక్షి):**ఢిల్లీ నుండి గల్లీ వరకు ముస్లింలకు అండగా నిలబడేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.భారతదేశంలో సర్వమతాలను సమానంగా చూస్తూ వారి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న పార్టీ కూడా కాంగ్రెస్ పార్టీ మాత్రమే నని ఆయన స్పష్టం చేశారు.రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,

మిగతా 2లో..

### వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు
# రాజ్యసభకు..

- తెలంగాణ నుంచి ఏకగ్రీవమైన ఇరువురు
- ధృవీకరణ పత్రాలు అందజేత
- తెలంగాణ సమస్యలను ఢిల్లీలో వినిపిస్తా
- పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత
- వివాదాలకు నేను దూరం : వేం నరేందర్ రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది.

మిగతా 2లో..



# యాసిడ్ దాడి బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలి

వీలుకాని పక్షంలో బాధితులకు భత్యం చెల్లించేలా విధానాలు రూపొందించాలి

అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**యాసిడ్ దాడుల బాధితులకు పరిహారం కల్పించే విషయంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులిచ్చింది. బాధితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేలా విధానాన్ని రూపొందించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఒకవేళ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వలేని పక్షంలో.. బాధితుల జీవనాధారం కోసం భత్యం చెల్లించేలా విధానాలు రూపొందించాలని సూచించింది.ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. యాసిడ్ దాడి బాధితులకు ప్రభుత్వ విభాగాలు/ఏజెన్సీల్లో ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేరో స్పష్టమైన కారణాలు తెలియజేయాలని సుప్రీంకోర్టు రాష్ట్రాలను ఆదేశించింది.యాసిడ్ దాడుల కేసులకు సంబంధించి గతంలోనూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనల్లో నేరగాళ్లకు తీవ్రమైన కఠిన శిక్షలు విధించేలా చట్టాన్ని సవరించాలని నాడు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. అవసరమైతే దోషుల ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోకూడదని ప్రశ్నించింది. హరియాణాకు చెందిన ఓ యాసిడ్ దాడి బాధితురాలి పిటిషన్‌పై విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

### ఇరాన్ కొత్త సుప్రీంగా
# మొజ్తబా




- ఖమేనీ రెండో కుమారుడిని ఎన్నుకున్న 88మంది మతగురువులతో కూడిన 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్'
- దేశవ్యాప్తంగా సంబరాలు
- ఏం జరుగుతుందో చూద్దాం
- ఇరాన్ కొత్త నాయకత్వంపై ట్రంప్ వ్యాఖ్యలు

**టెహ్రాన్(జనంసాక్షి):**ఇజ్రాయెల్, అమెరికాతో యుద్ధం భీకరంగా సాగుతున్న వేళ ఇరాన్ తన కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. అమెరికా హెచ్చరికలను భేఖాతరు చేస్తూ ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా ఖమేనీని కొత్త నేతగా ప్రకటించింది. మరోవైపు ఇరాన్‌తోపాటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై అమెరికా, ఇరాన్ దాడులు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్‌లోని చమురు నిల్వ కేంద్రాలపై దాడుల కారణంగా వెలువడుతున్న పొగలు పర్యావరణానికి పెను ముప్పు అనే ఆందోళన వ్యక్తమవుతోంది.ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఎంపిక కొలిక్కివచ్చింది. ఇరాన్‌లోని 88మంది మతగురువులతో కూడిన

మిగతా 2లో..

# అట్టుడుకుతున్న పశ్చిమాసియా

### ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలపైకి బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడుతున్న ఇరాన్




ఇజ్రాయెల్ దాడిలో హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయాలు ధ్వంసం

భారత పౌరుల తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది: కేంద్రం

**టెహ్రాన్(జనంసాక్షి):**ఇజ్రాయెల్‌-అమెరికా, ఇరాన్ పరస్పర దాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఇరాన్ ప్రతిదాడులను తీవ్రతరం చేసింది. ఆపరేషన్ ట్రూ ప్రామిస్‌-4లో భాగంగా పెద్దఎత్తున బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలపైకి ప్రయోగించింది. ఇరాన్ లక్ష్యాలు పౌర మౌలిక సదుపాయాల వైపు కూడా మళ్లాయి. గల్ఫ్ దేశాల తాగునీటి అవసరాలకు అత్యంత కీలకమైన డీశాలినేషన్ ప్లాంట్లపై ఇరాన్ దాడి చేసిందని బహ్రెయిన్ ఆరోపించింది. సౌదీ అరేబియాలోని ఒక నివాస ప్రాంతంలో ఇరాన్ క్షిపణి పడి ఒక భారతీయుడు సహా ఇద్దరు మరణించారు. ఈ యుద్ధంలో సౌదీలో సంభవించిన మొదటి మరణాలు ఇవే కాగా 12 మంది బంగ్లాదేశీయులు గాయపడ్డారు. ఈ నేపథ్యంలో పొరుగు దేశాలపై దాడులు చేస్తూ ఇరాన్ బాధ్యతారాహిత్యమైన విధానాన్ని అవలంబిస్తోందని అరబ్ లీగ్ చీఫ్ మహ్మద్ అబ్దుల్ గెయిట్ మండిపడ్డారు. గల్ఫ్ దేశాలపై ఇప్పటికే వందలాది క్షిపణులు, డ్రోన్ దాడులు

మిగతా 2లో..



# ఇరాన్‌కు అండగా ఉంటాం

- ఆ దేశానికి రష్యా సంపూర్ణ మద్దతు
- పుతిన్ కీలక వ్యాఖ్యలు
- సుప్రీం లీడర్‌గా ఎన్నికైన ముజ్తబా ఖమేనీకి అభినందనలు

**మాస్కో(జనంసాక్షి):**పశ్చిమాసియాలో ఘర్షణల వేళ.. ఇరాన్‌కు రష్యా వ్యూహాత్మక మద్దతు ఇస్తోందని ఇటీవల పలు నివేదికలు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్‌-అమెరికాలతో చేస్తున్న యుద్ధంలో తమ మిత్ర దేశమైన ఇరాన్‌కు సంపూర్ణ

మిగతా 2లో..

# సంయమనం పాటించాలి

- దౌత్యమార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి
- అక్కడి భారతీయుల గురించే మా ఆందోళనంతా
- ఈ అంశంపై ఎప్పటికప్పుడు ప్రధాని మోదీ సమీక్ష జరుపుతున్నారు:రాజ్యసభలో జైశంకర్

2లో..

# 'రైతుబంధు'పోయి.. 'రాహుల్ బంధు' వచ్చింది

### సీఎం రేవంత్‌పై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు

**రాజన్నసిరిసిల్ల(జనంసాక్షి):** రాష్ట్రంలో రైతు బంధు పథకాన్ని బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకు వచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఏడాదికి రూ. వెయ్యి కోట్లు పంపడమే రాహుల్ బంధు పథకమని ఆయన అభివర్ణించారు. సంవత్సరానికి రూ.1000 కోట్లు కప్పం కట్టి తన పదవిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. మూడో పంటకు రైతు బంధు వేయాలన్నారు. కానీ నేటికి మూడో నెల వచ్చిన రైతు బంధు వేయడం లేదని రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక కష్టాలు ఉన్న మాట నిజమైతే రూ.లక్షన్నర కోట్లతో మూసి సుందరీకరణ ఎవరు చేయమన్నారంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రైతు బంధు మీద దృష్టి పెట్టు.. అంతేకానీ రాహుల్ బంధు మీద కాదంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వికలాంగుల ఇళ్లను సైతం నిర్దాక్షిణ్యంగా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత ఇల్లు, ఆయన సోదరుడి ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని.. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గ్యారెంటీల అమలుపై వ్యంగ్య బాణాలు సంధించారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు కావస్తున్నా అతీగతీ లేదని విమర్శించారు. ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం, రైతులకు పంట బోనస్, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీలపై ప్రశ్నించారు.



# ఏసీబీకి చిక్కిన సైబర్‌క్రైమ్ ఎస్సైలు

### రూ. లక్ష లంచం తీసుకుంటుండగా పట్టివేత

**హైదరాబాద్(జనంసాక్షి):** సైబర్ క్రైం కేసులో అరెస్టు చేయకుండా ఉండడానికి ఫిర్యాదుదారుడు నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు ఆర్ఎస్సైలు ఏసీబీకి చిక్కారు.మల్కాగిజిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీ నగర్ సైబర్‌క్రైం పోలీసు స్టేషన్‌కు చెందిన ఇద్దరు ఎస్సైలు ప్రమోద్ గౌడ్ , జటావత్ బాబు నాయక్ సోమవారం రూ. లక్ష లంచం తీసుకుంటుండంగా పట్టుబడ్డారు.

మిగతా 2లో..



# గతంలో లాగా సారా దుకాణాలు తెరవాలి

- గతంలో దాన్ని తాగిన వారంతా ఆరోగ్యంగా ఉన్నారు
- లిక్కర్ కన్నా సారాయే బెటర్
- జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

# విజయ్‌కి మళ్లీ సమన్లు

టీవీకే అధినేతకు జారీ చేసిన సీబీఐ

# నకిలీ వెబ్‌సైట్‌లతో జాగ్రత్త

- నకిలీ లింక్‌లను తెరవొద్దు
- కేంద్రం హెచ్చరిక

# అధైర్యపడకండి.. అండగా ఉంటా

వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా..అరెస్టు

వివరాలు 2వలో పేజీలో..



9లో..

# దుష్ప్రచారాలు నమ్మొద్దు

4 వేల కోట్ల లీటర్ల చమురు నిల్వలున్నాయ్ • కేంద్రం నివేదిక

### జనంసాక్షి కథనం
# తెలంగాణ టూ యూపీ



బాధిత బాలుడు ఆశిక్

- స్పందించిన మధోఘర్ ఎమ్మెల్యే మూల్ చంద్ నిరంజన్
- ఆశిక్‌కు వైద్యం అందిస్తామని హామీ
- వైద్యం కోసం తెలంగాణ నుండి యూపీకి కుటుంబం



యూపీ ఎమ్మెల్యే మూల్ చంద్ నిరంజన్

12లో..

## త్వరలో నాలుగు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు!

పర్యటిస్తోంది. ఆ బృందంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్?బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కూడా ఉన్నారు.బంగాలలో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన తర్వాత ఈ బృందం మార్చి 10న దిల్లీకి తిరిగి వెళ్లనుంది. అక్కడ ఎన్నికల ఏర్పాట్లపై అన్ని రాష్ట్రాల్లో సమీక్ష పూర్తి చేసిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశముందని ఎన్నికల సంఘం వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల్లో ఎన్నికల సన్నాహకాలను ఎన్నికల కమిషన్ పరిశీలించింది. ఇప్పుడు బంగాల్? సమీక్ష అనంతరం షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.ఇప్పటికే ఆ నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ కాలపరిమితులు కూడా ముగింపుకు చేరుకుంటున్నాయి. అసోం అసెంబ్లీ గడువు మే 20న ముగియనుంది. కేరళ అసెంబ్లీ కాలపరిమితి మే 23న ముగుస్తుంది. తమిళనాడు అసెంబ్లీ గడువు మే 10న ముగియనుండగా, బంగాల్ అసెంబ్లీ కాలపరిమితి మే 7న ముగియనుంది. అలాగే కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది.అన్ని పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సమయంలో జరిగే ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ఆ విధానం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఓటింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించగలుగుతారు. రిటర్నింగ్ ఆఫీసర్ జిల్లా ఎన్నికల అధికారి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. దీంతో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడగలుగుతామని అధికారులు చెబుతున్నారు.ఇంతకుముందు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ విధానం అమలు చేసిన రాష్ట్రంగా బిహార్? నిలిచింది. గత ఏడాది చివర్లో అక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ అమలు చేశారు. అంతకు ముందు వరకు కీలక పోలింగ్ కేంద్రాలతో పాటు మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 50 శాతం వరకు మాత్రమే వెబ్‌కాస్టింగ్ తప్పనిసరి ఉండేది. ఇక ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేసే సమయంలో స్థానిక పండుగలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘాన్ని కోరాయి. ముఖ్యంగా అస్సాంలో జరిగిన సమావేశంలో పలువురు రాజకీయ పార్టీలు ఎన్నికలను ఒక దశలో లేదా గరిష్ఠంగా రెండు దశల్లో నిర్వహించాలని సూచించినట్లు సమాచారం.

ఓటర్లను చురుకుగా!

అసోం త్వరలో జరగబోయే బిహు పండుగను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల తేదీలను నిర్ణయించాలని పార్టీలు అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఈ సూచనలను ఎన్నికల సంఘం గమనించిందని వర్గాలు తెలిపాయి. ఇక ఓటర్ల పాల్గొనికను పెంచేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమం ద్వారా ఓటర్లలో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల ద్వారా ఓటర్లను చురుకుగా ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని ఎన్నికల సంఘం లక్ష్యంగా పెట్టుకుంది.

## విజయ్‌కి మళ్లీ సమన్లు

కరూర్ తొక్కిసలాట కేసులో టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు సీబీఐ మరోసారి సమన్లు జారీ చేసింది. మార్చి10న విచారణకు హాజరుకావాలని సూచించింది. గతేడాది సెప్టెంబరు 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన ప్రచారసభలో తొక్కిసలాట జరిగి.. 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే దర్యాప్తు సంస్థ విచారణకు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. కరూర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతుండడంతో.. విచారణలో భాగంగా విజయ్ ఇప్పటికే పలుమార్లు దిల్లీలోని దర్యాప్తు కార్యాలయానికి హాజరయ్యారు. ఇప్పటివరకు తాము సేకరించిన ఆధారాలపై విజయ్ స్పష్టతనివ్వాల్సి ఉండడంతో అతడికి మరోసారి నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ర్యాలీ సమయంలో జనసమూహ నిర్వహణ ఏర్పాట్లు, ఈవెంట్ వేదికకు మంజూరుచేసిన అనుమతులు, టీవీకే పార్టీ, తమిళనాడు ప్రభుత్వం వాదనలపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదీ చదవండి: అక్కడి భారతీయుల పైనే మా ఆందోళనంతా: రాజ్యసభలో జైశంకర్

## నకిలీ మందుల విక్రయంపై కొరడా

హైదరాబాద్(జనంసాక్షి): నాణ్యతలేని మందుల విక్రయాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీసీఏ ఆధ్వర్యంలో బల్క్ ఎస్ఎంఎస్ అలర్ట్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులకు వెంటనే సమాచారం అందించేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా నాణ్యతలేని, అనుమానాస్పద మందులు గుర్తించిన వెంటనే అన్ని మెడికల్ షాపులకు ఎస్ఎంఎస్ ద్వారా అలర్ట్ పంపిస్తున్నారు. దీంతో ఆ మందుల విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని మెడికల్ షాపులకు సూచనలు అందుతాయి. ప్రజలకు హానికరంగా మారే మందులు మార్కెట్‌లో అమ్మకుండా ముందుగానే అడ్డుకోవడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. నాణ్యతలేని మందులు అమ్మడం వల్ల రోగుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండటంతో ప్రభుత్వం ఈ చర్యలను చేపట్టింది. ఈ కొత్త వ్యవస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మెడికల్ షాపులను ప్రభుత్వం అనుసంధానం చేస్తోంది. ఒకసారి అలర్ట్ జారీ అయిన వెంటనే ప్రతి ఫార్మసీకి సమాచారం చేరేలా డిజిటల్ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఔషధాల నాణ్యత, పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు డిజిటల్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టి మందుల నియంత్రణను మరింత కట్టుదిట్టం చేసేలా డీసీఏ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## నకిలీ వెబ్‌సైట్‌లతో జాగ్రత్త

న్యూఢిల్లీ(జనంసాక్షి):నకిలీ వెబ్‌సైట్‌ల విషయంలో కేంద్రం కీలక హెచ్చరికలు జారీ చేసింది. అమాయకులను మోసం చేసి డబ్బులు కాజేసేందుకు సైబర్ కేటుగాళ్లు చేసే ప్రయత్నాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. సమగ్ర శిక్షా అభియాన్ అధికారిక వెబ్‌సైట్‌ను పోలి ఉండేలా మోసగాళ్లు నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించారని, దీని ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తామనే సాకుతో డబ్బులు డిమాండ్ చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. ఈ నకిలీ వెబ్‌సైట్‌తో కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెబుతూ సమగ్రశిక్షా అభియాన్ అధికారిక వెబ్‌సైట్ లింక్‌ని పోస్టు చేసింది. ఏవైనా ఉద్యోగ నోటిఫికేషన్‌లు, నియామకాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లలోనే చెక్ చేసుకోవాలని కోరింది. దేనికైనా దరఖాస్తు చేసే ముందు, లేదా వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసే ముందు సంబంధిత వెబ్‌సైట్‌లను జాగ్రత్తగా చెక్ చేయాలని సూచించింది. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మాయగాళ్ల వలకు చిక్కొద్దని కోరింది.

## గతంలో లాగా సారా దుకాణాలు తెరవాలి

**గతంలో దాన్ని తాగిన వారంతా ఆరోగ్యంగా ఉన్నారు**

**లిక్కర్ కన్నా సారాయే బెటర్: జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):** జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సోమవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో బాంబు పేలుస్తానని అన్నారు. సచివాలయం ఎదుట మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సారా దుకాణాలు ఓపెన్ చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో కోరుతానని అన్నారు. గతంలో సారా తాగిన వారంతా ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు. సారా తాగి 115 సంవత్సరాల పాటు బ్రతికిన జనం, ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే చనిపోతున్నారని పేర్కొన్నారు.సైంటిఫిక్ గా సారా ఆరోగ్యానికి హానికరం కాదని,ఇటీవల కొన్ని రాష్ట్రాలు సారా దుకాణాలు ప్రారంభించారని గుర్తు చేశారు.మధ్యప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాలలో ప్రభుత్వాలు అధికారికంగా సారా దుకాణాలను నడుపుతున్నారని వివరించారు. వచ్చే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్లో సారా దుకాణాల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని స్పష్టం

## జనాభా ప్రాతిపదికన పోలీసు నియామకాలుండాలి

కానీ అడాప్టివ్చాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు.

దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి.

అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు. అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టంను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోదించలేమని గుర్తు చేశారు.రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకురండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలి. పోలీస్ శాఖలో ఉద్యోగులు ఆటో మోడ్ కు వెళితే సమాజానికి అత్యంత ప్రమాదకరం. ఇతర శాఖల్లా పోలీస్ శాఖలో ఆటో మోడ్.. ఆటో ప్రమోషన్ ఉండదు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ అవ్వాల్సిందేనని అన్నారు.అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బడ్జెట్ ప్రవేశపెట్టకముందే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటే అవసరమైన నిధులను బడ్జెట్ లో కేటాయించుకోవచ్చని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్యక్రమానికి వచ్చిన సిఎంకు పోలీస్ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

## ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోండి

హైదరాబాద్(జనంసాక్షి): అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

## అధైర్యపడకండి.. అండగా ఉంటా..

ఖమ్మం(జనంసాక్షి):

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యా యం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరఫున వారికి వైద్య సహాయం కూడా అందలేదన్నారు. అనంతరం ఖమ్మం జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆమె నిరసనను విరమించుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని జడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెలుగుమట్ల భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి ఆందోళనకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత దిగారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

## సెక్యులరిజానికి కేరాఫ్ కాంగ్రెస్

సీనియర్ కాంగ్రెస్ నేత సర్వోత్తం రెడ్డి,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి,మున్సిపల్ చైర్మన్ మోరిశెట్టి నివేదితా లక్షాది ,పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో సెక్యులరిజానికి పెద్ద పీట వేస్తున్నది కాంగ్రెస్ పార్టీ మాత్రమే నన్నారు.లోకసభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ మొదలు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వరకు ముస్లిംల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని ఆయన చెప్పారు.ఒక్క మాటలో చెప్పాలి అంటే సెక్యులరిజానికి కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ చిరునామాగా నిలిచిందని ఆయన వ్యాఖ్యానించారు.ముస్లింల రక్షణతో పాటు వారి వారి అభివృద్ధితో పాటు సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు పెద్ద పీట వేశాయని ఆయన గుర్తుచేశారు.ముస్లింలు పవిత్ర మాసంగా భావించే రంజాన్ మాసంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొనడడం ఆనంద దాయకంగా ఉందన్నారు.సూర్యాపేట లో ముస్లింల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా మంత్రిగా నిరంతరం అందుబాటులో ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.సూర్యాపేట జిల్లా కేంద్రంలో షాధిఖాన, కమ్యూనిటి హాల్,ఖబరస్తాన్ వంటి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

## వేం నరేందర్ రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు..

ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

**పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత:వేం నరేందర్ రెడ్డి**

తాను వివాదాలకు దూరమని రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి వేం నరేందర్ రెడ్డి రాజ్యసభకు ఎన్నికైనట్లు ధృవీకరణ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద వేం నరేందర్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్టీ ప్రయోజనాలే తన ప్రయోజనాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి తన వంతుగా చేయగలిగింది చేస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌తో తనకు స్నేహం ఉందని చెప్పారు. అయితే సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో తనకు తెలియదన్నారు. తనకు కొత్త విషయాలు నేర్చుకోవడమంటే ఇష్టమని పేర్కొన్నారు. ఇన్ని రోజులు తన పని.. పద్ధతి ఒకలా ఉండేదని.. ఇకపై మరోలా ఉంటుందన్నారు. రాజ్యసభకు అవకాశం కల్పించిన పెద్దలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభకు ఎన్నికైనట్లుగా తాను ధృవీకరణ పత్రాన్ని తీసుకున్నానని చెప్పారు. 2004 నుంచి 2009 వరకు తాను ఎమ్మెల్యేగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. ఇప్పటి నుంచి పార్లమెంట్ వేదికగా పని చేయబోతున్నానని తెలిపారు. తెలంగాణ సమస్యల పరిష్కారం కోసం రాజ్యసభలో పోరాడతానని వేం నరేందర్ రెడ్డి వెల్లడించారు.

## ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' కొత్త సుప్రీం లీడర్‌గా ఖమేనీ కుమారుడు మొజ్తబాను ఎన్నుకుంది. ఇస్లామిక్ రిపబ్లిక్‌లో అత్యంత రహస్య వ్యక్తిగా పేరొందిన మొజ్తబా ఖమేనీ, ఇరాన్ యుద్ధ వ్యూహంలో ఇప్పుడు కీలక పాత్ర పోషించనున్నారు. శక్తిమంతమైన రివల్యూషనరీ గార్డ్స్ ఆయన ఆదేశాల మేరకు పనిచేస్తాయి. మొజ్తబా ఇప్పటివరకు ఎన్నడూ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఏ ప్రభుత్వ పదవినీ చేపట్టలేదు.

దేశవ్యాప్తంగా సంబరాలు

ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీ ఎన్నిక కావడం పట్ల ఆ దేశ వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. అనేక మంది మద్దతుదారులు వీధుల్లోకి వచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. 1969లో మషాద్ నగరంలో జన్మించిన మొజ్తబా, చిన్నతనం నుంచే తన తండ్రి షా పాలనను చూస్తూ పెరిగారు. ఇరాన్-ఇరాక్ యుద్ధంలో రివల్యూషనరీ గార్డ్స్ తరఫున పోరాడారు. 1989లో తన తండ్రి అయాతుల్లా ఖమేనీ సుప్రీం లీడర్ అయిన తర్వాత, మొజ్తబా క్రమంగా తన పట్టును పెంచుకున్నారు. 2008 నాటి వికీలీక్స్ పత్రాలు ఆయన్ను తెర వెనుక అసలు అధికారిగా అభివర్ణించాయి. 2005, 2009 ఎన్నికల్లో అహ్మదీ నెజాద్ గెలుపులో మొజ్తబా కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది.

ఏం జరుగుతుందో చూద్దామన్న ట్రంప్

మరోవైపు ఇరాన్ నాయకత్వంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఏం జరుగుతుందో చూద్దామని వ్యాఖ్యానించారు. అంతకుముందు ఇరాన్? కొత్త నాయకుడు ఎవరైనా తమ ఆమోదం ఉండాలని, లేకపోతే వారు ఎక్కువ కాలం కొనసాగలేరని ట్రంప్? హెచ్చరించారు. మొజ్తాబా నాయకత్వాన్ని తాను అంగీకరించబోనని ఇప్పటికే ట్రంప్ స్పష్టం చేశారు. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వీడియో సందేశం ద్వారా ఇరాన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఇరాన్‌ను నిరంకుశత్వ పాలన నుంచి విముక్తి చేయడమే తమ లక్ష్యమన్న ఆయన, ఇరాన్ ప్రజలు తిరగబడితే ఇరు దేశాలు మళ్లీ మంచి మిత్రులుగా మారే రోజు ఎంతో దూరంలో లేదని పిలుపునిచ్చారు.

## కల్తీ మాఫియా గుట్టు రట్టు..

**గచ్చిబౌలిలో రూ.21 లక్షల విలువ చేసే నకిలీ పదార్థాలు స్వాధీనం**

హైదరాబాద్(జనంసాక్షి)

గచ్చిబౌలిలో పోలీసులు కల్తీ మాఫియా గుట్టురట్టు చేశారు. 5 వేల లీటర్ల కల్తీ వంటనూనె, 5 టన్నుల కల్తీ గోధుమ పిండి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.21 లక్షల విలువ చేసే నకిలీ పదార్థాలను సీజ్ చేశారు. గచ్చిబౌలిలోని ఓ గోదాములో కల్తీ ఆహార పదార్థాలు ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. నిత్యావసరాలు కల్తీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అట్టుడుకుతున్న పశ్చిమాసియా

జరిగాయని తెలిపారు. పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. అటు గల్ఫ్ దేశాలపై దాడుల విషయంలో క్షమాపణలు చెప్పిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఆదివారం తన స్వరాన్ని మార్చారు. ఇరాన్‌పై ఎంత ఒత్తిడి పెరిగితే ప్రతిస్పందన కూడా అంతే బలంగా ఉంటుందని హెచ్చరించారు. పొరుగు దేశాలు అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు సహకరించవద్దని కోరారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు మరింత తీవ్రమయ్యాయి. ఇజ్రాయెల్ దళాలు ఇప్పటివరకు సుమారు 3వేల 400 దాడులు నిర్వహించాయని ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ తెలిపారు. 150కి పైగా ఇరాన్ రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేశాయని తెలిపారు. ఇరాన్‌పై ఇప్పటివరకు 7వేల 500 క్షిపణులను ప్రయోగించినట్లు వెల్లడించారు. ఆపరేషన్ తదుపరి దశకు చేరుకుందన్న ఆయన, ఇరాన్?లోని కీలక ఉత్పత్తి కేంద్రాలే లక్ష్యంగా దాడులను విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇజ్రాయెల్, అమెరికా దాడుల కారణంగా ఇరాన్ అంతటా సుమారు 10వేల పౌర కట్టడాలు, పాంశాలలు, ఆరోగ్య కేంద్రాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ దాడుల వల్ల టెహ్రాన్‌లోని చమురు నిల్వ కేంద్రాల నుంచి దట్టమైన పొగ వెలువడుతోంది. ఇది పర్యావరణ ముప్పునకు దారితీస్తుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయాలు ధ్వంసం

లెబనాన్ రాజధాని బీరూట్‌లోని దహియే శివారు ప్రాంతంలో హెజ్‌బొల్లా ఉగ్రవాదుల ఏరివేతను ముమ్మరం చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. హెజ్‌బొల్లా ప్రధాన కార్యాలయాలను ధ్వంసం చేస్తున్నట్లు ఎఆఈ తెలిపింది. దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లా గ్రూపును లక్ష్యంగా చేసుకుని సాగుతున్న పోరాటంలో ఇద్దరు ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. లెబనాన్‌లోని దక్షిణ నగరమైన సిడాన్‌లోని ఐన్ ఎల్ హిల్వే అనే అతిపెద్ద పాలస్తీనా శరణార్థి శిబిరం సమీపంలో ఇజ్రాయెల్ క్షిపణులు పడి ఒకరు మరణించారు. పలువురు పౌరులు, లెబనీస్ సైనికులు గాయపడ్డారు. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఏడో అమెరికా సైనికుడు మరణించినట్లు యూఎస్ రక్షణ శాఖ ధృవీకరించింది. మార్చి 1న సౌదీఅరేబియాలో అమెరికా దళాలపై జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడిన సైనికుడు చికిత్స పొందుతూ మరణించాడని తెలిపింది.కాగా ఈ ఘర్షణల కారణంగా ఇజ్రాయెల్‌లో ఓ భారత పౌరుడు గాయపడినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. ఇరాన్ క్షిపణి నుంచి వచ్చిన శకలాలు మెడకు తగలడంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు.ఆదివారం ఈ ఘటన జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. గాయపడిన వ్యక్తిని టెల్ అవీవ్ ఆసుపత్రికి తరలించామని, అక్కడ శస్త్రచికిత్స జరిగినట్లు తెలిపారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వెల్లడించారు. అయితే, బాధితుడి పేరు, ఇతర వివరాలేవీ తెలియరాలేదు.టెల్ అవీవ్‌లోని భారత ఎంబసీ అధికారులు ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నామని ఎంబసీ అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రస్తుత ఉద్రిక్తతల దృష్ట్యా ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయులతో నిరంతరం టచ్‌లో ఉన్నామని, అవసరమైన సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

భారత పౌరుల తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది: కేంద్రం

దిల్లీ: పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి రప్పించే ప్రక్రియ కొనసాగుతోందని పౌరవిమానయాన శాఖ వెల్లడించింది. పలు చోట్ల నుంచి 50 విమానాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. గత 2 రోజుల్లో 100 సర్వీసుల్లో ప్రయాణికులను తరలించినట్లు వెల్లడించింది. దుబాయ్, అబుదాబి, రస్ అల్ ఖైమా, ఫుజరాహ్, మస్కట్, జెద్దాల నుంచి విమానాలు సురక్షితంగా నడిచాయని ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయా విమానాశ్రయాల్లో పరిస్థితులు, సాధ్యాసాధ్యాలకు అనుగుణంగా విమానాలు నడుస్తున్నట్లు పేర్కొంది. టికెట్ ధరలు సహేతుకంగా ఉండేలా విమాన ఛార్జీలను కూడా నిశితంగా పరిశీలిస్తున్నట్లు పౌర విమానయాన శాఖ వెల్లడించింది.

చిన్నారుల ఫొటోలతో 'టెహ్రాన్ టైమ్స్' ఫస్ట్‌పేజీ

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. యుద్ధంలో ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తూనే ఉన్నాయి. యుద్ధంలో అమాయకులైన పౌరులు ప్రాణాలు కోల్పోతుండడంపై అంతర్జాతీయంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు చెందిన టెహ్రాన్ టైమ్స్ వెలువరించిన కథనం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. యుద్ధం ప్రారంభం రోజే ఇరాన్‌లోని మినాబ్‌లో పాఠశాలపై జరిగిన దాడిలో 150 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా ఆ చిన్నారుల ఫొటోలను పత్రిక మొదటి పేజీలో సోమవారం ప్రచురించింది."ట్రంప్ ఒక్కసారి ఆ చిన్నారుల కళ్లల్లోకి చూడు" అంటూ చిన్నారుల ఫొటోలను పత్రిక మొదటి పేజీలో వేసింది. వందలాది మంది ఇరాన్ పిల్లలు అమెరికా దాడుల్లో మరణించినప్పటికీ.. అమెరికా అధ్యక్షుడు మాత్రం మినాబ్ దాడిని అంగీకరించడం లేదంటూ టెహ్రాన్ తన ఎక్స్‌లో పోస్ట్ చేసింది. అమెరికా క్షిపణి దాడుల్లో చిన్నారులు మరణించారని ఇరాన్ పేర్కొంటుండగా.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఆ నెపాన్ని ఇరాన్‌పైకి నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇరాన్ ఆయుధాలకు కచ్చితత్వం ఉండదంటూ, మినాబ్ పాఠశాల దాడి ఘటనకు ఆ దేశానిదే బాధ్యతంటూ మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొనడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఫొటోలతో బదులిచ్చింది.మరోవైపు టెహ్రాన్ టైమ్స్ పోస్ట్‌పై సామాజిక మాధ్యమాల్లో చర్చ మొదలైంది.

## సంయమనం పాటించాలి

పశ్చిమాసియా ఘర్షణల వేళ.. సోమవారం విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ రాజ్యసభలో ఓ ప్రకటన చేశారు. అక్కడి పరిణామాలు అందరికీ ఆందోళన కలిగిస్తున్నాయని, వాటిపై ఎప్పటికప్పుడు ప్రధాని మోదీ సమీక్ష జరుపుతున్నారని వెల్లడించారు. అలాంటి పరిస్థితులకు చర్చలు, దౌత్యపరమైన చర్యలే పరిష్కారమని పిలుపునిచ్చారు "ఈ సంక్షోభ సమయంలో సంయమనం పాటించి, దౌత్యమార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మన ప్రభుత్వం ఫిబ్రవరి 20న ప్రకటన విడుదల చేసింది. పశ్చిమాసియాలో పరిణామాలు మనందరికీ ఆందోళన కలిగిస్తున్నాయి. వాటిపై ఎప్పటికప్పుడు మోదీ సమీక్ష జరుపుతున్నారు. ఇరాన్ నాయకులు సహా పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆ ప్రాంతంలోని ఘర్షణలు మన దేశ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలపైన గణనీయమైన ప్రభావం చూపుతాయి. మన ఇంధన భద్రతకు ఈ ప్రాంతం ఎంతో కీలకం.అక్కడినుంచే మన అవసరాలకు కావాల్సిన చమురు, గ్యాస్ వస్తోంది. అలాగే లక్షలాదిమంది భారతీయులు గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. వారి గురించే మా ఆందోళన. అలాగే అక్కడ చిక్కుకొన్నవారిని తిరిగి తీసుకురావడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. భారత వినియోగదారుల ప్రయోజనాలకే ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుంది. అందుకే అవసరమైనచోట మన ఇంధన సంస్థల ప్రయత్నాలకు దౌత్యమార్గాల ద్వారా మద్దతు ఇచ్చాం" అని జైశంకర్ వెల్లడించారు.అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ ఘర్షణలతో పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా వంటి దేశాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ప్రయోగిస్తోంది. అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయాల సమీపంలో పేలుళ్లు సంభవిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాంతో భారీ సంఖ్యలో ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయారు. ఇప్పటికే వారిని తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం ప్రత్యేక విమానాలను నడుపుతోంది.శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌక 'ఐరిస్-దేనా'ను అమెరికా ముంచేసిన సంగతి తెలిసిందే. ఇటీవల విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు వచ్చిన మరో నౌక ఐరిస్ లావన్‌కు తిరుగు ప్రయాణంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దాంతో ఆ నౌకను కొచ్చి ఓడరేవులో నిలిపేందుకు అంగీకరించాలని ఇరాన్ కోరగా.. భారత ప్రభుత్వం అందుకు అనుమతి ఇచ్చింది. దీనిపై జైశంకర్ స్పందించారు. "ఈ క్లిష్ట సమయంలో ఆ దేశంతో సంప్రదింపులు జరపడం కష్టంగా ఉంది. ఐరిస్ లావన్ యుద్ధనౌకకు భారత ప్రభుత్వం ఆశ్రయం ఇవ్వడంపై ఇరాన్ విదేశాంగ శాఖ కృతజ్ఞతలు తెలియజేసింది" అని మంత్రి వెల్లడించారు.

## ఇరాన్‌కు అండగా ఉంటాం

మద్దతు ఇస్తామని ప్రకటించారు. టెహ్రాన్‌కు మాస్కో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా ఎన్నికైన ముజ్తబా ఖమేనీకి అభినందనలు తెలిపారు. తన తండ్రి ఖమేనీ స్థానంలో వచ్చిన ముజ్తబా ఇరాన్‌ను మరింత ముందుకు తీసుకువెళ్తాడని నమ్ముతున్నట్లు పుతిన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి.. ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సాయుధ దురాక్రమణను ఎదుర్కొంటున్న ఇరాన్‌కు ముజ్తబా అవసరమన్నారు. శుక్రవారం ఇరాన్ అధ్యక్షుడితో మాట్లాడిన పుతిన్ ఇరాన్ మాజీ సుప్రీం ఖమేనీ సహా ఇతర నేతల మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

# సోషల్ మీడియా రాష్ట్ర ఉత్తమ హాస్యనటుడుగా పల్లె రాములు


**కళాసేవకు గుర్తింపుగా పల్లె రాములుకు దక్కిన గౌరవం**



**వరంగల్ ప్రతినిధి,మార్చి9 (జనంసాక్షి):** కళాసేవను నమ్ముకుని వివిధ కార్యక్రమాలు చేపట్టిన పల్లె రాములు అందుకు గుర్తింపుగా అరుదైన గౌరవం దక్కింది. కళారంగంలో తనకంటు ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుని, తెలంగాణ యాస బాషలతో తనదైన పద్ధతిలో పల్లే బతుకులను ప్రపంచానికి చాటిచెప్పుతున్న, పల్లె రాములు తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఉత్తమ హస్యనటుడుగా ఎంపియ్యారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేస్తూ ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యపరిచే విషయాలను తనదైన పద్ధతిలో వ్యంగ్యంగ వివరిస్తూ తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకన్నారు పల్లే రాములు. పల్లే రాములు యూట్యూబ్ చానల్ పేరుతో తను తీస్తున్న షార్ట్ ఫిలిమ్స్ పల్లేల్లోని జీవన విదానాలు, పద్ధతులను కళ్ళకు కట్టినట్టుగా చూపిస్తుంటారు..ఇది గుర్తించిన శ్రీ వివేకానంద సేవా సమితి నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమంలో భాగంగ పల్లె రాములుకు ఈ అవార్డును ఇస్తున్నట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా పల్లే రాములు మాట్లాడుతూ ఇలాంటి సత్కారాలకు, నా పేరు ప్రతిష్టలకు కారణం తనను అభిమానిస్తున్న తెలుగు ప్రజల అభిమానమే అని అన్నారు.ఈ అవార్డుతో నాకు మరింత బాద్యత పెరిగిందని తెలిపారు. ఇందుకోసం నా వీడియోలు చూస్తున్న ప్రతీ ఒక్కరినీ సాధ్యమైనంత వరకు నవ్విస్తూనే ఉంటానని అవార్డు గ్రహీత పల్లె రాములు తెలిపారు.

# అక్షర యోధులకు 50 ఏళ్లు

**ఈనాడు జర్నలిజం మొదటి బ్యాచ్ విద్యార్థుల స్వర్ణోత్సవ సమావేశం**



హైదరాబాద్, మార్చి 09 (జనంసాక్షి) : జర్నలిజం ఒరవడిలో ఈనాడు సరికొత్త అధ్యయనాన్ని నమోదు చేసిందని మొదటి బ్యాచ్ జర్నలిజం విద్యార్థి దేవులపల్లి అమర్ అన్నారు. ఈనాడు నేర్పిన అక్షరాలు, అనుభవాలు తమకు జీవితకాలం పనికొచ్చాయని ఆయన కొనియాడారు. ఈనాడు జర్నలిజం మొదటి బ్యాచ్ విద్యార్థుల స్వర్ణోత్సవ సమావేశం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నాడు ఘనంగా జరిగింది. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్వర్ణాక్షరి అర్థ శతాబ్దపు నాటి జ్ఞాపకాల విషయ సంచికను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ దేవులపల్లి అమర్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించగా.. ఐదు దశాబ్దాల సుధీర్గా జర్నలిజం చరిత్రలో అప్పటి బ్యాచ్ వారిని కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈనాడు జర్నలిజం మొదటి బ్యాచ్ విద్యార్థులు దండమూడి సుష్మ, దేవులపల్లి అమర్, మంగురు రాజగోపాల్, ఏ .విశ్వేశ్వర్ రెడ్డి, యడ వెల్లి మూర్తి, నిడమర్తి రాజశేఖర్,హారంపూడి రామశేషు, వంగరి శ్యామసుందర్, జి.వీఎస్ మూర్తి, ఎస్ .బాలిరెడ్డి రేసుమాను భాషలను ఈ సందర్భంగా శాలువులతో జ్ఞాపకలతో కే శ్రీనివాస్ రెడ్డి సత్కరించారు.

సుదీర్ఘ జర్నలిజం ప్రయాణం సాగించిన ఈనాడు జర్నలిజం మొదటి బ్యాచ్ వారిని కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని శ్రీనివాస్ రెడ్డి సందర్భంగా చెప్పారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఈనాడు ఒక చరిత్రగా నిలిచిపోయిందని, ఇందులో కష్టపడినవారు, నష్టపోయినవారు, పైకొచ్చినవారు ఈనాడు బ్రాండ్ అని గర్వంగా చెప్పుకునే పరిస్థితి ఉందని శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. స్వర్గీయ రామోజీరావుతో ఉన్న అనుబంధాన్ని శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. స్వర్ణాక్షరి అర్థ శతాబ్దపు నాటి జ్ఞాపకాల సంచికను ప్రెస్‌క్లబ్ పాలకమండలి రూపొందించడం అభినందనీయమని శ్రీనివాస్ రెడ్డి ప్రశంసించారు. ఈ ఆత్మీయ కలయిక భవిష్యత్తులో కూడా కొనసాగాలని శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ ఆత్మీయ స్వర్ణ కలయిక ఏర్పాటుకు అంగీకరించిన సీనియర్ జర్నలిస్టులకు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయకుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, జర్నలిస్ట్ సంఘం నేతలు కే. నరేందర్ రెడ్డి సహా ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షులు అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్, ప్రెస్‌క్లబ్ ఈసీ సభ్యులు అమిత్ బట్టు, ఉమా దేవి, రచన ముదుంబి తదితరులు పాల్గొన్నారు.



# రిటైర్డ్ అయ్యాను మహాప్రభో..!

**కోర్టు చెప్పినా అందని బెనిఫిట్స్**

- తీవ్ర ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న రిటైర్డ్ హెచ్ఎం ఫ్యామిలీ
- కుటుంబ ప్రాణాలను కాపాడాలని హన్మంతు వేడుకోలు



**గద్వాల టౌన్, మార్చి 09 (జనంసాక్షి) :** ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దిన తాను, ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడు తున్నానని.. రిటైర్మెంట్ అయినప్పటికీ ప్రభుత్వం తరపున అందాల్సిన బెనిఫిట్స్ నేటికీ రాలేదని అలంపూర్ తాలూకాకు చెందిన పెన్షన్ బాధితుడు (రిటైర్డ్ హెచ్ఎం) డి హనుమంతు కన్నీరుమున్నీరవుతున్నాడు. ఈ మేరకు 'జనంసాక్షి'తో తన ఆవేదనను పంచుకున్నాడు. 2020 జులై 31న ధరూర్ మండలంలో వృత్తి నుంచి ఉద్యోగ విరమణ పొందానని తెలిపాడు. ప్రస్తుతం ఎర్నార్డ్ లీవ్ బిల్లు రాక, కుటుంబ సభ్యుల అనారోగ్యాలు తీవ్రమై తన భార్య, కొడుకు, కూతురు ఎవరూ ఆదుకోలేని స్థితిలో ఉండిపోయామని ఆవేదన వెలిబుచ్చాడు. గత సర్కారు మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా సమస్యను వెంటనే పరిష్కరించడం లేదని వాపోయాడు. న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ ఏడు నెలలు గడిచిపోతున్నా న్యాయం దక్కలేదని, సంఘాలకు మొరపెట్టుకున్నా అతీగతీ లేదని బరువైన హృదయంతో పేర్కొన్నాడు. తనకు మామూళ్లు ఇచ్చుకుని పనిచేసుకునే శక్తి లేదని, తనకంటే వెనుక కోర్టు ఆర్డర్ పొందిన ఐదుగురికి అన్ని బిల్లులు గద్వాల జిల్లాలోనే వచ్చినట్టు తెలిపాడు. దీనివెనుక ఏం జరిగిందో మంజూరు చేసిన అధికారులకే తెలియాలని దీనంగా చెప్పాడు. దాచుకొని పొదుపు చేసుకున్న డబ్బులు సకాలంలో ఇవ్వనందున కొందరు పెన్షన్ బాధితులు చనిపోయారని, ఆ కోవలో మా పేరు చేరకుండా చూడాలని విన్నవించుకున్నాడు.

# బీసీ డిక్లరేషన్ అమలు పరచాలి

- హన్మకొండ జిల్లాకలెక్టర్ కార్యాలయం ముందుధర్నా
- పాల్గొన్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు
- కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన బీసీ హక్కుల సాధన సమితి నాయకులు



**హనుమకొండ ప్రతినిధి మార్చి 9 (జనంసాక్షి) :** ఈనెల 20న రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టే బడ్జెట్లో బీసీల సంక్షేమానికి అభివృద్ధికి 50 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. హనుమ కొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ 1930 నుండి నేటి వరకు కులగణనలో బీసీ జనాభా లెక్క తేల్చందున బహుజనులు అన్ని రంగాల్లో అవకాశం కోల్పోయారని సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా సాంఘికంగా వెనుకకు నెట్టివేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికలైన ఎన్నికలైనా 42 శాతం రిజర్వేషన్ నిర్ణయించిన తర్వాతనే జరపాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో చేసిన వాగ్దానాలను అమలు జరపకుంటే బీసీల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు .కేంద్ర ప్రభుత్వం దేశ జనగణనలో కులగణన కచ్చితంగా జరిపి తీరాలని,జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చట్టసభలలో బీసీలకు 50% రిజర్వేషన్ కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో బిసి కోటా నిర్ణయించాలని లేనిచో దేశ వ్యాప్తంగా బీసీ ఉద్యమాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహా బీసీ రక్షణ చట్టం తెచ్చి అమలు జరపాలని, రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టులన్నింటిలో బీసీలకు 50 శాతం కేటాయించి అభివృద్ధిలో బహుజనులను భాగస్వాములు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో భారత కమ్యూనిస్టు పార్టీ హనుమ కొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బి సి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కుంటి రాజేందర్, జిల్లా నాయకులు ప్రవీణ్ కుమార్, పొనుగోటి రామ్ గోపాల్ చారి, పూజారి అమృత ,పూజారి నరేందర్, సుతార్ అన్వేష్, సుతారి మహేష్, సుర పద్మ, కస్తూరి, రజిత, మడికొండ శిరీష ,వైనాల సుమలత, చామల రాణి ,బోయ దీప, కళ్యాణి, శివరాత్రి నరసింహ రాజు, పల్లపు కళ్యాణ్ పాల్గొన్నారు.

# స్త్రీ పురుష సమానత్వం దిశగా అడుగులు వేయాలి

- డీటీఎఫ్ అధ్యాపక జ్వాల ఎడిటర్ జి. కళావతి



**భువనగిరి (జనంసాక్షి) :** స్త్రీ పురుష సమానత్వం దిశగా అడుగులు వేయాలని డీటీఎఫ్ అధ్యాపక జ్వాల ఎడిటర్ జి. కళావతి అన్నారు. భువనగిరిలోని జాగృతి కాలేజ్ లో జరిగిన సమావేవంలో సయోధ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ అధ్యాపక జ్వాల ఎడిటర్ జి.కళావతి మాట్లాడుతూ కొన్ని మార్పులు జరిగినా, ఇంకా అత్యధికంగా ఆడపిల్ల అనే ఆలోచనలో తల్లిదండ్రులు ఉన్నారని, స్త్రీ పురుష సమానత్వం దిశగా మనం చాలా అడుగులు వేయాల్సి ఉందన్నారు. సీనియర్ జర్నలిస్టు సి.వనజ మాట్లాడుతూ చిత్రా సుబ్రహ్మణ్యం నుండి నేటి నేహాదీక్షిత్ దాకా జర్నలిజంలో చేసిన కృషిని మన సమాజం గుర్తు పెట్టుకోవాలని, కాదు మన ఇళ్లలో, వ్యవసాయ రంగంలో అనేక చోట్ల పని భారం స్త్రీలదని, ఆస్తులు పురుషుల పేరిట ఈభూమి నడుస్తున్నదని, ఉత్పత్తి పునరుత్పత్తి వ్యవస్థలపై ఇదంతా స్త్రీలే మోస్తున్నారని అన్నారు. కె. రమాదేవి డీటీఎఫ్ అధ్యక్షత వహించిన ఈ సభలో అన్నంపట్ల అపర్ణ పాడిన పాటలు అలరించాయి, ఆలోచింపజేశాయి. 11వ వార్డు కౌన్సిలర్ గంజి శ్రీవాణి, మలుపు ప్రచురణ కర్త బద్దం శోభారాణి పాల్గొన్నారు. మలుపు, తెలంగాణ సాహితి, సామాజిక చైతన్య సమితి, సామాజిక అధ్యయన వేదిక, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్‌ల నిర్వహణలో సమావేశం విజయవంతమైంది.

# ఇండస్ట్రీలకు అనుగుణంగా నైపుణ్యాలు

- 99 రోజుల ప్రణాళికలో ఐటీఐలో ఆధునిక కోర్సులు
- కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ లో నూతన స్వల్పకాలిక కోర్సులను రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎన్‌సీ మెషిన్ ఆపరేషన్, రోబోటిక్స్, ఈవీ టెక్నాలజీ, ప్రొడక్ట్ డిజైనింగ్ వంటి ఆధునిక కోర్సులను ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. యువతకు ఆధునిక నైపుణ్యాలు పెంచి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, అధికారులు, ట్రైనర్లు పాల్గొన్నారు. ఏటీసీ, ఐటీఐ విద్యార్థులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ఈ ప్రణాళికలో తీసుకున్న నిర్ణయాలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన యువత అందుబాటులో లేరని అనేక పరిశ్రమలు చెబుతున్నాయని, అందుకే ఇండస్ట్రీలకు అవసరమైన స్కిల్ సెట్స్‌ను విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి ఉండాలని, నైపుణ్యాలను పెంపొందించు కోవాలని సూచించారు. దేవిధంగా టామ్‌కామ్ ద్వారా విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా శిక్షణ అందిస్తున్నామని, విదేశాల్లో మెరుగైన వేతనాలతో మంచి అవకాశాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఏటీసీల నుంచి ఇప్పటికే పలువురు విద్యార్థులు ఉద్యోగాల్లో చేరుతున్నారని, భవిష్యత్తులో జిల్లాల వారీగా జాబ్ మేళాలు కూడా నిర్వహించనున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు.

# రెండేండ్లలోనే భారీ అభివృద్ధి పనులు పూర్తి చేశాం

- ఉమ్మడి వరంగల్ జిల్లా రూపురేఖలు మార్చే అతిపెద్ద ప్రాజెక్ట్ యూజీడీ
- రూ.5257 కోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి పరిపాలన అనుమతి..
- బాణసంచా పేల్చి సంబరాలు చేసిన కాంగ్రెస్ నేతలు..



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 9 (జనం సాక్షి) :** ఉమ్మడి వరంగల్ జిల్లా రూపురేఖలు మార్చే అతిపెద్ద ప్రాజెక్ట్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అని వరంగల్ కూడా చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి అన్నారు.సోమవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇనగాల అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా రూపురేఖలు పూర్తిగా మారబోతున్నాయని అన్నారు. ఇది ఒక్కరి కృషి కాదని, ప్రజల ఆశీస్సులు, ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషి ఫలితమని తెలిపారు. గతంలో ఎంతోమంది నాయకులు రాజకీయ స్వలాభాల కోసం మాత్రమే పనిచేశారని, కానీ అభివృద్ధి విషయంలో మాత్రం ప్రజలను నిరాశపరిచారని విమర్శించారు.వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని గత పాలకులు ఎన్నోసార్లు చెప్పినా ఆచరణలోకి తీసుకురాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని చెప్పారు. వరంగల్ త్రినగరికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, మామునూరు విమానాశ్రయం ఏర్పాటు, నగర మాస్టర్ ప్లాన్ అమలు వంటి కీలక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.5257.20 కోట్ల నిధులను కేటాయిస్తూ జీఓ నెంబర్ 322 ద్వారా పరిపాలన పరమైన అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. మామునూరు విమానాశ్రయ ఏర్పాటుకు వేగంగా భూసేకరణ చేపట్టి రూ.309 కోట్లకు పైగా నిధులు కేటాయించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. "ఊర్లో పెళ్లికి కుక్కల అరుపులు అన్నట్లు" వారి వ్యాఖ్యలు ప్రజల్లో ప్రాధాన్యం పొందవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ప్రారంభిస్తే వాటిని చూసి ఇతర పార్టీలు పాలాభిషేకాలు చేసుకోవడం విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీల నాయకులు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. గత పదేళ్లలో వారు తెచ్చిన నిధులు ఎన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో తెచ్చిన నిధులు ఎన్ని అన్నది ప్రజల ముందు చర్చించేందుకు సిద్ధమని తెలిపారు.అనంతరం కాంగ్రెస్ శ్రేణులు అందరూ హనుమకొండ జిల్లా కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నిక రద్దు

**బిజెపి అభ్యర్థిని విజేతగా ప్రకటన**

**భోపాల్, మార్చి 9(జనంసాక్షి) :** ఉప ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్నికను హైకోర్టు రద్దు చేసింది. తర్వాత స్థానంలో నిలిచిన బీజేపీ నేతను విజేతగా ప్రకటించింది. అయితే ఈ తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేసేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యేకు వారం గడువు ఇచ్చింది. మధ్యప్రదేశ్‌లోని విజయ్‌పూర్ అసెంబ్లీ స్థానానికి గత ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ముఖేష్ మల్హోత్రా గెలిచారు. ఆ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో క్రిమినల్ కేసుల గురించి కీలకమైన సమాచారాన్ని ముఖేష్ మల్హోత్రా దాచిపెట్టినట్లు బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి రాంనివాస్ రావత్ ఆరోపించారు.

# పాదచారులపైకి దూసుకెళ్లిన బస్సు..

- ఇద్దరు మృతి.. బస్సును తగలబెట్టిన స్థానికులు

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఢిల్లీలోని నంగ్లోయి ప్రాంతంలో దారుణం జరిగింది. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (డీటీసీ)కి చెందిన బస్సు పాదచారులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సోమవారం ఉదయం, నంగ్లోయి ప్రాంతంలో జరిగింది. ఈ ఘటనతో స్తానికులు కోపోద్రిక్తులయ్యారు. ప్రమాదానికి కారణమైన బస్సును ధ్వంసం చేసి, దహనం చేసేందుకు ప్రయత్నించారు.సోమవారం ఉదయం బస్సు వేగంగా వెళ్తూ స్కూటీపై వెళ్తున్న ఒక యువకుడిని, అలాగే ఇ-రిక్షా కార్మికుడిని, మరికొందరిని ఢీకొంది. ఈ ఘటనలో స్కూటీపై ఉన్న యువకుడిపైకి బస్సు ఎక్కడంతో అతడు అక్కడే మరణించాడు. అలాగే మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఇంకొందరు గాయపడ్డట్లు సమాచారం. ప్రమాద ఘటనతో స్థానికులు ఆగ్రహానికి గురయ్యారు. బస్సు అద్దాల్ని ధ్వంసం చేశారు. బస్సుకు నిప్పు పెట్టారు. దీనిపై పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది గంటపాటు శ్రమించి మంటలు ఆర్పేశారు. ఉద్రిక్తతలు తలెత్తకుండా అక్కడి ఆందోళనకారులను చెదరగొట్టారు.

# ఆర్థిక సంక్షోభంతో తగ్గుతున్న పసిడిధరలు

- బంగారం, వెండిపై స్వల్పంగా తగ్గుదల

**న్యూఢిల్లీ, మార్చి 9 (జనంసాక్షి) :** గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ.5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారం ఉదయం 10:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,61,680కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే దాదాపు రూ.1960 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,48,200 దగ్గర ఉంది. ముందటి రోజు ధరతో పోల్చుకుంటే రూ.1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది. బుధవారం కిలోకు రూ.5 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.80 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2.90 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచించారు.

# ప్రజారోగ్యం మీద దృష్టి పెట్టండి

- పాలకల్తీ బాధితులను ఆస్పత్రిలో పరామర్శించిన షర్మిల

**అమరావతి, మార్చి9 (జనంసాక్షి) :** కల్తీ పాలు తాగిన ఘటనలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం రాజమండ్రి ఆసుపత్రిలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం గురించి తెలుసుకొని, బాధిత కుటుంబాలను ఓదర్చారు. ఈ ఘటనలో 11 మంది మరణించగా, ఇంకా 9 మంది ప్రాణాలతో కొట్టుమిట్టాడటం చూస్తే, రాష్ట్రంలో కనీసం స్వచ్ఛమైన పాలు కూడా అందించడంలో నిఘా పెట్టలేని ప్రభుత్వం ఉంటే ఎంత ఊడితే ఎంత అంటూ మండిపడ్డారు. ఏఐ మీద పెట్టే శ్రద్ధలో పావు వంతైనా ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రజారోగ్యం మీద పెట్టాలని సూచించారు. రాజమం డ్రి కల్తీ పాల ఘటనలో సంభవించిన 11 మరణాలు ప్రభుత్వం చేసిన హత్యలేనని ఆరోపించారు. చనిపోయిన కుటుం బాలకు 25 లక్షల పరిహారం ఇవ్వాలని, చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
10 మార్చి 2026

## అంతర్జాతీయ ఖ్యాతి సాధించిన

# 'గంగదేవిపల్లి' ఆత్మ

భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే దాగి ఉందని మహాత్మా గాంధీ చెప్పిన మాటలకు సజీవ రూపం వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని "గంగదేవిపల్లి" గ్రామం. ఈ గ్రామ పంచాయతీని దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిపిన నేత కూసం రాజమౌళి (74). ఆయన8-3-2026న ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. వరంగల్‌కు చికిత్స తీసుకెళ్తుండగా మార్గమధ్యలో తుది శ్వాస విడిచిన కూసం రాజమౌళి తెలంగాణ గ్రామీణ వికాస చరిత్రలో ఒక చెరగని గీటురాయి. రెండు దశాబ్దాలుగా గ్రామ స్వరాజ్య స్వప్నాన్ని 'రామరాజ్యం'లా అమలు చేసిన సర్పంచ్ గా కూసం రాజమౌళి ఖ్యాతిగాంచారు.తన అధికారాన్ని హోదాని ఒక సామాజిక బాధ్యతగా మలిచారు. ఆయన ఆకస్మిక మరణానికి అశ్రునయనాలతో నివాళి అర్పిస్తూ, ఈ వ్యాసం కూసం రాజమౌళి చేసిన సేవలను స్మరిస్తుంది. "గంగదేవిపల్లి" గ్రామ పంచాయతీని ఒక మోడల్‌గా ప్రపంచవ్యాప్తంగా పేరు పొందేలా చేశారు.



గంగదేవిపల్లి చరిత్రలో కూసం రాజమౌళి పాత్ర సామా న్యుడు సాధించిన అసామాన్య విజయానికి చిహ్నం. 1994లో మచ్చాపురం గ్రామం నుంచి ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిన ఈ గ్రామం, 1995 ఎన్నికల్లో కూసం రాజమౌళి ఆధ్వర్యంలో భార్య కూసం లలితను సర్పంచ్‌గా, 10 మంది మహిళలను వార్డు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మహిళా సాధికారతకు మొదటి అడుగు వేసింది. 2001లో మళ్లీ లలితనే రీ-ఎలెక్ట్ చేసుకున్న గ్రామస్తులు, 2006-2011 మధ్య కూసం రాజమౌళిని సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. 2013లో సీటు రిజర్వేషన్ కారణంగా ఉపసర్పంచ్‌గా కొనసాగిన కూసం రాజమౌళి, 2019 వరకు ఈ పదవిలో సేవలందించారు. ఇక్కడి ప్రజలు, ముఖ్యంగా మహిళలను, యువతను, కూసం రాజమౌళి నాయకత్వంలో భాగ స్వాములుగా మలిచారు. తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ డేటా ప్రకారం, గ్రామంలో 360 గృహాలతో 1,500 మంది జనాభాతో ఉంది, ఎస్సీ/ఎస్టీ లకు 30 శాతం రిజర్వేషన్‌తో సమతుల్య సామాజిక నిర్మాణం కలిగి ఉంది.

కూసం రాజమౌళి విజన్ కేవలం కాంక్రీటు అభివృద్ధి కాదు, ప్రజల మనసుల మార్పుకు కేంద్రీకృతమై ఉండేది. "సమష్టి భాగస్వామ్యం" మే ఆయన ఆయుధం. గ్రామంలో ఏ పనైనా అందరినీ భాగస్వాము లను చేశారు, వారిలో బాధ్యతాయుత భావాన్ని పెంపొందించారు. అందు కోసం 18 రకాల కమిటీలు ఏర్పాటు చేశారు - విద్య, వైద్యం, పారిశుద్ధి, తాగునీరు, ఇంకుడు గుంతల నిర్మాణం, పొదుపు సంఘాలు వంటివి. ఇందులో మహిళలకు 60 శాతం స్థానాలు కేటాయించడం ద్వారా జెండర్ సమతుల్యతను నిర్ధారించారు. తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ (ఆర్.డీ.డీ.) నివేదికల ప్రకారం, ఈ కమిటీలు 90 శాతం పైగా స్వయం-నిర్ణయాత్మకంగా పనిచేశా యి. గ్రామ బడ్జెట్‌లో 40 శాతం నిధులను సమర్థవంతంగా ఉపయోగించాయి. ఇది గాంధీయ 'గ్రామ స్వరాజ్యం' సిద్ధాంతానికి అనుగుణంగా, ప్రభుత్వ నిధులను ప్రజల శ్రమతో మలిచిన మోడల్. ఈ మోడల్‌లోని మొదటి విప్లవాత్మక నిర్ణయం మద్యపాన నిషేధం. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కూసం రాజమౌళి ప్రతిపాదన చేసిన ఈ నిషేధం, పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించింది. 100 శాతం ప్రవర్తనా మార్పును సాధించింది. ఫలితంగా, గ్రామంలో దాదాపు జీరో క్రైమ్ రేట్, ఆరోగ్యకరమైన సెక్స్ రేషియో (950:1000) సాధించబడింది. విద్యా రంగంలో 2002 నాటికి 100 శాతం అక్షరాస్యత సాధించడం ద్వారా గ్రామం దేశ దృష్టిని ఆకర్షించింది. ప్రతి ఇంటికీ బ్యాంక్ ఖాతా, మహిళా పొదుపు సంఘాల ద్వారా రూ.5 కోట్ల పైగా సేకరణలు... ఇవి ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేశాయి. మౌలిక సదుపాయాల్లో ఇంటింటికీ మరుగుదొడ్డులు (100 శాతం కవరేజ్), ఇంకుడు గుంతలు (ప్రతి 2 కి.మీ.కు ఒకటి), తాగునీరు (రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్‌తో 80 శాతం గ్రౌండ్‌వాటర్ రీఛార్జ్) వంటివి గ్రామాన్ని 'స్మార్ట్ విలేజ్'గా మలిచాయి. ఆంధ్రా బ్యాంక్ పట్టణాభి వృద్ధి మోడల్ విలేజ్ స్కీమ్ కింద దత్తత్వం తీసుకున్న గ్రామం అయింది. ప్రస్తుతం తెలంగాణ (ఆర్.డీ.డీ.) కింద 'గ్రామజ్యోతి' కార్యక్రమానికి మోడల్‌గా నిలుస్తోంది.

కూసం రాజమౌళి కృషికి అవార్డులు ఎన్నో. 1999లో కలెక్టర్ నగదు అవా ర్డు, 2002లో 100 శాతం అక్షరాస్య తకు రాష్ట్ర స్థాయి గుర్తింపు, 2005లో వైఎస్ రాజశేఖర రెడ్డి చేత రాష్ట్ర ఆదర్శ గ్రామ అవార్డు, 2007లో రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేత 'నిర్మల్ గ్రామ్ పురస్కారం' - మొదలై, నాలుగుసార్లు ఉత్తమ పంచాయతీ (ఉమ్మడి వరంగల్‌లో), రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో, నాలుగుసార్లు జాతీయ స్థాయి అవార్డులు సాధించింది. 'భీమా గ్రామ్' అవార్డు కోసం ఇరిగేషన్ ట్యాంక్‌ను సర్కులేషన్ పాయింట్‌గా మలిచారు. 2007లో 'ఇండియా'స్ బెస్ట్ పంచాయత్'గా ఎంపికై, ఐక్యరాజ్యసమితి ప్రతిని ధుల దృష్టిని ఆకర్షించింది. ఈ గ్రామాన్ని ప్రధానులు, ముఖ్య మంత్రులు సందర్శించారు. 100ం దేశాల నుండి 20,000 మంది విజిటర్లు (ప్రతి సంవత్సరం 1,000 మంది) కనీసం సందర్శిస్తారు. ఈ గంగాదేవిపల్లి 400 గ్రామాలకు ప్రేరణగా నిలిచింది. ఈ గుర్తింపు క్రెడిట్ అంతా కూసం రాజమౌళి అకుంఠిత దీక్షకే అంకితం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూసం రాజమౌళి కృషికి మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు (కేసీఆర్) ప్రత్యేక గుర్తింపు ఇచ్చారు. 2015 ఆగస్టు 17న గ్రామాన్ని సందర్శించి 'గ్రామజ్యోతి' కార్యక్రమాన్ని ప్రారంభించి, రూ.10 కోట్లు కేటాయించారు. దీనితో జిల్లా ట్రైనింగ్ సెంటర్, రోడ్లు, పార్కులు నిర్మించబడ్డాయి. 2019లో కూసం రాజమౌళిని జిల్లా శిక్షణ మేనేజర్ (డీటుఈఎం)గా నియమించి, నెలకు రూ.30 వేల పారితోషికంతో రాష్ట్రవ్యాప్త శిక్షణలు ఇప్పించారు. విదేశీ పర్యాటకులు, ప్రజాప్రతినిధులకు ఈ గ్రామం ఒక మోడల్ శిక్షణా కేంద్రం. ఈ శిక్షణ ఇచ్చిన కూసం రాజమౌళి, బీఆర్ఎస్ పాలనలో 'పల్లె ప్రగతి' కార్యక్రమానికి మార్గదర్శకులుగా నిలిచారు. కేసీఆర్ కూసం రాజమౌళి మరణానికి ప్రకటించిన సంతాప సందేశంలో, "పల్లెల అభ్యున్నతికి అసలైన నిర్వచనం కూసం రాజమౌళి" అని కొనియాడారు. కూసం రాజమౌళి మరణం పంచాయతీరాజ్ వ్యవస్థకు తీరని లోటు అని, ఈ దేశ గ్రామాలు ఆదర్శ సర్పంచిని కోల్పోయాయని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. (ట్విట్టర్)లో కూడా అనేక మంది నేతలు ఆయనకు నివాళులు అర్పించారు.

**కూసం రాజమౌళి ఘనతలు, సేవా నిరతి:**

"గంగదేవిపల్లి గ్రామ పంచాయతీ మోడల్ "గ్రామీణాభివృద్ధికి పారాడైమ్ షిఫ్ట్ గా ఉదహరిస్తారు. సాధారణ గ్రామాల్లో 60-70 శాతం అక్షరాస్యత ఉంటుండగా, ఇక్కడ 100 శాతం సాధించడం ద్వారా (ఎస్.డీ.జీ- 4) (క్వాలిటీ ఎడ్యుకేషన్)ను ముందుగా అమలు చేశారు. మద్య నిషేధం (ఎస్.డీ.జీ.- 3) (గుడ్ హెల్త్)కు, మరుగుదొడ్డులు (ఎస్.డీ.జీ- 6 ) (క్లీన్ వాటర్)కు సంబంధించినవి. తెలంగాణ (ఆర్.డీ.డీ.) గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో 50 శాతం గ్రామాల్లో మాత్రమే 80 శాతం తాగునీరు కవరేజ్ ఉండగా, గంగదేవిపల్లిలో 100 శాతం సాధించడం ప్రజా-రాజకీయ ఉమ్మడి భాగస్వామ్యంతో సాధించిన ఫలితంగా చెప్పుకోవాలి. ఆర్థికంగా, పొదుపు సంఘాలు మహిళల ఆదాయాన్ని 30 శాతం పెంచాయి, గ్రామ జీడీపీ ని రూ.2 కోట్ల నుంచి రూ.15 కోట్లకు ఎదుగుస్తున్నాయి (వీక్లీ పీడీ డేటా ప్రకారం). ఇది కేవలం లోకల్ సక్సెస్ కాదు; 400 గ్రామాలు అనుసరించడం ద్వారా స్కేలబుల్ మోడల్‌గా నిలిచింది. అయితే, మార్కెటింగ్ ఒడిదొడుకులు , వాతావరణం మార్పులతో వర్షాకాల మార్పులు వంటి సవాళ్లను కూసం రాజమౌళి ప్రజా ఐక్యత వారి ఉమ్మడి భాగస్వామ్యంతో ఆ సమస్యలు అధిగమించారు. ఇది నేటి డిజిటల్ యుగంలో ఈ-పంచాయత్‌లతో మరింత బలపడుతుంది.

కూసం రాజమౌళి జీవితం, ఆయన నాయకత్వం లక్షణాలు నేటి యువ తరానికి పాఠ్య పుస్తకం. అధికారం అంటే "సేవ" అని ఆయన నిరూపించారు. ప్రజల మనసులను గెలిచి , వారి ఉమ్మడి శ్రమను గ్రామ అభివృద్ధికి జోడించారు. కూసం రాజమౌళి ప్రస్తుతం భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా, ఆయన కృషి తో తీర్చిదిద్దిన 'గంగదేవిపల్లి మోడల్' అనేది దేశానికి ఒక సజీవంగా ప్రతీకగా ఉంటుంది - మన దేశంలో ప్రతి పల్లె ఈ గంగదేవిపల్లి లక్ష్యాలను,ఆదర్శాలను అందిపుచ్చుకోవాల్సి ఉంటుంది. కూసం రాజమౌళి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి , బంధుమిత్రులకు నాసానుభూతి. ఈ వారసత్వం తెలంగాణ గ్రామీణాభివృద్ధికి ఒక అఖండ దీపంగా వెలుగుతుంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

## పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాలు

మధ్యప్రాచ్యంలో జరుగుతున్న తాజా యుద్ధం ప్రధానంగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరిగిన ప్రతిదాడులు, క్షిపణి దాడులు, డ్రోన్ దాడుల వల్ల తీవ్రంగా ముదిరింది. అయితే ఈ యుద్ధంలో ఎవరికీ ఎక్కువ నష్టం జరిగింది అనే ప్రశ్నకు సమాధానం ఇవ్వాలంటే సైనిక నష్టం, ఆర్థిక నష్టం, మానవ ప్రాణనష్టం, వ్యూహాత్మక ప్రభావం అనే నాలుగు కోణాల్లో పరిశీలించాల్సి ఉంటుంది.

చూస్తే, అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం ఈ ఘర్షణలో అత్యధిక మానవ నష్టం ఇరాన్ వైపే జరిగింది. అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల వల్ల ఇరాన్‌లోని కొన్ని సైనిక స్థావరాలు, ఆయుధ నిల్వ కేంద్రాలు, చమురు నిల్వ కేంద్రాలు లక్ష్యంగా మారాయి. కొన్ని విశ్లేషణల ప్రకారం ఇరాన్‌లో సైనికులు మరియు పౌరులు కలిపి వందల నుండి వెయ్యికి పైగా మరణాలు జరిగి ఉండవచ్చని అంచనాలు ఉన్నాయి. మరోవైపు ఇజ్రాయెల్‌లో కూడా క్షిపణి దాడుల వల్ల పౌరులు మరణించినప్పటికీ సంఖ్య పరంగా అది తక్కువగా ఉందని అనేక అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు.

ఇది ఎందుకు జరిగిందంటే ప్రధాన కారణం ఇజ్రాయెల్ యొక్క రక్షణ వ్యవస్థ. ఇజ్రాయెల్ దగ్గర ఉన్న ప్రసిద్ధ రక్షణ వ్యవస్థ ఐరన్ డోమ్ (×తీశీఅ ఱశీవఎ ) అనేది క్షిపణులను గాల్లోనే అడ్డుకుంటుంది. ఇరాన్ నుండి ప్రయోగించిన అనేక బ్యాలిస్టిక్ క్షిపణులు ఈ వ్యవస్థ వల్ల లక్ష్యానికి చేరకముందే పేలిపోయాయి. అందువల్ల పెద్ద స్థాయి నగర విధ్వంసం తగ్గింది. అయినప్పటికీ కొన్నిక్షిపణులు రక్షణ వ్యవస్థను దాటడంతో టెల్ అవివ్, హైఫా వంటి నగరాల్లో భవనాలు దెబ్బతిన్నాయి.

పరిస్థితి కొంత భిన్నంగా ఉంటుంది. ఇజ్రాయెల్ చాలా ఆధునిక సాంకేతికతను ఉపయోగించే దేశం. డ్రోన్లు, సైబర్ యుద్ధం, గూఢచారి వ్యవస్థలతో కూడిన సమగ్ర యుద్ధ వ్యూహాన్ని అది ఉపయోగిస్తుంది. ఈ కారణంగా ఇరాన్‌లోని కొన్ని కీలక సైనిక స్థావరాలు దెబ్బతిన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా క్షిపణి నిల్వ కేంద్రాలు, రాడార్ వ్యవస్థలు, ఆయుధ తయారీ కేంద్రాలు లక్ష్యంగా మారాయి. మరోవైపు ఇరాన్ కూడా ప్రతీకారంగా భారీ క్షిపణి దాడులు చేసింది. అయితే ఇజ్రాయెల్ సైనిక మౌలిక వసతులు పూర్తిగా దెబ్బతిన్నట్లు ఆధారాలు తక్కువగా ఉన్నాయి.

ఇరాన్ పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంది. ఇరాన్ ఇప్పటికే అంతర్జాతీయ ఆంక్షలతో బాధపడుతున్న దేశం. అమెరికా మరియు పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆంక్షలు కారణంగా ఇరాన్ ఆర్థిక వ్యవస్థ చాలా కాలంగా ఒత్తిడిలో ఉంది. యుద్ధం వల్ల చమురు నిల్వ కేంద్రాలు, పరిశ్రమలు దెబ్బతింటే ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉంది. మరోవైపు ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ యుద్ధ పరిస్థితుల వల్ల పెట్టుబడులు తగ్గడం, పర్యాటకం నిలిచిపోవడం వంటి ప్రభావాలు కనిపిస్తున్నాయి.

రెండు దేశాలకు కూడా ప్రమాదంలో ఉన్నాయి. ఇరాన్ ప్రధానంగా మధ్యప్రాచ్యంలో తన ప్రభావాన్ని పెంచుకోవాలని చూస్తోంది. ఈ యుద్ధం దీర్ఘకాలంగా కొనసాగితే ఇరాన్ మద్దతు గల మిలీషియా బలగాలు లెబనాన్, సిరియా, ఇరాక్ ప్రాంతాల్లో మరింత చురుకుగా మారే అవకాశం ఉంది. అదే సమయంలో ఇజ్రాయెల్ కూడా తన భద్రతను కాపాడుకోవడానికి భారీ సైనిక చర్యలు కొనసాగిస్తోంది. ఈ యుద్ధంలో మరో ముఖ్య అంశం అంతర్జాతీయ రాజకీయాలు. అమెరికా స్పష్టంగా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తోంది. మరోవైపు కొన్ని విశ్లేషకులు రష్యా , చైనా నార్త్ కొరియా ఇరాన్‌కు రాజకీయంగా మద్దతు ఇవ్వవచ్చని భావిస్తున్నారు. ఈ పరిస్థితి యుద్ధాన్ని ప్రాంతీయ ఘర్షణ నుండి పెద్ద అంతర్జాతీయ సంక్షోభంగా మారే ప్రమాదం ఉంది.

మానసిక మరియు సామాజిక ప్రభావం:

యుద్ధంలో ఈ ఎత్తుగడ కూడా పెద్ద అంశమే. ఇజ్రాయెల్ నగరాల్లో ప్రజలు నిరంతరం బంకర్లలోకి వెళ్లాల్సి వస్తోంది. పిల్లలు, వృద్ధులు భయంతో జీవిస్తున్నారు. మరోవైపు ఇరాన్‌లో కూడా వైమానిక దాడుల భయం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. యుద్ధం అంటే కేవలం సైనికుల మధ్య పోరు కాదు; సాధారణ ప్రజల జీవితాలపై పడే భారమూ చాలా ఎక్కువ.

అన్ని అంశాలను కలిపి స్థూలంగా పరిశీలిస్తే ప్రస్తుతం ఈ యుద్ధంలో తక్షణ మానవ నష్టం మరియు మౌలిక వసతుల నష్టం పరంగా ఇరాన్ వైపు ఎక్కువ ప్రభావం కనిపిస్తోంది. అయితే భద్రతా ఒత్తిడి మరియు నిరంతర క్షిపణి భయం పరంగా ఇజ్రాయెల్ కూడా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దీర్ఘకాలంగా యుద్ధం కొనసాగితే రెండు దేశాలకూ భారీ ఆర్థిక, సామాజిక నష్టం తప్పదు.

అందుకే అనేక అంతర్జాతీయ విశ్లేషకులు ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతున్నారు: యుద్ధంలో నిజంగా గెలిచేవారు ఎవరూ ఉండరు. చివరికి ఓడిపోవేది సాధారణ ప్రజలే. మధ్యప్రాచ్యంలో ఇప్పటికే ఎన్నో యుద్ధాలు జరిగినప్పటికీ శాంతి స్థిరపడకపోవడానికి ఇదే కారణం.

చివరిగా...ఈ ఘర్షణలో తక్షణంగా ఎక్కువ నష్టం ఇరాన్‌కు జరిగినట్లు కనిపిస్తున్నప్పటికీ, యుద్ధం కొనసాగితే ఇరాన్-ఇజ్రాయెల్ రెండూ భారీ ధర చెల్లించాల్సిందే. మధ్యప్రాచ్యంలో శాంతి సాధించకపోతే ఈ ప్రాంతం మరింత పెద్ద యుద్ధ వేదికగా మారే ప్రమాదం ఉంది.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్. 9849328496.

## విజ్ఞాన వెలుగుల

# విప్లవ జ్యోతి



భారతీయ సామాజిక వ్యవస్థలో శతాబ్దాలుగా దళిత ,బహుజనులతో పాటు మహిళలు విముక్తికి దూరమైనారు. చారిత్రకంగా శూద్ర మహిళలు కుల వ్యవస్థతో విద్యకు నోచుకోలేదు. విద్యపై, ఆస్తిపై హక్కులేకపోవడం, బాల్య వివాహం, సతీ వంటి క్రూరాచారం, విధవరాలైతే కఠినమైన జీవితం వంటి చాందస భావాలు అగ్రకుల మహిళల పాలిట శాపంగా మారాయి. ఇవన్నీ భారతీయ మహిళల చరిత్రలో ముద్రపడ్డ చేదు వాస్తవాలు. అయితే ఈ కారు చీకట్ల నుంచి సమాజ మార్పు కోసం బయలుదేరిన ఆదర్శ దంపతులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే.సావిత్రిబాయి పూలే మహిళా విముక్తి దీప్తిగా చరిత్రలో నిలిచింది. 19వ శతాబ్దపు అడ్డుగోడలను ఛేదించి తన భర్త జ్యోతిరావు పూలేకు తోడుగా నిలిచింది. "నా ధర్మాన్ని నేను నెరవేరుస్తానని" మహిళలకు విముక్తి కల్పించిన సామాజిక చైతన్య దీప్తి. ఈ మాతృమూర్తి మహారాష్ట్రలోని సతారా జిల్లాలోనినాయాగవ్ గ్రామంలో 1831 జనవరి 3న ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించినది. భర్త ప్రోత్సాహంతో ఇంట్లోనే విద్యావంతురాలై, అహ్మద్ నగర్ లోని ఉపాధ్యాయ శిక్షణ పొందినది. అనంతరం ఆమె విద్య ఉద్యమానికి పునాది వేసింది. 1848లో పూలే బాలికల కోసం పూణేలో మొట్ట మొదటి పాఠశాలను ప్రారంభించారు. బాలికలకు విద్య బోధించడానికి వెళ్లే సమయంలో అగ్రకులాలు ఆమెపై రాళ్లు, చెత్త, పశువుల పేడ నీళ్ళు చల్లి తీవ్ర అవమానాలు చేసేవారు. అయినా సమాజంలో వెలుగులను నింపింది.

పూలే దంపతుల సంస్కరణలు

సావిత్రిబాయి పూలే స్త్రీలను చైతన్యపరచడానికి 1852 లో "మహిళా సేవ మండల్" సంఘాన్ని స్థాపించింది. లింగ వివక్షతకు, పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడింది. నిచ్చేన మెట్ల కుల వ్యవస్థలో సామాజిక అణిచివేతను, మూఢత్వాన్ని పారద్రోలి "సత్యాన్ని" శోధించడానికి 1873 లో భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలిసి సత్యశోధక సమాజాన్ని ప్రారంభించినది. ఈ సంస్థ బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపింది. వితంతు పునర్వివాహాల కోసం కృషి చేశారు. బాల్యంలో వైధవ్యాన్ని అనుభవించేఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోశారు. వితంతు స్త్రీల శిరోముండనంను తీవ్రంగా ఖండించి ఆపేసింది. కరువు బారిన పడి అనాధలైన పిల్లలను అక్కున చేర్చుకున్నారు. యశ్వంత్ రావు అనే అనాథ బాలున్ని దత్తపుత్రుడిగా పెంచుకున్నారు. జ్యోతిరావు పూలే మరణించిన్నప్పుడు చితికి నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపింది. తదుపరి సత్యసోధక్ సమాజ్ బాధ్యతలను స్వీకరించినది. మహారాష్ట్రలోని పూణే నగరాన్ని అతలాకుతలం చేస్తున్న తీవ్ర కరువు, ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవలందించినది. చివరకు ఆమె కూడా ప్లేగు వ్యాధి బారినపడి మార్చి 10,1897 లో తుది శ్వాసవిడిచారు. సావిత్రిబాయి పూలే ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు, సంఘసంస్కర్త, మహిళల హక్కుల కోసం కృషి చేసిన తొలి మహిళా విప్లవకారిణిగా నిలిచింది. మరి పూలే దంపతులు ఎదుర్కొన్న అవమానాలు, త్యాగాలు, కష్టాలు ఈ తరం మహిళలకు ఎంతవరకు తెలిసినాయి? అనేది ప్రశ్నార్థకమే. సావిత్రిబాయి పూలే అక్షర ఉద్యమాన్ని ముందుకు నడిపించడానికి ఆమె జయంతి రోజున రెండేళ్ల క్రితం తెలంగాణలో ధర్మ టీచర్ యూనియన్ ఏర్పడింది. విద్యను ప్రజాస్వామీకరించాలని యుద్ధం చేస్తున్నది. ఆమె జయంతినీ తెలంగాణ ప్రభుత్వం మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొంటున్నారు.

అణగారిన వర్గాల మహిళలకు అవకాశాలు అందినప్పుడే?


భారతదేశంలో చారిత్రకంగా కులవ్యవస్థ, సంప్రదాయాలు, పితృస్వామ్య ఆచారాల కారణంగా అణచివేయబడ్డ మహిళల సాధికారతకు కృషి వేసిన మొట్టమొదటి సారథులు పూలే దంపతులు, అంబేద్కర్. వారి కృషి వల్లనే ఈ రోజు అన్ని వర్గాల మహిళలు ఉపాధ్యాయురాలు కావడం, వైద్యురాలు కావడం, శాస్త్రవేత్త కావడం, రాజకీయ నాయకురాలు అవుతున్నారు. కానీ రాజ్యాంగం ద్వారా మహిళలకు జరుగుతున్న లబ్ధి అసమానంగానే ఉంది. అగ్రవర్ణ మహిళలు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవకాశాలను పొందుతున్నప్పటికీ...దళిత, బహుజన, ఆదివాసీ మహిళలు ఇంకా అనేక రకాల వేధింపులకు, దాడులకు, హింసకు బలవుతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో నాగర్ కర్నూలు జిల్లాలోని బీసీ చాకలి కుటుంబంపై అగ్రకుల దాడిలో ఒక పాప మరణం ఇందుకు నిదర్శనం. ఈ కుల ఆధిపత్యంపై డాక్టర్ విశారదన్ మహారాజ్ పోరాటం పలువురిని ఆలోచింపచేసింది. ఇప్పటికీ మహిళల పేరుతో పనిచేసే మెజారిటీ కమిషన్లు, సంస్థలు, రాజకీయ వేదికల్లో అధికంగా అగ్రకుల మహిళల ఆధిపత్యంలోనే ఉన్నాయి. దీంతో అట్టడుగు మహిళల సమస్యలు ప్రధాన చర్చల్లోకి రావడం లేదు. గ్రామాల్లో భూమిలేకుండా జీవిస్తున్న మహిళలు, మహిళ కూలీలు, కుల హింసకు గురవుతున్న మహిళల జీవితాలు ప్రధాన స్రవంతిలో కనిపించడం లేదు. భారతదేశంలో మహిళా సాధికారత గురించి మాట్లాడినట్లయితే అన్ని వర్గాల మహిళలు ఒకే పరిస్థితిలోలేరని అర్థమవుతుంది. కులం, వర్గం, ఆర్థిక స్థితి, ప్రాంతం వంటి అంశాలు మహిళల అవకాశాల నిర్ణయిస్తున్నాయి. మహిళల విముక్తి కేవలం లింగ సమానత్వంతోనే సాధ్యం కాదని, కుల ఆధిపత్యాన్ని కూడా ప్రశ్నించాల్సిందేనని స్పష్టమవుతుంది. అప్పుడే విద్య ,ఉపాధి, సంపద రాజకీయాల్లో మహిళలకు సమాన అవకాశాల లభిస్తాయి. ఇదే చదువుల తల్లి సావిత్రిబాయి పూలేకు ఘననివాళి.



సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు
7988579428

# మత్తులో మునిగిపోతున్న మన ఖజానా

## మద్యం మహమ్మారితో కుటుంబాలు చిత్తడి



భారతదేశంలో ప్రతి ఏటా లక్షలాది గృహాల్లో దీపాలు ఆరిపోతున్నాయి. యుద్ధాలు కాదు, మహమ్మారులు కాదు; మన కళ్లముందే విచ్చలవిడిగా దొరికే మద్యం. కాలేయం కాలిపోతుంది, గుండె ఆగిపోతుంది, మానసిక స్థితి చితికిపోతుంది. ఇవేవీ పట్టించుకోకుండా మత్తులో మునిగిపోతున్న సామాన్యుడి ఆర్తనాదం ఎవరికీ వినబడటం లేదు. మద్యం వెనుక చితికిపోతున్న జీవితాలు - అది కేవలం ఒక వ్యక్తి వ్యసనం మాత్రమే కాదు; కుటుంబ విచ్ఛిన్నం, గృహ హింస, మహిళలు-పిల్లల నరక తాటి. లివర్ సిరోసిస్ నుంచి గుండెపోటు వరకు మృత్యువు రకరకాల రూపాల్లో పొంగి ఉంది. ఆలోచనా శక్తిని కోల్పోయి మనిషిని పశువుగా మార్చే మాయదారి మత్తు - ఇది మన సమాజానికి ఒక నగ్న సత్యం.

ప్రజల క్షేమాన్ని కోరాల్సింది ప్రభుత్వాలే, అడుగడుగునా లిక్కర్ షాపులకు లైసెన్సులు ఇచ్చి మత్తును ఇంటి ముంగిటకు చేర్చడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఒకవైపు మద్యం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రచారం చేస్తూ, మరోవైపు రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలే లక్ష్యంగా పాలన సాగించడం ఏ రకమైన ధర్మం? ఇది కేవలం పాలనాపరమైన నిర్ణయం మాత్రమే కాదు; ఖజానా నింపుకోవడానికి కోట్లాది మంది ఆరోగ్యాన్ని బలిపీఠంపై పెట్టడం. ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రాణాల కంటే ప్రభుత్వ ఆదాయమే ఎక్కువైందా? ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) నెత్తి నొరుకుని చెబుతోంది: మద్యం అనేది కేవలం ఒక అలవాటు కాదు, అది గ్రూప్-1 కార్సినోజెన్. అంటే, శరీరంలోకి వెళ్తే నేరుగా క్యాన్సర్‌కు పునాది వేస్తుంది. సైన్స్ ఇంత స్పష్టంగా చెబుతున్నా, ప్రభుత్వాలకు మాత్రం ఇది వినిపించడం లేదు. ఎందుకంటే, అక్కడ వినిపించేది నోట్ల కట్టల చప్పుడు మాత్రమే!

అంతర్జాతీయంగా నిరూపితమైన నివేదికలు పాలకుల టేబుల్స్ మీద ఉన్నా, మద్యం వల్ల కాలేయం కుళ్ళిపోతుందని, గుండె ఆగిపోతుందని, క్యాన్సర్ కబళిస్తుందని వారికి తెలియనిది కాదు. కానీ, తెలిసీ ఆ విషాన్ని ప్రజల ముంగిట షాపుల రూపంలో పెరచి ఉంచుతున్నారు. భారతదేశంలో మద్యం అమ్మకాల తీరును చూస్తే, సంక్షేమం కంటే వ్యాపారానికే పెద్దపీట వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు సంపూర్ణ మద్యపాన నిషేధం గురించి మాట్లాడినా, చివరకు ఆదాయం కోసమే అడుగులు పడ్డాయి. తెలంగాణలో గల్లీగల్లీలో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. తమిళనాడులో 'టాస్మాక్' (ు్చూఝ్చష) ద్వారా ప్రభుత్వమే నేరుగా మద్యం వ్యాపారం చేస్తూ రికార్డు స్థాయి ఆదాయాన్ని గడుస్తోంది. ఇదంతా ఎందుకు జరుగుతోంది? సమాధానం చాలా సింపుల్: డబ్బు. ప్రభుత్వాలకు ప్రజల ప్రాణాల కంటే, వారి జేబుల్లోంచి వచ్చే మద్యం పన్నులే (Liquor Revenue) ముఖ్యమైపోయాయి.

ఒక చేత్తో సంక్షేమ పథకాలంటూ చిల్లర ఇచ్చి, మరో చేత్తో మద్యం షాపుల ద్వారా అదే పేదవాడి సంపాదనను దోచుకోవడం ఏ రకమైన పాలన? ప్రతి సంవత్సరం మద్యం షాపుల సంఖ్య పెరుగుతోంది కానీ, డీ-అడిక్షన్ సెంటర్ల సంఖ్య మాత్రం పెరగడం లేదు. రాష్ట్ర ఆదాయంలో దాదాపు 20 నుంచి 25 శాతం వాటా ఒక్క మద్యం అమ్మకాల నుంచే వస్తోంది అంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇది ప్రభుత్వాలకు ఒక 'గోల్డెన్ డక్' (బంగారు బాతు). ఎందుకంటే, దీనికి శ్రమ లేని సంపాదన ఉంది, కొత్త పరిశ్రమలు పెట్టాల్సిన అవసరం లేదు, ఉద్యోగాల సృష్టితో పనిలేదు. బాటిల్ మీద పన్ను పెంచుకుంటూ పోతే ఏ కష్టమూ లేకుండా కోట్లాది రూపాయలు నేరుగా ఖజానాలోకి వచ్చి పడతాయి. ఇది కదా అసలైన 'ఈజీ మనీ'! అభివృద్ధి అంటే మద్యం అమ్మకాలు పెరగడం కాదు, మద్యాన్ని వదిలించుకునేలా ప్రజల జీవన ప్రమాణాలు పెరగడం. దురదృష్టవశాత్తు నేడు మద్యం అమ్మకాల టార్గెట్లు రీచ్ అవ్వడమే అభివృద్ధికి కొలమానంగా మారుతోంది. పరిశ్రమలు పెట్టి పదిమందికి పని ఇచ్చే కంటే, పది మద్యం షాపులు తెరిచి పన్నులు వసూలు చేయడం సులభమని పాలకులు భావిస్తున్నారు.

రాజకీయం అంటే ప్రజాసేవ అని పుస్తకాల్లో చదువుకుంటాం. కానీ, క్షేత్రస్థాయిలో చూస్తే అది మద్యం చుట్టూ తిరిగే ఒక లాభసాటి వ్యాపారంగా మారిపోయింది. ఎన్నికల్లో మద్యం పంచడం నేరం. కానీ, సామాన్యుడి ఆలోచనా శక్తిని మత్తుతో చంపేసి, ఓటును కొల్లగొట్టడం ఈ రాజకీయ క్రీడలో మొదటి అంకం. ఈ చక్రాన్ని గమనిస్తే అసలు రంగు బయటపడు తుంది: మద్యం వ్యాపారులు రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలో భారీగా నిధులు సమకూరుస్తారు. ఆ ధన బలంతో పార్టీలు అధికారంలోకి వస్తాయి. అధికారంలోకి వచ్చాక, వ్యాపారులకు లైసెన్సులు, అనుకూల పాలసీలు, సిండికేట్లకు మద్దతు ఇస్తూ ప్రభుత్వం కృతజ్ఞత చాటుకుంటుంది. చివరకు నష్టపోయేది ఎవరు? పన్నులు కట్టే సామాన్య పౌరుడు మరియు మత్తులో చిక్కుకున్న యువత మాత్రమే! మద్యం షాపుల యజమానులే నాయకులుగా మారినప్పుడు, లేదా నాయకులే మద్యం షాపులు నడుపుతున్నప్పుడు, ఇక మద్యపాన నిషేధం గురించి మాట్లాడటం అత్యాశే అవుతుంది.

మద్యపాన నిషేధం గురించి చర్చ రాగానే అందరూ వినిపించే ఒకే ఒక వాదన: నిషేధం విఫలమవుతుంది. కానీ, ఇక్కడ అసలైన ప్రశ్న నిషేధం గురించా? లేక నియంత్రణ గురించా? ప్రభుత్వాలు నియంత్రిత విక్రయం అనే ముసుగులో వ్యాపారం చేస్తున్నాయి. నియమాలకు పాతర: చట్టం ప్రకారం నిర్ణీత వయసు దాటిన వారికే మద్యం అమ్మాలి. కానీ, నేడు స్కూల్ బ్యాగ్ వేసుకున్న కుర్రాడు కూడా షాపుకెళ్లి బాటిల్ తెచ్చుకోగలుగుతున్నాడు. రాత్రి 10 గంటలకే షాపులు మూసేయాలనే నిబంధన కేవలం ముందు తలుపులకే! వెనుక దారిలో బెల్ట్ షాపులు అర్ధరాత్రి కూడా జోరుగా వ్యాపారం చేస్తున్నాయి. పాఠశాలలు, ప్రార్థనా మందిరాలకు దూరంగా షాపులు ఉండాలని రూల్స్ చెబుతున్నాయి. కానీ, స్కూల్ గేటు పక్కనే మద్యం షాపు ఉండటం సర్వసాధారణం. ఇది వ్యాధి ఆర్థిక వ్యవస్థ (ఱఆంముంవ జుఞశీఅశీఎఎ). మద్యం కేవలం ప్రభుత్వ ఖజానాను నింపే సాధనం మాత్రమే కాదు, ఇదొక భయంకరమైన వ్యాధి ఆర్థిక వ్యవస్థకు పునాది. ఒక పక్క సమాజం అనారోగ్యంతో కుదేలవుతుంటే, మరోపక్క ఆ అనారోగ్యాన్ని పెట్టుబడిగా మార్చుకుని కొన్ని వర్గాలు వృద్ధిల్లుతున్నాయి. ఈ వ్యవస్థలో ఒక విషవలయం ఉంటుంది: వ్యక్తి మద్యం సేవించడం వల్ల కాలేయం, గుండె, మూత్రపిండాలు పాడవుతాయి. ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతుంది. ఫార్మాస్యూటికల్ కంపెనీల ఆదాయం పెరుగుతుంది. ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు విపరీతంగా లాభపడతాయి. దురదృష్టవశాత్తు, మనిషి ఎంత ఎక్కువ అనారోగ్యానికి గురైతే, దేశ ఆర్థిక వ్యవస్థ లెక్కల్లో అంత ఎక్కువ అభివృద్ధి కనిపిస్తుంది. నిజానికి, మద్యపాని ఒక నిరంతర పన్ను చెల్లింపుదారు మాత్రమే కాదు, ఒక లాభదాయకమైన రోగి కూడా!

మరి సమాజం ఏం చేయాలి? మద్యం అనే మహమ్మారి మన కుటుంబా లను, మన తరాన్ని నాశనం చేస్తుంటే, చేతులు కట్టుకుని కూర్చోవడం నేరం. మన ప్రాంతంలోని ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెవాలి. పాఠశాలలు, కళాశాలలు, ఆలయాల సమీపంలో ఉన్న మద్యం దుకాణాల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి. సమాచార హక్కు చట్టం (=×) ద్వారా ప్రభుత్వానికి మద్యం వల్ల ఎంత ఆదాయం వచ్చిందో, ఆ మద్యం వల్ల కలిగే అనారోగ్యాల చికిత్సకు ఎంత ఖర్చయిందో అడిగి తెలుసుకోవాలి. ఓటరుగా మన బాధ్యత! రాజ్యాంగం ప్రకారం ప్రతి పౌరుడికి గౌరవంగా జీవించే హక్కు ఉంది. కానీ, మద్యం వల్ల అనారోగ్యంతో, పేదరికంతో బతుకుతున్న లక్షలాది మంది జీవనం గౌరవప్రదంగా ఉందా? ప్రభుత్వం తన వ్యాపార బుద్ధిని వదిలి, సేవకుని బాధ్యతను గుర్తు తెచ్చుకున్నప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వృద్ధిల్లుతుంది. మత్తులో మునిగిపోతున్న మన ఖజానా కాదు; మన మానవత్వమే. దాన్ని కాపాడుకోవడమే ఇప్పుడు మన సవాలు.

డా. సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు



**శేరిలింగంపల్లి, మార్చి 9 (జనంసాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారంకోసం అర్జిదారులు అందజేసే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితులలో జాప్యం ఉండకూడదని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన స్పష్టం చేశారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి శ్రీజన స్వయంగా హాజరై అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజావాణి కార్యక్రమం ఒక యజ్ఞంలా కొనసాగుతుందని, జిహెచ్ఎంసి పరిధిలోపల ప్రతి సర్కిల్ కార్యాలయం, జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత లభిస్తుందన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆయా సర్కిళ్లలో ఉదయం పది గంటలనుండి సాయంత్రంవరకు కీలక అధికారులు అంతా సమయాన్ని కేటాయిస్తూ అర్జీదారుల నుండి ఫిర్యాదులు అందుకోవడం జరుగుతుందని సిఎంసి కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 24 వినేతలు అందాయని, ప్రతి అర్జీని ప్రత్యక్షంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో వాటిపై తక్షణ చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చొరవ చూపిస్తానని భరోసాను వ్యక్తం చేశారు. సోమవారం ఫిర్యాదులు తీసుకోవడానికి అధికారులు పరిమితం కాకూడదని, క్షేత్రస్థాయిలో సమగ్రత నిర్వహించి వాటి పరిష్కారం లభించే అంతవరకు అధికారులు వారి గురుతర బాధ్యతను విస్మరించకూడదని ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదులు అందజేసిన అర్జీదారులు వాటి పరిష్కారం కోసం మళ్లీ కార్యాలయం మెట్లు ఎక్కకుండా పారదర్శకమైన యంత్రాంగాన్ని దీని కోసం కేటాయించి ప్రజల మన్ననలు పొందే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని సిఎంసి కమిషనర్ శ్రీజన పేర్కొన్నారు.

**శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయం ఆవరణలో...**

శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి సర్కిల్ కమిషనర్ ప్రశాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రణాళిక అభివృద్ధి భాగానికి సంబంధించి 02 ఫిర్యాదులు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మరో రెండు ఫిర్యాదులు, విద్యుత్ విభాగానికి సంబంధించి 02, వెటర్నరీ విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు అందినట్లు సర్కిల్ ఉప కమిషనర్ మీడియాకు వివరించారు. వాటిపై క్షేత్రసాయి పరిశీలన కొనసాగించి అర్జీదారులకు వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి మార్గం చూపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మియాపూర్ సర్కిల్ పరిధిలో...**

శేరిలింగంపల్లి నియోజకవర్గ మియాపూర్ సర్కిల్ పరిధిలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించగా సర్కిల్ ఉప కమిషనర్ శశిరేఖ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 14 ఫిర్యాదులు, హెల్త్ అండ్ శానిటేషన్ విభాగానికి సంబంధించి ఒకటి, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 04, మొత్తం 19 ఫిర్యాదులు అందినట్లు సర్కిల్ ఉప కమిషనర్ వెల్లడించారు.

## ఎండాకాలంలో మొక్కల పెంపకం పట్ల నిర్లక్ష్యం తగదు

- లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్



**యాచారం, మార్చి 9 (జనం సాక్షి) :** ఎండాకాలంలో మొక్కల పెంపకం పట్ల నిర్లక్ష్యం వహించవద్దని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ చెప్పారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనాన్ని, నర్సరీ, డంపింగ్ యార్డ్ ను సర్పంచ్ మస్కు అనిత శరణం, ఎంపీడీవో రాధా రాణి తో కలసి పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. పిచ్చి మొక్కలు మొక్కల పెంపకానికి అవరోధంగా ఉంటున్నాయని మొక్కలు మరింత ఏపుగా, పుష్టిగా పెరిగేలా పిచ్చి మొక్కల్ని తొలగించాలని సూచించారు. డంపింగ్ యార్డ్ లోని చెత్తను ఎప్పటికప్పుడు డి కంపోజ్ చేయాలని దీనివలన చెత్త ఎరువుగా మారడంతో కాలుష్యాన్ని నియంత్రిస్తుందని చెప్పారు. 99 రోజుల ప్రణాళికలో నిర్దేశించిన ప్రగతి ప్రణాళికను క్షేత్రస్థాయిలో విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## అంబేద్కర్ జయంతి కోసం అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి



**తాండూరు, మార్చి 9 (జనంసాక్షి) :** నియోజకవర్గంలోని తాండూరు మండలం ఎల్మకన్య గ్రామంలో అంబేద్కర్ జయంతి పండుగని పురస్కరించుకొని సోమవారం గ్రామానికి చెందిన జై భీమ్ యూత్ యువజన సంఘం కమిటీ సభ్యులు సంబంధిత అధికారులకు గ్రామ సర్పంచుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జై భీమ్ యూత్ యువజన సంఘం కమిటీ సభ్యులు మాట్లాడుతూ వచ్చేనెల ఏప్రిల్ 14వ తేదీన అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించడం కోసం అంబేద్కర్ ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని వారు కోరారు. ఇందు గాను ఎస్సీ కమిటీ హాలుకు పెయింట్ వేయించి, నేమ్ బోర్డ్ ఏర్పాటు చేయాలి, కరెంటు సప్లై తో పాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంబేద్కర్ జయంతి కోసం అన్ని ఏర్పాట్లకు శ్రీకారం చుట్టిందని ఇందులో భాగంగానే అధికారులు కూడా ముందుకు వచ్చి సజావుగా ఏర్పాట్లు చేయాలని కోరారు.సంబంధించి వినతి పత్రం ఇచ్చిన వారిలో గ్రామ యువజన సంఘం అధ్యక్షులు అనంతప్ప, ప్రధాన కార్యదర్శి బ్యాగరి రాజు, అడ్వైజర్ బ్యాగరి కృష్ణకుమార్, వార్డు మెంబర్ శ్రీనివాస్‌తో పాటు గ్రామానికి చెందిన పలువురు పెద్దలు యువకులు తదితరులు ఉన్నారు.

## జిల్లా గ్రంధాలయ బాత్రూమ్స్ ముందు నిరసన

- తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలి



**గద్వాల టౌన్, మార్చి 9 (జనంసాక్షి) :** గద్వాల జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని పాఠకులతో కలిసి బాత్రూమ్స్ ముందు నిలబడి నిరసన వ్యక్తం చేసిన బిఆర్ఎస్వి కోఆర్డినేటర్ కురువ పల్లయ్య ఈ సందర్భంగా కురువ పల్లయ్య మాట్లాడుతూ గ్రంథాలయంలో సమస్యలతో సతమతమవుతున్న పాఠకులు చాలాసార్లు విన్నవించిన కూడా గ్రంథాలయాన్ని పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని అన్నారు.జిల్లా కేంద్రానికి ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యే పాఠకులు మారుమూల గ్రామాల నుండి వస్తే ఇక్కడ పాటకులకు బాత్రూంలో నుండి దుర్వాసన వెదజల్లుతుందని టాయిలెట్ చేయడానికి,లెట్రిన్ వెళ్లడానికి పోయి రావాలంటే దుర్వాసనతో కడుపు తిప్పుతోందని వాంతులు అవుతున్నాయని ఎన్నిసార్లు తెలిపిన గ్రంథాలయ సిబ్బంది పట్టించుకోవట్లేదని పాఠకులు ఆవేదన చెందుతున్నారు.ముఖ్యంగా మహిళ పాఠకులకు పూర్తి అసౌకర్యంతో ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. అక్కడ ఉన్న బాత్రూంలను బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రం చేయించి దుర్వాసన వెదజల్లకుండా చూడాలని అధికారులను గ్రంథాలయ సిబ్బందిని కోరారు.తక్షణమే జిల్లా కలెక్టర్ మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠకులు మహేష్,బండారి అభిషేక్,మార్క్,నరేందర్,జహంగీర్,సతీష్,చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం



**శ్రీరంగాపూర్, మార్చి 9 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్క నాయకుడికి కార్యకర్తకి ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న అందరికీ సంబంధిత స్థానం కల్పించడం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం పార్టీ తరఫున నిర్వహిస్తున్న ఈ ఎన్నికలో బూత్ స్థాయి అధ్యక్షులను నియమిస్తున్నామని బూతు స్థాయి అధ్యక్షుడికి గ్రామ అధ్యక్షుడికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని వారు గ్రామ సర్పంచ్‌తో సమానమని ఆ విధంగా పార్టీని బలోపేతం చేసేందుకే కాంగ్రెస్ పార్టీ నేడు ముందుకు వచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఒక్కొక్క కమిటీలో 21 మంది ఉంటారని ఆ విధంగా కమిటీ ఏర్పాటు ఉంటుందన్నట్లు వారు తెలిపారు.పార్టీ లో ఉంటూ పార్టీ కార్యక్రమాలకు ప్రాముఖ్యత ఇవ్వకుండా నిర్లక్ష్య వహించే వారి మాటలు అలాంటి వారిని దూరం పెట్టడం మంచిదని వారు చెప్పారు.ఎక్కడ పార్టీ కార్యక్రమం జరుగుతుందని తెలిసిన వెంటనే స్థానిక నాయకులందరూ తప్పకుండా హాజరయ్యే విధంగా ఉండాలని వారు సూచించారు.అందరూ ఒకటే మాటగా ఉంటూ ముందుకెళితే దేన్నైనా సాధిస్తామని ప్రతిపక్షాలకు ఎక్కడ కూడా తావు లేకుండా ప్రతి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పార్టీ శ్రేణులు పెద్దలు యువకులు కలిసి రావాలని వారు సూచించారు.నేడు ఎన్నుకునే వారికోసం పార్టీ తరపున ప్రత్యేకంగా ఉంటే జూమ్ కాల్ వాట్సాప్ లాంటి వాటిపై అవగాహన కల్పించుకోవాలని వారు సూచించారు.ఈ సందర్భంగా వారు మండల కమిటీకి సంబంధించిన ఆశావాహుల పేర్లను వారు నమోదు చేసుకున్నారు మండల కమిటీని వెంటనే ప్రకటించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మద్దిలేటి, జిల్లా మాజీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, మండల అధ్యక్షులు రాములు యాదవ్, పీసీసీ జనరల్ సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, ఒబీసీ జనరల్ సెక్రెటరీ కోట్ల రవి, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదుని రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, న్యాయవాది తిరుపతయ్య మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, నాయకులు శ్రీహరి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం



**చేవెళ్ల, మార్చి 9 (జనంసాక్షి) :** చేవెళ్ల రైతు వేదికలో వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా.కృష్ణ హాజరైనారు. ఈ సందర్భంగా రైతుల కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.కృష్ణ, డా.దిలీప్ ఉద్యానవన శాస్త్రవేత్త, పండ్లు, పూల, కూరగాయ పంటల సాగులపై సంబంధించిన యాజమాన్య పద్ధతులుగురించి వివరించడం జరిగింది. రైతులకు తగిన సలహాలు సూచన కూడా ఇవ్వడం జరిగింది. అలాగే కృషి విజ్ఞాన కేంద్రం నుంచి డా.దిలీప్ వ్యవసాయ శాస్త్రవేత్త నానో ఎరువుల వినియోగం గురించి వివరించుతూ, నానో యూరియా, నానో డి.ఏ.పీ. వంటి ఎరువులను సరైన మోతాదులో పిచికారీ చేయడం ద్వారా పంటల ఎదుగుదల మెరుగుపడడంతో పాటు ఎరువుల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. పర్యావరణానికి హాని లేకుండా పంటల ఉత్పత్తి పెరుగుతుందని వివరించారు. చేవెళ్ల ఏడిఏ మాట్లాడుతూ...చిరుధాన్యాల గురించి ససరక్షణ చర్యలు వివరించడం జరిగింది,. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) లో భాగంగా రైతులకు మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ అధికారి శంకర్ లాల్ మాట్లాడుతూ...హెర్బిసైడ్ టోలరెంట్ పత్తి సాగు వల్ల కలిగే ప్రతికూలతలు, పత్తి పంటలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, హెచ్ టి పత్తి విత్తనాలను రైతులు వాడడం వలన గ్లైఫోసేట్ అనే కలుపు మందు వాడకం పెరిగి వాతావరణం కలుషితం కావడం మాత్రమే కాకుండా జీవ వైవిధ్యం దెబ్బతింటుందని తెలిపారు. అలాగే ఇతర పత్తి హైబ్రిడ్ కూడా కలుషితం అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ చేవెళ్ల దేవర వెంకట్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాము గౌడ్, ఏఈఓ బాల కోటేశ్వరరావు, రమ్య, ప్రతిభ, మౌనిక, వరుణ్ కుమార్, మండలంలోని వివిధ గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

## సమస్యలపై నిర్భయంగా ఫిర్యాదు చేయండి

- అదనపు జిల్లా ఎస్పీ ఎస్. మహేందర్



**మెదక్, మార్చి 9 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు జిల్లా ఎస్పీ ఎస్. మహేందర్ ప్రజల నుండి పిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని పలు గ్రామాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలు, వివాదాలు, పోలీసు సంబంధిత ఇబ్బందులను అదనపు ఎస్పీకి నేరుగా వివరించారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో అదనపు ఎస్పీ వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. అందిన పిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని కేసుల విషయంలో సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి పైరవీలు అవసరం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. చట్టపరమైన మార్గంలో ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు నిర్భయంగా తమ సమస్యలను వెల్లడించాలని, పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజల కోసమేనని స్పష్టం చేశారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కారమై, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకం మరింత పెరుగుతోందని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.

## సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 9 (జనం సాక్షి) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ స్టాకింగ్, సైబర్ బులీయింగ్ వంటి సమస్యలపై వివరించి విద్యార్థినులను జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అపరిచితులతో పరిచయాలు పెంచుకోవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే స్పందించాలని సూచించారు. అటువంటి సందర్భాల్లో 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయడం లేదా https://cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చని వివరించారు. కార్యక్రమం అనంతరం విద్యార్థినుల సందేహాలను తీర్చి, సైబర్ నేరాల నివారణపై అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా విద్యార్థినులతో కలిసి సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్ ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సిబ్బంది సతీష్,సయ్యద్, స్వప్న, కళాశాల సిబ్బంది, సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 9 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. సోమవారము సమీకృత కార్యాలయాల సమావేశము హాలు నందు నిర్వహించిన ప్రజావాణికి 289 దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణికి ప్రజలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వస్తారని వారికీ సంబంధించిన సమస్యల వివరాలతో ఇచ్చిన దరకాస్తు ను పరిశీలించి సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని అన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీలు, ఆరోగ్య శాఖ ,పంచాయతీ రాజ్,డి పి ఓ , అటవీ శాఖ, డీఆర్‌డీఏ, వ్యవసాయ శాఖ ,ప్రణాళిక శాఖ, గనుల శాఖ, భూ సేకరణ వివిధ జిల్లా అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై పెండింగ్ ఫైల్స్ అన్నియు క్లియర్ చేయాలనీ అధికారులకు ఆదేశించారు. వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి పూర్తి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని ఆదేశించారు.అనంతరం 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ , జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు,ప్రజా ప్రతినిధులు కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రాజేశ్వరి, జడ్.పి.సి. ఈ .ఓ ,సుదీర్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్ , వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు కృషి పట్టుదలతో వివిధ రంగాల్లో ముందుండాలి

**చేవెళ్ల, మార్చి 9 (జనంసాక్షి) :** మహిళలు కృషి పట్టుదలతో వివిధ రంగాల్లో ముందుండాలని ఎస్‌జీటీ చేవెళ్ల మండల అధ్యక్షురాలు అనసూయ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని చేవెళ్ల మండల కేంద్రంలో ఎస్‌జీటీ యూనియన్ చేవెళ్లశాఖ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌జీటీ చేవెళ్ల మండల అధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ...మహిళా సాధికారత, హక్కులు బాధ్యతలపై అవగాహన పెరగాలని పేర్కొన్నారు. సమాజంలో మహిళలు కృషి, పట్టుదలతో వివిధ రంగాల్లో ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు. ప్రధాన కార్యదర్శి లక్ష్మీ మాట్లాడుతూ...కుటుంబంతో పాటు దేశ భవిష్యత్తు నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్‌జీటీ యూనియన్ అధ్యక్షుడు బి. గణేష్, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మొయినాబాద్ మండల అధ్యక్షుడు లాలయ్య, సీనియర్ మహిళా ఉపాధ్యాయులు శశికళ, కమల, విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- ప్రజావాణిలో 119 దరఖాస్తులు స్వీకరణ
- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 9 (జనం సాక్షి) :** ప్రజావాణికి ప్రజలు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుండి ఎంతో నమ్మకంతో వారి సమస్యల పరిష్కారం కొరకు ఆశతో వస్తారని వారి ఫిర్యాదులను పరిశీలించి తగు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి 119 పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు జాగ్రత్తగా చదివి, అందులో పేర్కొన్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని, అవసరమైన విచారణ జరిపి సరైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలా కాకుండా ఒక శాఖ నుండి మరొక శాఖకు అర్థం లేకుండా దరఖాస్తులను పంపించడం సరైన పద్ధతి కాదని ఆమె స్పష్టం చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, డీఆర్‌డీఏ, ప్రణాళిక శాఖ, గనుల శాఖ, భూ సేకరణ విభాగాలకు చెందిన అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ వివరణ కోరారు. వచ్చే వారంలోపు అన్ని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, గత వారం అందిన దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించినవి, ఇంకా పెండింగ్‌లో ఉన్నవి వంటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను స్పష్టమైన నమూనాలో సమర్పించాలని ఆదేశించారు. అనంతరం 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, గ్రామ పంచాయతీ, మండల, మున్సిపాలిటీ , జిల్లా స్థాయిలో రోజువారీ షెడ్యూల్ ప్రకారం ప్రజలు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజూ చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు , వివరాలను కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో అప్లోడ్ చేయాలని, ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షిస్తారని, పంచాయతీ స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) పర్యవేక్షణ చేస్తారని తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



**వెల్దండ, మార్చి 9 (జనంసాక్షి) :** వెల్దండ మండలంలోని రాచూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ గున్నెల్ల శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శుభ్రంగా, నాణ్యమైన పోషకాహారం అందించాలని ఆయన సూచించారు. భోజనంలో కూరగాయలు, గుడ్లు, ప్రోటీన్ పదార్థాలు ఉండేలా చూడాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుల కోసం మంచి ఆహారం చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో పథకాలు సాధించాలి



**నారాయణపేట, మార్చి 9 (జనం సాక్షి) :** అథ్లెటిక్స్‌లో బాగా రాణించి రాష్ట్ర స్థాయిలో పథకాలు సాధించాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణ అన్నారు. సోమవారం నారాయణపేట మినీ స్టేడి యంలో నిర్వహించిన 3 వ జిల్లా స్థాయి కార్నివలి రిలే అథ్లెటిక్స్ పోటీలను జెండా ఊపి పట్టణ బీజేపీ పట్టణ అధ్యక్షులు పోషల్ వినోద్, కాంగ్రెస్ నాయకులు వెంక టేష్ గౌడ్ ప్రారంబించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసి యేషన్ కార్యదర్శి రమణ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 15 న హన్మకొండలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పథ కాలు సాదించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ బీరప్ప, అక్తర్ పాషా, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**భూత్పూర్, మార్చి 9 (జనం సాక్షి) :** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా భూత్పూర్ మున్సిపాలిటీ పర్యటించి పరిశుభ్రత కార్యక్రమాలు పరిశీలించారు. మున్సిపాలిటీలో పంచవటి హోటల్ ,కె.జి.బి.వి సందర్శించి చెత్త సేకరణ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజుశ్రీ తడి,పొడి చెత్త వేరు చేయాలని తెలిపారు. అనంతరం కె.జి.బి.వి ని సందర్శించారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వంట శాలను పరిశీలించారు. మధ్యాహ్నం విద్యార్థులకు అందించే ఆహారాన్ని పరిశీలించారు. అన్నం మెత్తగా ఉండడం గమనించి వంట శాల లో వండే కుక్ లకు వంట సందర్భంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు పదవ తరగతి వెళ్ళారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా..? అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, మూత్రశాలలు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా ఆరా తీశారు. పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఆందోళన చెందకుండా బాగా చదివి పరీక్షలు మంచిగా రాయాలని అన్నారు. ఏ సబ్జెక్టు లోనైనా విద్యార్థినులకు సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. పరీక్షల్లో మంచి మార్కుల తో ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. రాష్ట్రీయ బాల్ స్వాస్త్ కార్యక్రమం ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం కలెక్టర్ గమనించారు. కె.జి.బి.వి లో మొత్తం 270 మంది విద్యార్థిని లు ఉన్నారని స్పెషల్ ఆఫీసర్ తెలిపారు. రోజు ఎంతమందికి పరీక్షలు నిర్వహిస్తారని వైద్య శాఖ అధికారులను తెలుసుకున్నారు. రోజు 70 మందికి నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థినిలకు అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. విద్యార్థిని ల హిమోగ్లోబిన్ పరీక్ష లో వారి స్థాయిలను కలెక్టర్ పరిశీలించారు. హిమోగ్లోబిన్ తగ్గితే బలహీనత,నీరసం వస్తుందని, హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్న వారు మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు.

# రాజకీయ స్వలాభం కోసం అభివృద్ధిని అడ్డుకోవడం సరైన పద్ధతి కాదు

- హైలెవెల్ బ్రిడ్జి కచ్చితంగా పూర్తి చేస్తాం




**గద్వాల టౌన్, మార్చి 9 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డినీ ఆత్మకూరు మండల ప్రజా ప్రతినిధులు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ మండల నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లా నీటిపారుదల సమీక్ష సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ప్రతిపక్ష నాయకురాలు ఆత్మకూరు మండల అభివృద్ధిని చూసి ఓర్వలేక బ్రిడ్జి నిర్మాణ పనులను నిలిపి వేసే దిశగా ఆలోచన చేస్తున్నారని అన్నారు. 120 కోట్లు నిధులను హై లెవెల్ బిడ్జి నిర్మాణానికి కేటాయించారని గద్వాల నుండి దాదాపుగా 33 కిలోమీటర్లు ఆత్మకూరుకు ఉంటుంది. కానీ ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణం చేస్తే 8 కిలోమీటర్ల తక్కువ సమయంలో గద్వాలకు చేరుకుంటామని తెలిపారు. కర్నూలు,మంత్రాలయం వెళ్లడానికి సులభంగా ఉంటుంది, అదేవిధంగా రెండు నియోజకవర్గాలలో రవాణా సౌకర్యం జరగడం వల్ల అభివృద్ధి కూడా సాధ్యమవుతుంది. గద్వాల నుండి హైదరాబాద్ కు తక్కువ సమయంలోనే చేరవచ్చని అన్నారు. ఆత్మకూరు మండలం అభివృద్ధి చెందాలంటే మంత్రి వాకిటి శ్రీహరి,గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఈ బ్రిడ్జి నిర్మాణ పనులనుపూర్తి చేసే విధంగా కృషి చేయాలని మా ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతమంది ఎన్ని ప్రయత్నాలు చేసినా సీఎం నీటిపారుదల శాఖ మంత్రివర్యులు, జిల్లా మంత్రివర్యుల సహకారంతో ఎన్ని అడ్డంకులు ఎదురైనా బ్రిడ్జి నిర్మాణం పనులను పూర్తి చేస్తామని ఎన్ని ఇబ్బందులు ఆటంకాలు ఎదురైన ఎంతమంది ఎన్ని కుట్రలు చేసిన జూరాల ప్రాజెక్టు హై లెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి కావడం మాత్రం కచ్చితంగా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పచ్చర్ల శ్రీధర్ గౌడ్,జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు,ఆత్మకుర్ మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్ ప్రజా ప్రతినిధులు, నాయకులు కురుమన్న, పరశురాముడు, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే సమాజ ప్రగతికి పునాది

- అదనపు ఎస్పీ ఎస్ మహేందర్



**మెదక్, మార్చి 9 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందితో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, మహిళా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలోనే కాకుండా దేశ అభివృద్ధిలో కూడా మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. నేటి కాలంలో మహిళలు విద్య, వైద్యం, పరిపాలన, రక్షణ, క్రీడలు, సాంకేతిక రంగాలు సహా అన్ని విభాగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది ధైర్యం, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు విశేషంగా సేవలు అందిస్తున్నారని అదనపు ఎస్పీ అభినందించారు. శాంతి భద్రతలను కాపాడడంలో మహిళా పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విని పరిష్కరించడంలో మహిళా పోలీస్ సిబ్బంది ముందుంటున్నారని అన్నారు. విధుల్లో ఉన్న సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ మహిళా పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ఆయన తెలిపారు. కుటుంబ బాధ్యతలను నిర్వహించుకుంటూనే విధుల్లో రాణించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ రంగంలోనైనా విజయాలను సాధించగలరని చెప్పారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి మహిళా పోలీస్ సిబ్బందిని షాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, ఆర్ఐ శైలందర్, సీఐ లు సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, డీపీవో సిబ్బంది, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల ఇండ్ల సమస్యకు మోక్షం

- మంత్రి పొంగులేటి హామీ
- ఇండ్ల సమస్యపై ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి ప్రత్యేక చొరవ



**జడ్చర్ల, మార్చి 9 (జనంసాక్షి) :** ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న జడ్చర్ల జర్నలిస్టుల సొంతింటి కలకు ఎట్టకేలకు మోక్షం లభించనుంది. నిధుల కొరత, సాంకేతిక కారణాలతో అర్ధాంతరంగా నిలిచిపోయిన జర్నలిస్టుల కాలనీ ఇండ్ల నిర్మాణ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో జడ్చర్ల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ జడ్చర్లలో జర్నలిస్టుల కోసం మంజూరైన 40 ఇండ్ల నిర్మాణం పనులు మధ్యలోనే ఆగిపోవడంతో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు సుమారు రూ. 9 లక్షల బిల్లు పెండింగ్‌లో ఉండటంతో నిర్మాణాలు నిలిచిపోయాయని, ఆ నిధులు విడుదల చేస్తే పనులు తిరిగి ప్రారంభమవుతాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల విన్నపంపై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందిస్తూ, జర్నలిస్టులు సమాజానికి కళ్లు, చెవులు లాంటి వారని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం ఎల్లప్పుడూ చిత్తశుద్ధితో ఉంటుందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 9 లక్షల బిల్లును తక్షణమే విడుదల చేయాలని మరియు గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. కేవలం ఇండ్ల నిర్మాణమే కాకుండా, కాలనీలో విద్యుత్ సరఫరా, మురికి కాలువలు, త్రాగునీటి వసతి వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు. నిర్మాణాలు పూర్తయ్యేలోపు అన్ని సౌకర్యాలు సిద్ధం చేసి, జర్నలిస్టులు ప్రశాంతంగా జీవించే వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జడ్చర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, ఉపాధ్యక్షుడు శేఖర్, కోశాధికారి ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి మల్లేష్, కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, జర్నలిస్టులు వెంకటయ్య, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వివాదాస్పద భూముల్లో అక్రమ నిర్మాణాలు

- మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు



**మక్తల్, మార్చి 9 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణ కేంద్రంలోని సర్వే నంబర్ 936, 941లలో ఉన్న క్రైస్తవ మతపరమైన ఆస్తుల్లో సాగుతున్న అక్రమ, అనధికారిక నిర్మాణాలపై మక్తల్ ఎంబి ప్రాపర్టీ కస్టోడియన్, చైర్మన్ రెవరెండ్ ఇ. ప్రసాద్, సంఘం సభ్యులు స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హైదరాబాద్ – రాయచూర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ అత్యంత విలువైన భూమిపై ప్రస్తుతం కోర్టులో వివాదాలు నడుస్తున్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుండటం చట్ట విరుద్ధమని, ఈ భూమికి సంబంధించి హైకోర్టులో డబ్ల్యూపి నెం. 27553/2019, నారాయణపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ నెం. 87/2024 కేసులు విచారణలో ఉన్నాయి. టైటిల్ డిక్లరేషన్, భూమి స్వాధీనం కోరుతూ దాఖలైన ఈ కేసులు పెండింగ్‌లో ఉండగానే సూర్యనారాయణ గుప్తా, ఇతరులు అక్కడ వాణిజ్య సముదాయ నిర్మాణాలను వేగవంతం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేశ చట్టాలను, కోర్టు ఆదేశాలను ఏమాత్రం గౌరవించకుండా అక్రమంగా ముందుకు వెళ్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై 22 నవంబర్ 2025 అలాగే గత నెల 17 న మున్సిపల్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినట్లు బాధితులు గుర్తుచేశారు. కోర్టు పరిధిలో ఉన్న భూముల్లో ఎటువంటి వాణిజ్య సముదాయాలకు అనుమతులు మంజూరు చేయవద్దని, ప్రస్తుతం జరుగుతున్న చట్టవిరుద్ధ పనులను తక్షణమే నిలిపివేయాలని వారు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. చట్టపరమైన వివాదాలు తేలే వరకు అధికారుల జోక్యం అవసరమని, మతపరమైన ఆస్తులను కాపాడాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సర్వే నంబర్ 936, 941లలో చేపడుతున్న అక్రమ నిర్మాణాల విషయం స్థానిక మున్సిపల్ కమీషనర్ కి తెలిసినా కూడా చర్యలు తీసుకోవడం లేదని, చట్ట పరంగా ఆ భూములలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కోర్టు ఆదేశాలను కమీషనర్ తుంగలో తొక్కి నిర్మాణాలకు సహకరిస్తున్నారని, ఇలాగే అధికారులు చూసి చూడకుండా వ్యవహరిస్తే రాష్ట్ర దళిత క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని, అలాగే కమీషనర్ పై చర్యలు తీసుకోవాలని పై అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంబి సంఘం సభ్యులు జిజి పౌలు, జె ఎన్ . దేవదానం, బూషణము, జోసఫ్, సత్యనందం, యేసుకుమార్, కీరవాణి రాజ్, కోండన్న, అబ్రాహాము, సుధాకర్, ప్రేమ్ రాజ్, క్లెమెంట్, పిలోమోన్, దేవిడ్ రాజ్, యోహాను తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం పనులను నిర్లక్ష్యం చేయొద్దు



**వెల్దండ, మార్చి 9 (జనంసాక్షి) :** చేర్యాల్ లో పేరుకుపోయిన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసు తెలిపారు, సోమవారం గ్రామంలోని 7వ వార్డులో వార్డు మెంబర్ కేశమని పూజ మరియు సర్పంచ్ శ్రీనివాసులు పర్యటించి పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజీలు, వీధులను శుభ్రం చేయించారు,చెత్త చెదరాన్ని తొలగింపజేశారు, వార్డ్ మెంబర్ కేశమోని పూజ,సర్పంచ్ శ్రీనివాసు మాట్లాడుతూ పారిశుధ్యం పనులను సమర్థవంతంగా చేపట్టాలని, చెత్త సేకరణలో అశ్రద్ధ చేయొద్దని సూచించారు, ప్రజసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు,కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండలు, సెక్రటరీ హరణి, అలాగే గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ-వేస్ట్ వల్ల పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



జనగామ ప్రతినిధి, మార్చి 9 (జనంసాక్షి) : ఈ-వేస్ట్ వల్ల పర్యావరణానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులకు సూచించారు. జనగామ మండలంలోని శామీర్పేట గ్రామ పంచాయతీ పరిధిలోని డీఆర్సీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రై వేస్ట్ కలెక్షన్ సెంటర్‌లో జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. కేంద్రంలో సేకరించిన పొడి చెత్త వర్గీకరణ, నిల్వ విధానం, రికార్డుల నిర్వహణను తనిఖీ చేసి, అందుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సక్రమంగా సేకరించాలని, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వర్గీకరించి పునర్వినియోగానికి పంపాలని కలెక్టర్ సూచించారు. అలాగే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, కార్మికులు భద్రతా పరికరాలు ఉపయోగించాలని ఆదేశించారు. స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంచి ప్రతి ఇంటి నుంచి చెత్తను సరిగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా కేంద్రంలో సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈ-వేస్ట్) ఎలా సేకరిస్తున్నారు, వాటిని ఎలా వర్గీకరిస్తున్నారు అనే విషయాలపై ఆరా తీశారు. ప్రజల్లో ఈ-వేస్ట్ సేకరణపై అవగాహన కల్పించి, వాటిని సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో డీపీఓ వసంత, డీఎల్పీఓ వెంకట్ రెడ్డి, ఎంపిడిఓ సంపత్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

- ఆక్రమణలు తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించి హద్దులు ఏర్పాటు చేయాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య అధ్యక్షతన మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి దత్తత తీసుకున్న వార్డుల్లో సీఎస్ఆర్, డిఎం ఎఫ్టి నిధులతో విద్యుత్తు, మంచినీరు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి దత్తత కాలనీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగడం లేదని, సింగరేణి, మున్సిపాలిటీ మా పరిధి కాదంటే మాది కాదని పట్టించుకోకుండా వదిలేస్తున్నారని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా అభివృద్ధి బాధ్యత సింగరేణి తీసుకోవాలని తెలిపారు. ఫారెస్ట్, సింగరేణి, రెవెన్యూ భూ సమస్య పరిష్కారానికి సంయుక్తంగా సర్వే నిర్వహించి ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం చేపట్టాలని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మున్సిపాల్టీ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కొన్ని వార్డులలో మిషన్ భగీరథ వాటర్ పైపు లైన్ లీకేజీ, మరమ్మత్తులు చేయడం లేదని మరమ్మతులు నిర్వహించాలని తెలిపారు. చేతి పంపులు మరమ్మతులు నిర్వహించి మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్ద చెరువు బండ్ ను అభివృద్ధి చేయాలన్నారు. తుమ్మల చెరువును కోటి రూపాయలతో ఇప్పటికే అభివృద్ధి చేశామని, ఇంకా ఉన్న చెరువులను సింగరేణి అభివృద్ధి చేయాలని తెలిపారు. 19, 30 వార్డుల మధ్య ఉన్న పాత వాటర్ ట్యాంకును తొలగించాలని తెలిపారు. గత10 సంవత్సరాల నుండి సింగరేణి వార్డులలో అభివృద్ధి నిర్వీర్యం అయిందని, గెలిచినా ఓడినా అభివృద్ధి జరగాలని అన్నారు. దేవాలయాలు, రహదారుల అభివృద్ధికి సింగరేణి ఆటంకం కలిగించొద్దని తెలిపారు. మున్సిపాల్టీ పరిధిలోని అన్ని వార్డులలో హెచ్ పివి వ్యాక్సిన్ పంపిణీ జరుగుతుందని వసతి గృహాలు సంక్షేమ అధికారులు, విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు అవగహన కల్పించి వాక్సిన్ ఇప్పించాలని తెలిపారు. కోతుల సమస్య నివారణకు సింగరేణి, మున్సిపల్ సంయుక్తంగా యుద్ధ ప్రాతిపదికన కోతులు పట్టించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సింగరేణి ఉపరితల గని బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు పగుళ్లు వస్తున్నాయని రక్షణ చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. కావాల్సిన నిధుల కొరకు ప్రతిపాదనలు ఇవ్వాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఇచ్చిన రుణాలపై నివేదిక ఇవ్వాలని, అనర్హులకు ఇస్తే రికవరీ చేస్తామని తెలిపారు. వేసవిలో మంచినీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఇందుకోసం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహణకు ముందు ఎజెండా సభ్యులకు ముందుగానే ఇవ్వాలని, తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని తెలిపారు. అంతకుముందు మున్సిపల్ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఖచ్చితంగా హాజరు కావాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, అన్ని శాఖల జిల్లా అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పటిష్టంగా అమలు కావాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన కలెక్టర్




హనుమకొండ ప్రతినిధి మార్చి 9 (జనం సాక్షి) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని పటిష్టంగా క్షేత్రస్థాయిలో అమలు కావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ ఎన్. రవి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు, తహసిల్దారులను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాల వివరాలను ప్రతిరోజు మధ్యాహ్నం రెండు గంటల్లోగా జడ్పీ సీఈఓకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మరుసటి రోజు ప్రజా పాలన ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమంలో పాల్గొనే ప్రజా ప్రతినిధులు, అధికారుల వివరాలను ముందస్తుగా అందజేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు 200 అర్జీలను కలెక్టర్, అదనపు కలెక్టర్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, డిఆర్డిఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో శేషాద్రి, పలు శాఖల జిల్లా అధికారులు తహసిల్దార్లు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, మార్చి 9 (జనంసాక్షి) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఇరవేని రాయమల్లు తన భూమికి సంబంధించి పాత పట్టాదారు పాసుపుస్తకం ఉందని, నూతన పట్టా పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన దుర్గం మల్లేష్ తనకు సమీకృత కూరగాయల మార్కెట్ లో కేటాయించిన దుకాణాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన బోయ పోచం తనకు పూర్వీకుల నుండి వస్తున్న భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గ్రామపంచాయతీలలోని సర్పంచ్, ఉపసర్పంచ్, మున్సిపల్ కార్పొరేషన్/ మున్సిపాలిటీలలోని మేయర్/చైర్ పర్సన్, డిప్యూటీ మేయర్/ వైస్ చైర్ పర్సన్ లకు ఈ నెల 12వ తేదీన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖ పరిధిలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల పురోగతి, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులకు సంబంధించి గ్రామాలు, డివిజన్లు/వార్డుల వారీగా పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. సిఎం కప్ - 2025 లో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలను పూర్తి చేసుకుని రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీలలో జిల్లా నుంచి పాల్గొని బ్యాడ్మింటన్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పతకాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

## రంజాన్ పండుగ ఏర్పాట్లపై
# అధికారులు, ముస్లిం పెద్దలతో సమీక్ష

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ..



హనుమకొండ ప్రతినిధి మార్చి 9 (జనం సాక్షి) : హనుమకొండ భవాని నగర్ లోని క్యాంపు కార్యాలయంలో రంజాన్ పండుగ ఏర్పాట్లపై అధికారులు, ముస్లిం పెద్దలతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా పరిషత్ సీఈవో శేషాద్రి ఆర్డీవో డాక్టర్ కే నారాయణ ఆత్మకూర్ తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి పరకాల తహసిల్దార్ విజయలక్ష్మి నడికుడ తహసిల్దార్ రాణి సంబంధిత అధికారులు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ఆనందంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ముస్లిం సోదరుల రంజాన్ పండుగకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. రంజాన్ పండుగ సోదరభావం, శాంతి, సామరస్యానికి ప్రతీక అని, అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూతనంగా గెలుపొందిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు

# బెల్ట్‌షాపులు లేకుండా చేయండి

- తాగుబోతులతో ఇబ్బందులు పడుతున్నాం
- గోరుగుట్ట తండావాసుల ఆవేదన
- వరంగల్ జిల్లా కలెక్టర్‌కు వినతి



వరంగల్ బ్యూరో, మార్చి 09 (జనం సాక్షి) : 'తాగుబోతులతో బాధపడుతున్నాం.. వారి ఆగడాల, గొడవల నడుమ నలిగి పోతున్నాం.. మమ్మల్ని కాపాడండి' అంటూ వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం గోరుగుట్ట తండా మహిళలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్లో గ్రీవెన్స్ సందర్భంగా గోరుగుట్ట తండావాసులు తమ సర్పంచ్ విజయలక్ష్మి భాస్కర్ నాయక్ తో కలిసి సుమారు 50 మంది మహిళలు వినతి పత్రంతో వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్య శారదకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు తమ తండాలో జరుగుతున్నటువంటి విషయాలను పడుతున్న బాధలను కలెక్టర్కు విన్నవించారు. ఈ సందర్భంగా మహిళలు వీరమ్మ, సరోజన, కాంతమ్మ, అరుణ, జ్యోతి, నీలమ్మలు మీడియాతో మాట్లాడారు. తమ గోరుగుట్ట తండాలో మూడు నుంచి నాలుగు బెల్ట్ షాపులు ఉన్నాయని, 24 గంటలు బెల్ట్ షాపులు తీసి ఉంచడం వల్ల తాగుబోతుల సంఖ్య పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా చదువుకునే పిల్లవాళ్ళు కూడా బెల్ట్ షాపుల్లో మద్యం సేవించి తమను ఆవేదన గురి చేస్తున్నట్టు చెప్పారు. అలాగే తాగుబోతులంతా రాత్రి పగలనక తాగి రోడ్లమీద గొడవలు చేసుకోవడమే కాకుండా తాగిన సీసాలను రోడ్లమీద పగలగొట్టి బాటసారులకు, గృహవాసులకు తీవ్ర ఇబ్బందులను కలగజేస్తున్నారని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు వచ్చి వెళ్తున్నారని ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు అని తెలిపారు. సుమారు ఐదు సంవత్సరాలుగా తాము ఇలా ఇబ్బందులు పడుతున్నట్లు గోరుగుట్ట తండావాసులు చెప్పారు. బెల్ట్ షాపు యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఊర్లో బడికి పోయే చిన్నపిల్లల నుండి పెద్దవాళ్లదాక తాగుబోతులను తయారయ్యేలా చేస్తున్నారని వారిపై తగిన చర్యలు తీసుకొని తమ తండాలో ఎలాంటి మద్యం అమ్మనీయకుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరుతున్నారు.



# గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణి

వరంగల్ ఎంజీఎం, మార్చి 9 (జనంసాక్షి): జీడబ్ల్యూఎంసి ప్రధాన కార్యాలయం లో సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ చంద్రశేఖర్, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వినతులు స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్ 21, ఇంజనీరింగ్ 16, రెవిన్యూ 4, హెల్త్, శానిటేషన్ 7, నీటి సరఫరా 4, హార్టికల్చర్ 1 మొత్తంగా 53 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసిపిలు, డిఈలు సానిటరీ ఇన్స్పెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు తక్షణ పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్ బ్యూరో, మార్చి 09(జనం సాక్షి): జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో,(రెవెన్యూ) కె.అనిల్ కుమార్, జిల్లా అధికారులు, సంబంధిత మండలాల నుండి గూగుల్ మీట్ ద్వారా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల చేసుకున్న దరఖాస్తులను సానుకూలంగా వింటూ సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు, స్వయంగా, ఈ సోమవారం వినూత్న రీతిలో మండల ప్రధాన కార్య స్థానం నుండి తహసీల్దారులకు గూగుల్ మీట్ ద్వారా ఆదేశాలు జారీ చేసి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ప్రజలు చేస్తున్న న్యాయమైన సమస్యలల దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంబంధిత విభాగాల సిఫారసు చేయాలని లేదా సరియైన విధంగా సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పెండింగ్ ఫైల్ లను క్లియర్ చేయాలని, పరిసరాలను పరిశుభ్రముగా ఉంచుకుంటూ, అనవసరమైన స్క్రాప్ ను ఖండం చేయాలని, అట్టి నివేదికను ప్రతిరోజు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత సిబ్బంది తరచుగా వారికి కేటాయించిన వసతి గృహాలు హాస్టల్లను విద్యాసంస్థలను తనిఖీ చేస్తూ విద్యార్థిని, విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని, వసతి గృహాలలో సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 136 దరఖాస్తులు వచ్చాయని వాటి పరిష్కారం నిమిత్తం తగు సూచనలు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు లీగల్ సెల్ ద్వారా న్యాయ సలహాలు సూచనలు సమస్యల పరిష్కారం కోసం (5) దరఖాస్తులు వచ్చాయని వారికి సరియైన పరిష్కారం చూపి పంపడం జరిగిందనీ పార లీగల్ వాలంటరీ విజయ్ కుమార్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో తొర్రూరు రెవిన్యూ డివిజనల్ అధికారి గణేష్, జెడ్పి సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గూగుల్ మీ ద్వారా తహసిల్దారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రిని కలిసిన అప్పాల గణేష్ చక్రవర్తి



నిర్మల్ బ్యూరో, మార్చి 9 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డిని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిసారు. మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ వైస్ ఛైర్మెన్ ఫహీం కురేషితో మంత్రిని కలిసి అభివృద్ధిలో వెనుక బడుతున్న నిర్మల్ పట్టణానికి అధిక నిధులు కేటాయించి తమ వంతు సహకారం అందించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. వైస్ చైర్మన్ వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జు మంద్ అలీ, కౌన్సిలర్ ఎస్పి రాజు ఉన్నారు.

# ఆరోగ్య సంరక్షణ కోసమే 5 కే రన్

- నగర మేయర్ గుండు సుధారాణి
- పోచమ్మ మైదాన్ నుండి వేయిస్తంభాల ఆలయం వరకు కొనసాగిన రన్
- పాల్గొన్న వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు



వరంగల్ బ్యూరో, మార్చి 09 (జనం సాక్షి) : ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి తెలిపారు. "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం అమలులో భాగంగా సోమవారం జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ నుంచి హనుమకొండ వెయ్యిస్థంభాల ఆలయం వరకు నిర్వహించిన 5కే రన్‌ను వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్‌లతో కలిసి మేయర్ జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజు ప్రజల భాగస్వామ్యంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల సహకారం, భాగస్వామ్యం ఉన్నప్పుడే ఏ అభివృద్ధి కార్యక్రమం అయినా విజయవంతం అవుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ హెల్త్ రన్ నిర్వహించామని చెప్పారు. గ్రేటర్ వరంగల్ ప్రజలకు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి సేవలను జీడబ్ల్యూఎంసీ ద్వారా అందిస్తున్నామని మేయర్ తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి 5కే రన్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంచేందుకు ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఆరోగ్యానికి మించిన ఆస్తి ఏదీ లేదని, ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో విజయాలు సాధించగలమని అన్నారు. ఈ రన్ పోచమ్మ మైదాన్ వద్ద ప్రారంభమై ఎంజీఎం కూడలి, ములుగు రోడ్ మీదుగా వెయ్యిస్థంభాల ఆలయం వద్ద ముగిసింది. ఈ ర్యాలీ ద్వారా ఆరోగ్యకర జీవన విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించారు అనంతరం అధికారులు, యువత, ప్రజలు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేష్ జోషి, బస్వరాజు కుమారస్వామి, జన్ను శిభారాణి, అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీహెచ్ఎంఓ డా. రాజా రెడ్డి, సీహెచ్ఓ రమేష్, హనుమకొండ డీవైఎస్ఓ అశోక్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ డా. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



చిట్యాల, మార్చి 9 (జనంసాక్షి): మండల కేంద్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా ఉదాంతం వెలుగు చూసింది. సోమవారం ఉదయం సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ భాస్కర్ల రాజు, తన సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు చిట్యాల పెట్రోల్ పంప్ వద్ద తనిఖీ నిర్వహించగా టేకుమట్ల నుండి వస్తున్న అశోక్ లేలాండ్ ట్రాలీని తనిఖీ చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 15.5 కింటాల పిడిఎస్ బియ్యం, లభ్యమయింది. మొత్తం 35 తెల్లటి సంచులలో ఈ బియ్యాన్ని నింపి తరలిస్తున్నట్టు గుర్తించారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న కుక్కర్ల సంపత్ తన డ్రైవర్ చుక్క రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భాస్కర్ల రాజు ఫిర్యాదు మేరకు నిందతుడిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

# మిస్టరీగా మారిన ఉపాధ్యాయురాలు మృతి

- హత్యా...? ఆత్మహత్యా....?
- కట్టుకున్నోడే కడతేర్చాడని బంధువుల ఆరోపణ
- కలహాలతో ఉరి వేసుకుని మృతి చెందిందని భర్త ఆరోపణ
- మృతురాలి బంధువులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**కొత్తగూడెం, మార్చి 9 (జనంసాక్షి) :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 28వ డివిజన్ రైటర్ బస్తి గొల్లగూడెం లో ఉపాధ్యాయులు మృతి చెందిన సంఘటన సోమవారం కొత్తగూడెంలో మిస్టరీగా మారింది. కట్టుకున్నోడే కడతెర్చాడని మృతురాలి బంధువులు ఆరోపణ. భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ కారణంగానే క్షణికావేశంలో ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందిందని భర్త ఆరోపణ. ఏది ఏమైనా హత్య ఆత్మహత్య అనేది పోలీసులు తేల్చాల్సి ఉంది .మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు సోమవారం కొత్తగూడెం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం జూలూరుపాడు మండలం ఒంటెగుడిసె ప్రాంతానికి చెందిన మాలోతు నాగేశ్వరరావు, సుజాతనగర్ మండలం సీతంపేట బంజరకు చెందిన బుక్స్ కవితకు వివాహం జరిగి సుమారు పది సంవత్సరాలు కావస్తుంది. వీరిద్దరి కలహాలు లేకుండా సంసారం కొన్నేలుగా సాఫీగా సాగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ వీరిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు నాగేశ్వరావు బూర్గంపాడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. మృతి చెందిన కవిత భద్రాచలం జడ్పిహెచ్ఎస్లు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు ఎప్పటిలాగానే ఆదివారం సాయంత్రం కవితకు నాగేశ్వరావుకు మధ్య గొడవ జరిగిందని తెలిపారు. అదేరోజు రాత్రి 9 గంటల సమయంలో రైటర్ బస్తి గొల్లగూడెం ప్రాంతానికి అంబులెన్స్ రావడంతో స్థానికులు సంఘటన ప్రాంతానికి చేరుకోగానే తన భార్య ఉరి వేసుకుందని అందుకే ఆసుపత్రికి తీసుకెళ్తున్నానని భర్త నాగేశ్వరరావు తెలిపారు. కవితను ఆసుపత్రికి తరలించగా అప్పటికే కవిత మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. అయితే ఆమె మృతి పట్ల అనేక అనుమానాలు ఉన్నాయని కవిత సోదరులైన రవి నరేషులు ఫిర్యాదులు పేర్కొన్నారు ఉరివేసుకొని చనిపోవలసిన తన సోదరి కవితకు లేదని వాదిస్తున్నారు కవిత భర్త నాగేశ్వరావు మరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అందుకే వారి కుటుంబంలో తరచు గొడవలు జరుగుతున్నాయని బంధువుల ఆరోపిస్తున్నారు. కావాలనే కవిత భర్త నాగేశ్వరావు ఆమెను కడతేర్చాడని ఆరోపించారు బంధువులు ఆరోపణలు పరిరలోకి తీసుకుంటే అనేక ప్రశ్నలు ఉత్పనమవుతున్నాయి ఒకవేళ కవిత ఉరివేసుకొని మృతి చెంది ఉంటే ఆ సమాచారాన్ని కవిత బంధువులకు కుటుంబీకులకు ఎందుకు చెప్పలేదని హుటాహుటిన ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏంటని.. కవిత మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించడంతో హుటాహుటిన భర్త నాగేశ్వరావు నేరుగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్కు వచ్చి లొంగిపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పది సంవత్సరాలపాటు సజావుగా సాగిన వీరి కుటుంబంలో వివాహేతర సంబంధమే కారణమా..?, అందుకు భార్యాభర్తల మధ్య తరచూ జరుగుతున్న గొడవలే కారణమా..? కవిత భర్త ఆమెను చంపి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని చిత్రీకరిస్తున్నాడా...? అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఏది ఏమైనా మిస్టరీగా మారిన ఉపాధ్యాయురాలు మృతి ఏమలుపు తిరగనుందో లేదా పెద్దల పంచాయతీతో సెటిల్మెంట్ తో పూర్తవుతుందో వేచి చూడాలి.

## భువనగిరి - జగదేవపూర్ ప్రధాన రహదారి వడపర్తి శివారులో ఘోర రోడ్డు ప్రమాదం



**భువనగిరి రూరల్, మార్చి 9 (జనంసాక్షి) :** భువనగిరి మండలం వడపర్తి శివారులో ఆటోను డీసీఎం వాహనం ఢీకొనడంతో తిమ్మాపూర్ గ్రామనికి చెందిన ఒకే కుటుంబసభ్యులు ముగ్గురు మృతిచెందడం జరిగింది. దొంకెన నరేష్ అక్కడికక్కడే మృతి చెందాగా,సురేష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన కేతమ్మను హైదరాబాదు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ముగ్గురి మృతితో తిమ్మాపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బస్వపూర్ రిజర్వాయర్ నుండి చెరువులకు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే




**భువనగిరి రూరల్, మార్చి 9 (జనంసాక్షి) :** భువనగిరి నియోజకవర్గ అభివృద్ధిలో మరో కీలక అడుగు పడింది. నియోజకవర్గ రైతాంగ ప్రయోజనాలే పరమావధిగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి బస్వపూర్ రిజర్వాయర్ నుండి కాలువల ద్వారా చెరువులకు నీటిని విడుదల చేశారు. ఈ ప్రక్రియలో ఎదురైన ప్రధాన అడ్డంకిని తొలగిస్తూ, హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై యుద్ధప్రతిపాదికన కల్వర్టు నిర్మించి నీటి మళ్లింపును సుగమం చేశారు. దీని ద్వారా భువనగిరి మండలంలోని పలు గ్రామాలు రాంచంద్రపురం,రామకృష్ణ పురం, చందుపట్ల, బండ సోమరం, గౌస్ నగర్ చుట్టుపక్కల గ్రామాలకు సాగునీరు అందనుంది. నిధుల మంజూరు నుండి కల్వర్టు నిర్మాణం పూర్తి చేసే వరకు పనులను దగ్గరుండి ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాగునీటి కల నెరవేరడంతో అన్నదాతలు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కనుకుంట్ల రేఖ బాబు రావు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల హామీలు అమలు చేయాలి

- కలెక్టరేట్ వద్ద ఎంఆర్పీఎస్ నిరసన



**భువనగిరి టౌన్, మార్చి 9 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు బూసి మహేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు జిల్లా ఇంచార్జ్ కూరెళ్ల రమేష్ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి భైరపాక నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల ఉప్పలయ్య, నియోజకవర్గ ఇన్చార్జ్ బొట్ల శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం మహేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు వెల్మజాల యాదగిరి, చెల్లూరు యాదగిరి, జిల్లా కార్యదర్శి ఇటికాల శ్రీనివాస్, కలకుట్ల రమేష్, జిల్లా నాయకులు భైరపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం ధ్యేయం

- పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




**ఖమ్మం రూరల్, మార్చి 9 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఎం ధ్యేయమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్లో సీపీఎం ఖమ్మం రూరల్ మండల కమిటీ సమావేశం నాయకులు తోట పెద్ద వెంకటరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నున్నా మాట్లాడుతూ...సీపీఎం శాఖలు,కమిటీలు సమర్థవంతంగా పనిచేసినప్పుడే ఫలితాలు అద్భుతంగా వస్తాయన్నారు. ఖమ్మం రూరల్ మండలం భౌగోళికంగా పెద్దదైనందువల్ల ప్రభుత్వం 12 గ్రామాలను ఏదులాపురం మున్సిపాలిటీగా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మున్సిపాలిటీకి కార్యదర్శిగా ఒకరిని,రూరల్ మండలానికి కార్యదర్శిగా మరొకరిని నియమించడం జరుగుతుందన్నారు. పని విభజన వల్ల పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పని చేసి,సమస్యలు పరిష్కారం కొరకు పని చేయాలన్నారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ...ఖమ్మం రూరల్ సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ పోటీ చేసిన నాలుగు స్థానాల్లో అఖండ విజయం సాధించామని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ ఫలితాల్లో ఊహించని ఫలితాలు వచ్చాయని,చిన్నచిన్న పొరపాట్ల వల్ల రెండు సీట్లకే పరిమితం అయ్యామని,మరో కొన్ని కోల్పోవాల్సి వచ్చిందని తెలిపారు. శ్రేణులంతా చైతన్యవంతంగా ఉండాలని,శత్రువుల దాడిని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఏదులాపురం మున్సిపాలిటీ సీపీఎం కార్యదర్శిగా ఎంపికైన ఉరడీ సుదర్శన్ రెడ్డి, ఖమ్మం రూరల్ మండలం కార్యదర్శిగా నూతనంగా వడ్లమూడి నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి జిల్లా నాయకులు,మండల కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు నంద్ర ప్రసాద్,షేక్ బషీరుద్దీన్,మండల నాయకులు పీ.మోహన్ రావు,నందిగామ కృష్ణ,పెండ్యాల సుమతి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి ఉత్తమ్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 9 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా రూ.10 కోట్లతో నిర్మించనున్న రోడ్లు, భవనముల అతిథి గృహం నిర్మాణంకు సోమవారం రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆర్డిఓ వేణుమాధవరావు, తహసిల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి,ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సూపరింటెండెంట్ సునీల్ సేవలు మరువలేనివి



**మణుగూరు, మార్చి 9 (జనం సాక్షి) :** చిరునవ్వుతో ఎంత పెద్ద సమస్యకైనా పరిష్కారం దొరుకుతుందని నమ్మిన వ్యక్తి డాక్టర్ సునీల్ ఆయన చేసిన సేవ వెలకట్టలినిదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సూపరింటెండెంట్ సునీల్ వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు..వైద్యో నారాయణ హరి అని వైద్యుడు దేవుడితో సమానమని ఎన్నోరకాల మనుషులు మరెన్నో రకాల జబ్బులు వారి సమస్యలను ఓపిగ్గా విని వైద్యం అందించాలంటే పెద్ద వయస్సు ఉండనక్కర్లేదు అని నిరూపించిన వ్యక్తి డాక్టర్ సునీల్ కుమార్ అలాంటి వ్యక్తి అరుదుగా కనిపిస్తుంటారు. ఎవరు ఏ సమయంలో ఫోన్ చేసినా స్పందించే గొప్ప మనసున్న వ్యక్తి అతి చిన్న వయసులో సేవ చేసే అవకాశం రావడం ఆవృత్తిని దైవంగా భావించి వైద్యం అందిస్తున్న సునీల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పై చదువులకు వెళ్ళి విజయం సాధించి మళ్ళీ ఇక్కడే సేవలందించాలని కోరుతున్నాను. అనంతరం డాక్టర్ సునీల్ ధనలక్ష్మి దంపతులను పూల దండ వేసి శాలువ కప్పి మెమోంట్ అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ రవిబాబు, కంటి వైద్యులు గంజి సంజీవరావు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 9 (జనంసాక్షి) :** ప్రజావాణి ఫిర్యాదులను అధికారులు సత్వరమే చర్యలు తీసుకొని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. వివిధ శాఖలలో చాలా కాలం పెండింగ్ లో ఉన్న ఫిర్యాదులపై శాఖల వారీగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్ లోని ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి కార్యాలయంలోని ఫైల్స్ అన్ని సక్రమంగా ఉంచుకోవాలని, ప్రతి కార్యాలయ సిబ్బంది అటెండెన్స్ తప్పనిసరిగా ఫేస్ రికగ్నేషన్ యాప్ లో నమోదు చేయాలని అన్నారు. కలెక్టరేట్ లోని ప్రతి కార్యాలయం సందర్శిస్తానని, ఫైల్స్ సరిగా లేకపోయినా, శుభ్రంగా ఉండని కార్యాలయాల పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. భూ సమస్యలకు సంబందించి 24 దరఖాస్తులు,జిల్లా పంచాయతీ అధికారి 5, డిఆర్డిఏకు 8, వైద్య ఆరోగ్య శాఖ అధికారి 3, మిగిలిన 41 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 83 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, డిఈఓ అశోక్, సంక్షేమ అధికారులు నర్సింహారావు, నరసింహ, శంకర్,జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలు తగిలి టిప్పర్ దహనం

- డ్రైవర్ పరిస్థితి విషమం



**చండూరు, మార్చి 9 (జనంసాక్షి) :** డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మట్టిని తరలిస్తున్న ఒక టిప్పర్ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగలడంతో పూర్తిగా దహనమైన ఘటన నల్లగొండ జిల్లా చండూరు మండల పరిధిలో చోటుచేసుకుంది. మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో బంగారుగడ్డ నుండి నాంపల్లి వరకు రెండు వరుసల డబుల్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. సోమవారం ఈ రోడ్డు పనుల కోసం మట్టిని పోసి చదును చేసే క్రమంలో ఒక టిప్పర్ లోడుతో వచ్చి అన్లోడ్ చేస్తోంది. అయితే, పైన ఉన్న 33 కె.వి హైటెన్షన్ విద్యుత్ లైన్లను గమనించకుండా డ్రైవర్ టిప్పర్ బాడీని పైకి లేపాడు. దీంతో టిప్పర్ బాడీ విద్యుత్ తీగలకు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు వ్యాపించి టిప్పర్ పూర్తిగా దహనమైంది. ఈ ప్రమాదాన్ని గమనించిన క్లీనర్ వెంటనే అప్రమత్తమై కిందికి దూకడంతో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నాడు. దురదృష్టవశాత్తు టిప్పర్ డ్రైవర్ తీవ్రమైన విద్యుత్ షాక్కు గురయ్యారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# సాగునీటి కోసం వీధినపడ్డ గిరిజన రైతులు

- అటవీ శాఖ అధికారులపై నిరసన
- బోట్ షికార్ సాకుతో పంటను ఎండగడుతున్న అటవీ అధికారులు
- రైతుకు పంట ముఖ్యం
- బోట్ షికారే ముఖ్యమంటున్న అటవీ అధికారులు




**పెనుబల్లి, మార్చి 9 (జనం సాక్షి) :** ఏకో టూరిజం పేరుతో వరి పంటలను ఎండబెడుతున్నారని గిరిజన రైతులు అటవీ అధికారులపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పులి గుండాల ప్రాజెక్టు ద్వారా గత మూడు నాలుగు దశాబ్దం నుంచి ఖరీఫ్ రబీ సీజన్లలో పంట పొలాలకు నీటిని వాడుకుంటున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఏడాది నుంచి ప్రాజెక్టును టూరిజం స్పాట్ గా అటవీ అధికారులు ప్రకటించారు. దీంతో రెండో పంటకు నీటిని విడుదల చేయడం ఆపేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నీటిపారుదలను ఆపడం రైతుల పాలిట పిడుగుల పడింది. తక్షణమే నీటిని విడుదల చేసి విడుదల చేసి ఎండుతున్న వరి పంటను కాపాడాలని గిరిజన రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మలకుంట గిరిజన మహిళ రైతులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఏకో టూరిజం పేరుతో ప్రాజెక్టులోని సాగు నీటిని విడుదల చేయకుండా తమ పంట పొలాలను ఎండుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో పంటకు నీరు విడుదల చేయడం లేదని ముందే అటవీశాఖ అధికారులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తీరా దాల్వా పంట వేశాక టూరిజం పర్యాటకుల కోసం నీటిని విడుదల చేయడం సాధ్యపడదని అధికారులు అనడం దారుణం అన్నారు. సుమారు 600 ఎకరాలకు పైగా ప్రాజెక్టు కింద వరిపొలాలు కలుపు దశకు వచ్చిన తర్వాత ఎండిపోవడం వల్ల ఎకరాకు రూ.15 వేల మేర నష్టం వాటిల్లిందని, తమ గోడు ఎవరూ పట్టించుకోవడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం 15 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయని కేవలం మూడు అడుగుల నీరు తమ పంట పొలాలకు సరిపోతాయని, తక్షణమే నీటిని విడుదల చేసి ఎండుతున్న పంట పొలాలు కాపాడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, మార్చి 9 (జనంసాక్షి) :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రజలకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.




## స్విగ్గీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొత్త క్రెడిట్‌కార్డ్లు

**న్యూఢిల్లీ:**ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాం స్విగ్గీ, ప్రైవేట్‌రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ మరోసారి జట్టుకట్టాయి. 2023లో తొలిసారి కో -బ్రాండెడ్ క్రెడిట్ కార్డును లాంచ్ చేసిన ఈ రెండు సంస్థలు.. తమ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ మరో రెండు కో-బ్రాండెడ్ క్రెడిట్‌కార్డులను తీసుకొచ్చాయి. ట్రావెల్ బుకింగ్, ఆన్‌లైన్ షాపింగ్, క్విక్‌కామర్స్, ఫుడ్ డెలివరీ కేటగిరీల్లో లావాదేవీలపై డిస్కౌంట్, క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నాయి. వినియోగాన్ని బట్టి ఏటా గరిష్ఠంగా రూ.48 వేల వరకు ఆదా చేసుకోవచ్చని ఇరు సంస్థలు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి.స్విగ్గీ ఃఒఅఐ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్, స్విగ్గీ ఆరెంజ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు క్రెడిట్ కార్డు పేరిట ఈ కార్డులను తీసుకొచ్చారు. స్విగ్గీతో పాటు ఆన్‌లైన్ ట్రావెల్ సంస్థ క్లియర్‌ట్రిప్, సౌందర్య, సంరక్షణ ఉత్పత్తుల సంస్థ నైకాలో కొనుగోళ్లపై డిస్కౌంట్, క్యాష్‌బ్యాక్ లభిస్తాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా యాప్‌లో కొనుగోళ్లపైనా కూడా క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలు లభిస్తాయి.క్లియర్‌ట్రిప్ 19 శాతం, హోటల్ బుకింగ్స్‌పై 6 శాతం, ఫ్లైట్ బుకింగ్స్‌పై 5 శాతం, నైకా ఉత్పత్తుల కొనుగోళ్లపై 5 డిస్కౌంట్ 5 శాతం క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. స్విగ్గీలో కొనుగోళ్లకు బ్లాక్ కార్డు హోల్డర్లకు 10 శాతం, ఆరెంజ్ హోల్డర్లకు 5 శాతం క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. రూ.500 జాయినింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. స్విగ్గీ మొబైల్ యాప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు. దశలవారీగా ఈ కార్డులను అందుబాటులోకి తేనున్నారు.

### టెక్ మహీంద్రాలో 30వేల లేఆఫ్‌లు.. అసత్య ప్రచారాలే..

**స్పందించిన కంపెనీ**

**న్యూఢిల్లీ:**ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రా భారీఎత్తున ఉద్యోగుల తొలగింపులు చేపట్టనున్నట్లు కొన్నిరోజులుగా ప్రచారం జరుగుతోంది. దాదాపు 30వేల మందికి లేఆఫ్‌లు ఇవ్వనున్నట్లు ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై కంపెనీ తాజాగా స్పందించింది. అవన్నీ అసత్య కథనాలంటూ లేఆఫ్‌లను తోసిపుచ్చింది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో సోమవారం స్పష్టతనిచ్చింది."మా కంపెనీలో ఉద్యోగుల కోతలకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న వార్త మా దృష్టికి వచ్చింది. దీనిపై మాకు కాల్స్ కూడా వస్తున్నాయి. దీంతో ఈ ఊహాగానాలపై స్పందించాల్సిన అవసరం ఉందని భావించాం. ఉద్యోగుల తొలగింపులకు సంబంధించి ప్రస్తుతానికి ఎలాంటి ప్రతిపాదనలను పరిగణించట్లేదు. లేఆఫ్‌లపై ఇలాంటి అసత్య ప్రచారాన్ని మేం తోసిపుచ్చుతున్నాం" అని టెక్ మహీంద్రా కంపెనీ వెల్లడించింది.ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చేందుకు మైక్రోసాఫ్ట్‌తో కలిసి పనిచేస్తున్నట్లు టెక్ మహీంద్రా ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఈ లేఆఫ్‌ల ప్రచారం మొదలైంది. ఈ కంపెనీ రానున్న నెలల్లో తమ ఉద్యోగుల సంఖ్యను 30వేల మేర తగ్గించనున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తాయి. కృత్రిమ మేధ పురోగతితో ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీలపై ప్రతికూల ప్రభావం పడుతోన్న వేళ ఈ ప్రచారం ఐటీ రంగంలో ఆందోళనలు రేకెత్తించింది. ఈ నేపథ్యంలో కంపెనీ స్పష్టతనిచ్చింది.

# భారీ నష్టాల్లో స్వల్ప ఊరట

### మైనస్ 2496 నుంచి -1352కు సెన్సెక్స్..



**న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరగడం, పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఇంకెంతకాలం కొనసాగుతాయోనన్న భయాందోళనలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీంతో ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలూ భారీగా పతనమయ్యాయి. ఇంట్రాడేలో దాదాపు 2,496 పాయింట్లు పతనమైన సెన్సెక్స్.. 1352 పాయింట్ల నష్టంతో గట్టెక్కింది. నష్టాలను దాదాపు సగానికి తగ్గించుకోవడం ఊరట కల్పించే విషయం.అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 1862 పాయింట్ల నష్టంతో 77,056.75 వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,424.55 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1352.74 పాయింట్ల నష్టంతో 77,566.16 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఓ దశలో 23,697.80 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 422.40 పాయింట్ల నష్టంతో 24,028.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 53 పైసలు క్షీణించి 92.35గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్ సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా స్టాక్స్ మాత్రమే రాణించాయి. అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, అదానీ పోర్ట్స్ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 104.62 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5108 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. నిన్నటి అమెరికన్ మార్కెట్లతో పాటు నేటి ఆసియా మార్కెట్లూ నష్టపోయాయి. దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ భారీ నష్టాలు చవిచూశాయి.అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపాయి.

యుద్ధ భయాల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతి చేసుకుంటుంది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందన్న భయాలు నెలకొన్నాయి.

అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ సైతం కనిష్ఠాన్ని చేరుకోవడం ప్రతికూల ప్రభావం చూపింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి నిధులు తరలిస్తూనే ఉన్నారు. శుక్రవారం కూడా రూ.6,030.38 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు.

**రాణించిన ఐటీ స్టాక్స్**

భారీ నష్టాల వేళ ఐటీ స్టాక్స్ నేడు రాణించాయి. విప్రో, ఎల్‌టీఐఎం, పెర్సిస్టెంట్ సిస్టమ్స్, కోఫోర్జ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ లాభపడ్డాయి. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం కావడం ఈ స్టాక్స్‌కు కలిసొచ్చింది. ఆయా కంపెనీలకు ఆదాయం డాలర్లలో ఉండడం, ఖర్చులు రూపాయల్లో ఉండడం ఇందుక్కారణం. దీనికితోడు గత నెల ఐటీ స్టాక్స్ భారీగా పతనమైన నేపథ్యంలో కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు కనిపించింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,48,200 | ₹ 1,61,680 |
| --- | --- |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,90,000

# షేర్ల లిస్టింగ్‌కు గిఫ్ట్ సిటీకి వెళ్దామా!

- తొలి అడుగు వేయనున్న విద్యా సేవల సంస్థ 'ఎక్స్‌ఈడీ'
- విజయవంతమైతే ఇదే బాటలో మరిన్ని చిన్న కంపెనీలు
- సులభతర నిబంధనలూ కలిసిరావచ్చు

**న్యూఢిల్లీ:**మన దేశంలో కంపెనీల షేర్ల లిస్టింగ్ ప్రక్రియ ఇప్పటివరకు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈల వరకే పరిమితమవ్వడాన్ని మనం చూశాం. ఇప్పుడు గిఫ్ట్ సిటీ మార్గం ద్వారా కూడా కంపెనీలు తమ షేర్లను లిస్ట్ చేసుకోవచ్చు. ఇలా నమోదుకానున్న మొదటి సంస్థగా విద్యా సేవల ప్లాట్‌ఫామ్ ఎక్స్‌ఈడీ నిలవబోతోంది. లిస్టింగ్ ప్రక్రియకు సంబంధించిన కసరత్తును ఇప్పటికే ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇది విజయవంతమైతే.. మరిన్ని చిన్న కంపెనీలు సెకండరీ మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు ఎస్‌ఎమ్‌ఈ ఎక్స్ఛేంజీలకు బదులు గిఫ్ట్ సిటీ మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గిఫ్ట్‌సిటీ వద్ద ఎక్స్ఛేంజీలను ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్‌ఎస్‌సీఏ) పర్యవేక్షిస్తుంది. ఇది సెబీ లాంటిది అన్నమాట. ఇప్పుడు ఎక్స్‌ఈడీ లిస్టింగ్ రూపంలో ఐఎఫ్‌ఎస్‌సీఏ తొలి పరీక్షను ఎదుర్కోబోతోంది.

**అనుమతులు వేగంగా..**

గిఫ్ట్ సిటీలో నమోదుకు సంబంధించి విధివిధానాల రూపకల్పన ఇంకా పూర్తి స్థాయిలో కానందున.. నియంత్రణ సంస్థలు కూడా సులువుగానే అనుమతులు ఇచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. గిఫ్ట్ సిటీలో లిస్టింగ్‌ను ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తున్నందున.. అనుమతుల ప్రక్రియ వేగంగా, సులభంగా ఉంటుందని మోనార్క్ నెట్‌వర్త్ కేపిటల్‌కు చెందిన సాహిల్ కింఖాబ్‌వాలా అంటున్నారు. అయితే లిక్విడిటీ పరిస్థితులు (క్రయ విక్రయాలప్పుడు బయ్యర్, సెల్లర్ లభ్యత) ఇప్పుడిప్పుడే మెరుగవుతున్నందున.. ఈ విషయంలో మదుపర్లు కొంత అప్రమత్తంగా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. 2012లో ఎస్‌ఎమ్‌ఈ ఎక్స్ఛేంజీలు ప్రారంభమైనప్పుడు కూడా ఇవే సమస్యలు ఎదురయ్యాయని.. కాలక్రమేణా వీటిల్లో లిక్విడిటీ పెరుగుతూ వచ్చిందని కింఖాబ్‌వాలా గుర్తు చేశారు.

**విదేశీ పెట్టుబడుల ఆకర్షణ..**

గిఫ్ట్ సిటీ ఇష్యూల ద్వారా విదేశీ మదుపర్లను కంపెనీలు ఆకర్షించే అవకాశం ఉంటుంది. సెబీ నియంత్రణలో జరిగే ఐపీఓల్లో ఎక్కువగా భారత మ్యూచువల్ ఫండ్‌లు, హెచ్‌ఎన్‌ఐలు, చిన్న మదుపర్లు పాల్గొంటుండగా.. గిఫ్ట్ సిటీ లిస్టింగ్‌లు విదేశీ ఫండ్‌లకు మరింత ఆకర్షణీయంగా ఉండనున్నాయి. సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ), స్టాంప్ డ్యూటీ లేకపోవడం, మూలధన లాభాలపై పన్ను మినహాయింపు ఉండటం కూడా సానుకూలాంశాలే.

**ఆ కంపెనీలే ఎక్కువగా రావొచ్చు..**

లాభాల్లో నడుస్తున్న కంపెనీలతో పోలిస్తే ప్రారంభ స్థాయి లేదా నష్టాల్లోని కంపెనీలే గిఫ్ట్ సిటీ లిస్టింగ్ మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**వ్యత్యాసాలేమిటి?**

సెబీ నియంత్రణలో జరిగే ఐపీఓ ప్రక్రియలో కంపెనీలకు వెల్లడి నిబంధనలు కొంచెం కఠినంగానే ఉంటాయి. ప్రమోటరు, ప్రమోటరు గ్రూపు సమాచారాన్ని, మూలనిధి వివరాలను విడమర్చి వెల్లడించడం తప్పనిసరి. మరోవైపు ఐఎఫ్‌ఎస్‌సీఏ విషయానికొస్తే.. కంపెనీలు తమ వివరాలను విపులంగా వెల్లడించాల్సిన అవసరం లేదు. అంశాలవారీగా పైపైన తెలియజేస్తే సరిపోతుంది. కార్పొరేట్ పాలనా నిబంధనల పాటింపునకు సంబంధించి ఐపీఓ పత్రాల సమర్పణ సమయంలో బోర్డు వివరాలను పూర్తి స్థాయిలో కంపెనీలు సెబీకి తెలియజేయాల్సి ఉంటుంది. మరోవైపు లిస్టింగ్ కంపెనీలకు కార్పొరేట్ పాలనా నిబంధనల రూపకల్పనను ఇప్పటివరకైతే ఐఎఫ్‌ఎస్‌సీఏ రూపొందించలేదు.

# చేతి 'చమురు' వదులుతుందా?

### బ్యారెల్ ధర 150 డాలర్లకు చేరొచ్చంటున్న ఖతార్ భారీ దిగుమతి బిల్లుతో ఆర్థిక వ్యవస్థలకు గండి



**న్యూఢిల్లీ:**పశ్చిమాసియాలో రేగిన యుద్ధ మంటతో ముడిచమురు ధర పెరిగిపోతోంది. ఇప్పటికే బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 89 డాలర్లు మించింది. ఉద్రిక్తతలు కొనసాగితే గల్ఫ్ నుంచి కొద్ది వారాల్లో ఎగుమతులు ఆగిపోతాయని, అపుడు బ్యారెల్ చమురు ధర 150 డాలర్లకు చేరొచ్చని ఖతార్ ఇంధన మంత్రి సాద్ అల్ కబీ హెచ్చరించారు. వారాల తరబడి యుద్ధం కొనసాగి, గల్ఫ్‌లో ఇంధన ఉత్పత్తి ఆగి - హర్మూజ్ నుంచి ఎగుమతులు స్తంభిస్తే ఈ పరిస్థితి ఏర్పడొచ్చన్నారు. ఇదే జరిగితే అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి మందగమనం పాలవ్వడమే కాదు.. పలు దేశాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. పలు వస్తువుల తయారీకి ఉపయోగించే పెట్రో రసాయనాలనూ గల్ఫ్ నుంచే వివిధ దేశాలు దిగుమతి చేసుకుంటుండటం గమనార్హం.ద్రవీకృత సహజ వాయువు(ఎల్ఎన్‌జీ) ఉత్పత్తిలో రెండో అతిపెద్దదేశం ఖతార్. ఇరాన్ డ్రోన్ దాడిలో దెబ్బతినడం వల్ల తమ అతిపెద్ద ఎల్ఎన్‌జీ ప్లాంటు రాస్ లఫన్‌ను ఈ దేశం మూసేసింది. భద్రతా కారణాలే ఇందుకు కారణమని ఈ కంపెనీ సీఈఓ కూడా అయిన కబీ పేర్కొన్నారు. దాడులు జరిగిన 24 గంటల్లోగా 9000 మంది సిబ్బందిని బయటకు పంపినట్లు తెలిపారు. దాడులు పూర్తిగా ఆగాకే ఉత్పత్తిని తిరిగి మొదలుపెడతామని స్పష్టం చేశారు. ప్లాంటు మరమ్మతులకు ఎంత సమయం పడుతుందో తెలియదని మంత్రి అన్నారు. ఉద్రిక్తతలు కొనసాగితే సహజవాయువు (గ్యాస్) ధర ఒక్కో ఎమ్‌ఎమ్‌బీటీయూకు 40 డాలర్లకు పెరగొచ్చని కబీ అంచనా వేస్తున్నారు.అంతర్జాతీయ మార్కెట్లో శుక్రవారం బ్రెంట్ చమురు ఫ్యూచర్స్ ధర 89.23 డాలర్లకు చేరింది. గత రెండేళ్లలో ఈ స్థాయి కనిపించలేదు. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుండడం ఇందుకు నేపథ్యం. రష్యా చమురును కొనుగోలు చేయడానికి 30 రోజుల మినహాయింపు ఇచ్చినందున, ధరలు కాస్త శాంతించే అవకాశం లేకపోలేదు. అమెరికా-బ్రిటన్ ఆర్థిక సేవల సంస్థ ఫిచ్ మాత్రం 2026లో బ్యారెల్ చమురు సగటు ధర 63 డాలర్లుగానే ఉంటుందని అంచనా వేయడం గమనార్హం. బ్యారెల్ బ్రెంట్ చమురు ధర ఒక డాలరు పెరిగినా, ఏడాదికి భారత్‌పై రూ.13,000 కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా. ఆ లెక్కన 150 డాలర్లకు ధర చేరితే, యుద్ధానికి ముందు ధర (70 డాలర్ల) కంటే అదనంగా 80 డాలర్లు పెరిగినట్లవుతుంది. అంటే ఏటా రూ.10.4 లక్షల కోట్ల భారం అన్నమాట.

రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి ఇంధనం నింపుకున్న రెండు ట్యాంకర్లు ఐరోపా దేశాలకు వెళ్లాల్సి ఉండగా, యూటర్న్ తీసుకుని ఆసియాకే వెళుతున్నట్లు వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. ఫిబ్రవరి 28న లక్ష మెట్రిక్ టన్నుల(7.45 లక్షల బారెళ్లు) డీజిల్‌ను జామ్‌నగర్ రిఫైనరీ నుంచి తీసుకెళ్లిన ఒక నౌక ఇపుడు సింగపూర్‌కు దగ్గర్లో ఉంది. 75,000 టన్నుల విమాన ఇంధనం(ఏటీఎఫ్)తో వెస్ట్-ఆఫ్- సూయిజ్ దేశాలకు బయలు దేరిన నౌక ఇపుడు ఆగ్నేయాసియా వైపుగా వెళుతోందని కెప్లర్ షిప్‌ట్రాకింగ్ సమాచారం తెలుపుతోంది. దీనిపై రిలయన్స్ స్పందించలేదు.సీఎన్‌జీ, పైపుల ద్వారా ఇళ్లకు సరఫరా చేసే వంట గ్యాస్(పీఎన్‌జీ) ధరల్లో




మార్పు చేయలేదని అదానీ టోటల్ గ్యాస్ తెలిపింది. కొన్ని పెద్ద పారిశ్రామిక వినియోగదార్లపై సరఫరా పరిమితులు పెట్టినట్లు కంపెనీ అధికారులు స్పష్టం చేశారు. కంపెనీ గ్యాస్ పరిమాణంలో 70% వరకు దేశీయంగానే సమకూర్చుకుంటుండడం ఇందుకు నేపథ్యమని తెలిపారు. 30% వరకు దిగుమతి చేసుకునే ఎల్ఎన్‌జీని పారిశ్రామిక వినియోగదార్లకు పంపుతారు. అంతక్రితం కుదుర్చుకున్న కాంట్రాక్టు పరిమాణంలో 40 శాతానికి పాత ధరలే వర్తిస్తాయని, ఆ పైన మాత్రం స్పాట్ ధరలు(మూడింతలు) అమలు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

**చమురు రిఫైనరీలపై ఎస్మా**

అత్యవసర పరిస్థితుల్లో వాడే ఎస్మా (నిత్యావసర వస్తువుల చట్టం 1955) అధికారాలను కేంద్రం వినియోగించింది. వంటగ్యాస్ (ఎల్‌పీజీ) ఉత్పత్తి పెంచాలని చమురు రిఫైనరీ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. తద్వారా దేశీయంగా వంట గ్యాస్ కొరత రాకుండా చూడనుంది. 2024-25లో మనదేశం 31.3 మి. టన్నుల ఎల్‌పీజీని వినియోగించింది. ఇందులో 12.8 మి. టన్నులే దేశీయంగా ఉత్పత్తి కాగా, మిగతా దిగుమతి చేసుకున్నాం. హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా జరిపే సౌదీ అరేబియా వంటి దేశాల నుంచే 85-90% దిగుమతులు వస్తున్నాయి. మిగులు రిఫైనింగ్ సామర్థ్యం ఉండడం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు రిఫైనరీలన్నీ గరిష్ఠ ఉత్పత్తి చేపట్టాలంటూ చమురు మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

## ఆందోళన వద్దు.. 4వేల కోట్ల లీటర్ల నిల్వలున్నాయ్

**న్యూఢిల్లీ:**ప్రస్తుతం మన దేశంలో ముడిచమురు, రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల రూపంలో 250 మిలియన్ బ్యారెళ్ల (దాదాపు 4000 కోట్ల లీటర్లు) ఇంధన నిల్వలున్నాయని ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. దేశంలో 25 రోజులకు మాత్రమే సరిపోయే ఇంధన నిల్వలున్నాయనే ప్రచారం తప్పని.. సరఫరా వ్యవస్థలో ఉన్నవి 7-8 వారాల (రెండు నెలల)కు సరిపోతాయని నివేదిక స్పష్టం చేసింది. మంగళూరు, పదూర్, విశాఖపట్నం ప్రాంతాల్లోని వ్యూహాత్మక కేంద్రాలతో పాటు ట్యాంకులు, పైప్‌లైన్లు, సముద్ర నౌకల్లో ఈ నిల్వలున్నాయి.దశాబ్దం క్రితం 27 దేశాల నుంచి చమురు దిగుమతి చేసుకుంటుండగా, ప్రస్తుతం 40 దేశాల నుంచి మనకు చేరుతోంది. మన దేశ చమురు దిగుమతుల్లో 40 శాతమే హర్మూజ్ జలసంధి మీదుగా వస్తోందని, మిగతా 60% రష్యా, పశ్చిమ ఆఫ్రికా, అమెరికా, మధ్య ఆసియా మార్గాల ద్వారా అందుతున్నట్లు నివేదిక స్పష్టం చేసింది. ఒకే సముద్ర మార్గంపై ఆధారపడి, ఇంధన భద్రతపై ఆందోళన చెందే రోజులు పోయాయని వెల్లడించింది. ఇప్పుడు సరఫరా అత్యవసర పరిస్థితులు తలెత్తవని స్పష్టం చేసింది.

**రష్యా నుంచి ఆగలేదు**

మన దేశానికి అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా కొనసాగుతోంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఒత్తిళ్లున్నా, రష్యా చమురు కొనుగోళ్లకు ఏ దేశం అనుమతిపై భారత్ ఆధారపడలేదు. గత నెలలోనూ రష్యా నుంచి చమురు దిగుమతులు వచ్చాయి అని ప్రభుత్వం వివరించింది. గత నాలుగేళ్లుగా మన దేశంలో చమురు ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. 2022 నుంచి 2026 ఫిబ్రవరి మధ్య దిల్లీలో పెట్రోల్ ధర 0.67% తగ్గింది. ఇదే సమయంలో పాకిస్థాన్‌లో 55%, జర్మనీలో 22% పెరిగింది. వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడటానికి, పెట్రోల్, డీజిల్‌పై రూ.24,500 కోట్లు, ఎల్‌పీజీపై రూ.40,000 కోట్ల నష్టాలను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు భరించాయి. గత 12 ఏళ్లలో దేశంలో ఏ ఒక్క పెట్రోల్ బంకు కూడా చమురు లేక ఇబ్బంది పడలేదని నివేదిక పేర్కొంది.దేశీయంగా పెట్రోల్‌లో 20% ఇథనాల్ కలుపుతున్నందున, ఇప్పటివరకు 44 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురుకు ప్రత్యామ్నాయం అయ్యింది.

## ఎల్‌పీజీ సిలిండర్ బుకింగ్ గడువు పెంపు

ఎల్‌పీజీ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సిలిండర్‌కు సిలిండర్‌కు మధ్య ఉన్న బుకింగ్ గడువును 21 నుంచి 25 రోజులకు పెంచింది. సిలిండర్లకు కొరత ఏర్పడొచ్చన్న భయాలతో కొందరు ముందస్తుగా గ్యాస్ బుక్ చేస్తున్నారు. గతంలో సగటున 55 రోజులకోసారి సిలిండర్ బుక్ చేసుకునే వాళ్లు సైతం ప్రస్తుత పరిస్థితుల్లో 15 రోజులకే బుక్ చేస్తుండడం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో 21 రోజుల లాకిన్ నిబంధన తీసుకొచ్చారు. తాజాగా ఆ గడువును 25 రోజులకు పెంచారు.ఇళ్లలో వినియోగించే వంటగ్యాస్ సిలిండర్‌పై కేంద్రం ఇటీవల రూ.60 భారం మోపింది. వాణిజ్య సిలిండర్లపై రూ.114.5 పెంచింది. మరోవైపు గృహ వినియోగదారుల ఎల్‌పీజీ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, కమర్షియల్ వినియోగదారులకంటే గృహ వినియోగదారులకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయిల్ రిఫైనరీలకు కేంద్రం సూచించింది. ఎల్‌పీజీ విక్రయానికి అల్జీరియా, ఆస్ట్రేలియా, కెనడా, నార్వే వంటి దేశాలు ముందుకొచ్చాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ ఇప్పటికిప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే అవకాశం లేదని పేర్కొన్నాయి. ప్రస్తుతానికి దేశంలో సరిపడా పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ నిల్వలు ఉన్నాయని వెల్లడించాయి.

## అక్కడ మస్క్.. ఇక్కడ ముకేశ్ అంబానీ

- హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2026
- మనదేశం నుంచి 308 మందికి చోటు

న్యూఢిల్లీ: 'ప్రపంచ కుబేరుల జాబితాలో భారత్ మూడోస్థానాన్ని పదిలం చేసుకుంది. దేశంలో సంపద సృష్టి కనీవినీ ఎరుగని రీతిలో జరుగుతోంది. సంఖ్య పరంగానే కాకుండా, అన్ని రంగాల్లోనూ భారతీయ పారిశ్రామికవేత్తలు ప్రపంచ స్థాయిలో పోటీ పడుతున్నారు' అని హురున్ ఇండియా గ్లోబల్ రిచ్ లిస్ట్ -2026 వెల్లడించింది. కృత్రిమ మేధ (ఏఐ) విప్లవంతో కొత్త బిలియనీర్లు వేగంగా పుట్టుకొస్తున్నారని విశ్లేషించింది. చరిత్రలో తొలిసారిగా 1 బిలియన్ డాలర్ల (రూ.9100 కోట్ల)కు మించి సంపద కలిగిన వారి సంఖ్య 4,020కు చేరుకుంది. ఇందులో భారతీయులు 308 మంది ఉన్నారు. గతేడాది కంటే మనదేశం నుంచి 24 మంది కొత్తగా ఈ జాబితాలోకి వచ్చారు. భారత కుబేరుల సంపద విలువ 10% వృద్ధితో రూ.112.6 లక్షల కోట్లకు చేరింది.రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ సంపద 9% వృద్ధితో రూ.9.8 లక్షల కోట్లకు చేరింది. ఆయన దేశంలోనే కాకుండా, ఆసియాలోనే అగ్రగామి కుబేరుడిగా తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు.అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీ సంపద 14% తగ్గి, రూ.7.5 లక్షల కోట్లకు చేరింది. దేశంలో ఆయన రెండో స్థానంలో కొనసాగుతున్నారు.సంపదను అత్యధికంగా పెంచుకున్న వారిలో సీరమ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సైరస్ ఎస్.పూనావాలా నిలిచారు. ఆయన సంపద 44% పెరిగి రూ.3లక్షల కోట్లకు చేరింది.నగరాల వారీగా చూస్తే ముంబయిలో అత్యధికంగా 95 మంది బిలియనీర్లు ఉన్నారు.కొత్తగా 578 మంది ప్రపంచ వ్యాప్తంగా గతేడాది కాలంలో 578 మంది కొత్త బిలియనీర్లు హురున్ జాబితాలోకి వచ్చి చేరారు.దేశాల వారీగా చూస్తే.. 1,110 మంది బిలియనీర్లతో చైనా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అమెరికా 1,000 మందితో రెండో స్థానంలో ఉంది.టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంపద 89% పెరిగి, 792 బిలియన్ డాలర్లకు (రూ.72 లక్షల కోట్లకు పైగా) చేరింది. ఆరేళ్లలో అయిదోసారి ఆయన ప్రపంచ అగ్రగామి కుబేరుడిగా నిలిచారు.అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 300 బిలియన్ డాలర్లతో రెండోస్థానం, ఆల్ఫాబెట్‌కు చెందిన లారీ పేజ్ 271 బిలియన్ డాలర్లతో మూడోస్థానంలో ఉన్నారు.కృత్రిమ మేధ సృష్టిస్తున్న సంపద కారణంగా ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ తొలిసారిగా ప్రపంచ టాప్-10 జాబితాలోకి ప్రవేశించారు. ఈయన సంపద 172 బిలియన్ డాలర్లు.ఏఐ రంగం నుంచి కొత్తగా 114 మంది బిలియనీర్లయ్యారు.





**అన్ని రంగాల నుంచీ..**

భారత్‌లో సంపద సృష్టి కేవలం ఐటీ, ఫార్మా రంగాలకే పరిమితం కాలేదని, అన్ని రంగాలకూ విస్తరించిందని నివేదిక పేర్కొంది. బాలీవుడ్ హీరో షారుఖ్ ఖాన్, ఫిజిక్స్ వాలా వ్యవస్థాపకులు అలఖ్ పాండే, ప్రతీక్ మహేశ్వరి, మెరిల్ లైఫ్ సైన్సెస్‌కు చెందిన షాహిద్ బిలాఖియా, ఎం3ఎం ఇండియాకు చెందిన బసంత్ బన్సాలు ఈసారి కొత్తగా జాబితాలోకి వచ్చారు. ఓయో వ్యవస్థాపకులు 32 ఏళ్ల రితేశ్ అగర్వాల్ రూ.14,400 కోట్ల సంపదతో దేశంలో అతి పిన్న వయస్కుడైన కుబేరుడిగా నిలిచారు.ప్రపంచ కుబేరుల జాబితాలో పలువురు తెలుగు పారిశ్రామికవేత్తలూ ఉన్నారు. ఇందులో.. మురళి దివి (దివీస్ లేబొరేటరీస్), పి.పిచ్చి రెడ్డి, పి.వి. కృష్ణా రెడ్డి (మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), జీఎం రావు (జీఎంఆర్), బి.పార్థసారథి రెడ్డి (హెటిరో), పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి (అరబిందో ఫార్మా), సురేందర్ పాల్ సింగ్ సులజ (ప్రీమియర్ ఎనర్జీస్), ఎం.సత్యనారాయణ రెడ్డి (ఎంఎస్ఎన్ లేబొరేటరీస్), సి.వెంకటేశ్వర రెడ్డి, ఎస్.సుబ్రమణ్యం రెడ్డి (అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్), రామేశ్వర రావు జూపల్లి (మైహోం ఇండస్ట్రీస్), కె.సతీష్ రెడ్డి (డాక్టర్ రెడ్డీస్), సి.సత్యనారాయణ (లారస్ ల్యాబ్స్), జీవీ ప్రసాద్ (డాక్టర్ రెడ్డీస్), మహిమా దాట్ల (బయోలాజికల్ ఇ.), జి.రవీంద్ర రావు (యశోదా హెల్త్‌కేర్ సర్వీసెస్), శ్రీనివాస్ బొమ్మిడిదల (జీఎంఆర్), ప్రతాప్ రెడ్డి (అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్), ఎన్.విశ్వేశ్వర రెడ్డి (షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్), ఎ.అయోధ్య రామి రెడ్డి (రాంకీ గ్రూపు), వెంకటేశ్వర్లు జాస్తి (సువెన్ ఫార్మా), బి.భాస్కర రావు (కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్).

# మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 9 (జనంసాక్షి) :** మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.సోమవారం వేములవాడ అర్బన్ మండలంలోని అనుపురం,కొడుముంజ మారుపాక, చీర్లవంచ గుర్రవానిపల్లి, గ్రామాల్లో రూ 50 లక్షలతో ఐదు మహిళా సమైక్య సంఘం భవన నిర్మాణలకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ,రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తున్నాయన్నారు.మహిళలు సాధికారత సాధించే వరకు ప్రజా ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందన్నారు. మహిళలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా... ఆర్థికంగా నిలబెడుతూ వ్యాపార రంగంలో నిలదొక్కుకునేలా సిఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, అందులో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని సంకల్పించారన్నారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి మహిళా తల్లులను లక్షాధికారులను చేయాలని పావలా వడ్డీ రుణాలు అందించి మహిళా సంఘాలకు బలమైన ఊతమిచ్చారని ఆయన గుర్తు చేశారు.
మహిళలను లక్ష్యాధికారులుగా తీర్చిదిద్దాలని ఆయన సంకల్పించారన్నారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకోకుండా, సభ్యులను కేవలం సమావేశాలకు మాత్రమే పరిమితం చేసిందని విమర్శించారు.ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో మహిళా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఇప్పటి వరకు మూడు సార్లు మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేశామన్నారు.
మహిళల సాధికారత కోసం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం,గృహలక్ష్మి పథకం ద్వారా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ 5 లక్షల ఆర్థిక సహాయం,రూ 500 లకే గ్యాస్ సిలిండర్ అందించే పథకం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ మచ్చ గీత, మార్కెట్ కమిటీ చేర్మెన్ రాజు, ఆయా గ్రామాల సర్పంచులు,వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- తాగునీటి సమస్య రాకుండా కలిసికట్టుగా కృషి చేద్దాం
- పజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంలో చిగురుమామిడి నంబర్‌వన్‌గా నిలవాలి: మంత్రి పొన్నం
- ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం.. ప్రతి వ్యక్తికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయండి



**సైదాపూర్ మార్చి 9 (జనం సాక్షి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో చిగురుమామిడి సైదాపూర్ మండలాలను నంబర్ వన్‌గా నిలపాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందని, గ్రామాల స్వరూపాన్ని మార్చాలని, ఇందిరమ్మ ఇళ్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం సైదాపూర్ మండలాల్లో జరిగిన సన్నాహక సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా మండల స్థాయి అధికారులు, ఆయా మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గొప్ప అవకాశమని, దీంతో గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. వేగవంతంగా పనులు పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లో పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. విద్యార్థులను ప్రైవేటు పాఠశాలలకు పంపని గ్రామాల్లో ఎంత పెద్ద పనైనా చేసి పెడతానని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కూడా అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి వ్యక్తికి సంబంధించిన హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ఆరోగ్యాలు బాగుంటేనే గ్రామాలు బాగుంటాయని పేర్కొన్నారు.
గ్రామాల్లో విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తోపాటు తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ అధికారుల మందిరం సమిష్టిగా కృషి చేసి కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సక్సెస్ చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు తాగునీటి సమస్య రాకుండా మిషన్ మోడ్‌లో పనిచేయాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని, నిధుల వినియోగంపై పక్కడబందీ ప్రణాళిక అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రజలను కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. 99 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి గ్రామాలను సమూలంగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో పల్లెలను ప్రగతి పథంలో పయనించేలా చూస్తామన్నారు. ఆయా మండలాలకు సంబంధించి అధికారులు వివరాలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, ఆర్డీవో కె. మహేశ్వర్, డిపిఓ జగదీశ్వర్, డి.ఆర్.డీ.ఓ శ్రీధర్, జిల్లా వైద్యాధికారి వెంకట రమణ, సంక్షేమ అధికారి సరస్వతి, హౌసింగ్ పిడి శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్లు, వివిధ శాఖల జిల్లా మండల స్థాయి అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధిపై మున్సిపల్ సమావేశం




**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 9 (జనంసాక్షి) :** వేములవాడ మున్సిపల్ పాలకవర్గం ఎన్నికైన క్రమంలో పట్టణ అభివృద్ధిపై మొదటి పాలకవర్గ సమావేశాన్ని సోమవారం చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో 28 వార్డులలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఆయా కౌన్సిలర్లు వివరించారన్నారు. పాలకవర్గ సభ్యుల సహాయ సహకారం, అధికారుల సమన్వయంతో అన్ని వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పట్టణ ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందిస్తామన్నారు. వేసవికాలం సమీపిస్తున్న క్రమంలో పట్టణ ప్రజలకు త్రాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కే.సంపత్ కుమార్, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు,టౌన్ ప్లానింగ్ అధికారి అభినవ్,ఎఈ అనన్య,సానిటరీ ఇన్స్పెక్టర్ ఎస్.సుకుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కాంస్య పథకం సాధించిన క్రీడాకారుడిని సన్మానించిన కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి:** సెకండ్ ఎడిషన్ చీఫ్ మినిస్టర్ ప్యారా గేమ్స్‌లో రాష్ట్ర స్థాయి వీల్‌చైర్ క్రికెట్ పోటీలలో కాంస్య పతకం సాధించిన క్రీడాకారుడిని సన్మానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మోతె గ్రామానికి చెందిన బుర్రభాస్కర్‌ను అభినందించారు.

# గోదావరి తీరంలో పారిశుద్ధ్యం పరిశీలించిన జిల్లా కలెక్టర్

- సామాజిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ : కలెక్టర్ సత్యప్రసాద్



**జగిత్యాల బ్యూరో, మార్చి 9 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సోమవారం ధర్మపురి పట్టణంలో గోదావరి తీర ప్రాంతాలను పర్యటించి పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించారు. భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తీరానికి తరలివచ్చే నేపథ్యంలో చెత్త పేరుకుపోకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నిత్యం శుభ్రత పనులు కొనసాగించి స్వచ్ఛమైన వాతావరణం కల్పించాలని సూచించారు. గోదావరి తీరంలో చెత్త సమయా నికి తొలగించడం, చెత్త బుట్టల ఏర్పాటు, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. మున్సిపల్ సిబ్బంది క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేసి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. 2027లో గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో స్నాన ఘాట్లు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి భక్తులకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం ధర్మపురి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ ఓపీ, ఐపీ సేవలు, రికార్డులు, ల్యాబ్, మెడికల్ ఫార్మసీ వివరాలను పరిశీలించారు. పేషెంట్లతో నేరుగా మాట్లాడి వైద్య సేవలపై సమాచారం సేకరించారు. వైద్య సేవలు మెరుగుపరచాలని, డాక్టర్లు సమయపాలన పాటించాలని ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓపీలు చూస్తున్నారో తెలుసుకున్నారు.డెంగ్యూ, వైరల్ ఫీవర్లకు మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎక్స్‌పైర్ మెడిసిన్లు ఉండకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, మంచినీటి సౌకర్యాలు, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ పర్యటన, తనిఖీల్లో రెవెన్యూ డివిజనల్ అధికారి మధు సూదన్, జిల్లా ఆస్పత్రి కోఆర్డినేషన్ అధికారి డాక్టర్ రామ కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలందరూ దేశ ఐక్యతను చాటాలి

**ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**




**ఆర్మూర్, మార్చి 9 ( జనంసాక్షి) :** దేశ ప్రజలు కుల మతాలకు అతీతంగా దేశ ఐక్యతను చాటాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పేద ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సోమవారం అందించారు. ఆర్మూర్ పట్టణంలోని రైతు వేదికలో 70 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు కావడంతో వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ లహరి రఘు, వైస్ చైర్మన్ కాటుపల్లి వెంకట్ రెడ్డి ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డిని శాలువతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ కు, వార్డు కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు.వారు మాట్లాడుతూ ప్రపంచంలో పలు దేశాల్లో బాంబుల వర్షం వినిపిస్తుంటే భారతదేశంలో పూల వర్షం కురుస్తుందన్నారు.నరేంద్ర మోడీ నాయకత్వంలో 200 మిత్రుత్వ దేశాలతో సంబంధాలు పెట్టుకున్నార న్నారు. దేశం బాగుంటే రాష్ట్రం బాగుంటుందని,రాష్ట్రం బాగుంటే ప్రజలు బాగుంటారన్నా రు. తెలంగాణ ప్రభుత్వం నిరుపేద ప్రజలకు రంజాన్ తోఫా, కళ్యాణ లక్ష్మి చెక్కులను పార్టీలకతీతంగా పంపిణీ చేస్తుందన్నారు. వార్డుల్లో ప్రజాప్రతినిధులు లేక అభివృద్ధి కుంటుపడిందని, పేద ప్రజల అభివృద్ధి ఎజెండాగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, అధికారులు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పల్లె ప్రకృతి వనాలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించిన కలెక్టర్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 9 (జనం సాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బిక్నూరు మండలం అంతంపల్లి గ్రామంలో పల్లెప్రకృతి వనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.బిక్నూర్ మండలం, అంతంపల్లి గ్రామం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం బిక్నూర్ మండలం అంతంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పల్లె ప్రకృతి వనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కల పెరుగుదల, నిర్వహణ పనులను ఆయన సమీక్షించారు.పల్లె ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు బాగా పెరిగేలా ప్రతిరోజూ నీరు పోయడం, పిచ్చిమొక్కలను తొలగించడం, చుట్టూ శుభ్రత పాటించడం, క్రమం తప్పకుండా నిర్వహణ పనులు చేయడం ఎంతో ముఖ్యమని కలెక్టర్ తెలిపారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అవి చెట్లుగా ఎదిగే వరకు నిరంతరంగా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములై మొక్కలను కాపాడాలని ఆయన కోరారు.అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని కలెక్టర్ ఆరా తీశారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ శ్రీనివాస్, వార్డు మెంబర్లు, సర్పంచ్, ఉపసర్పంచ్, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలి

- ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలి
- నిరుపయోగ వస్తువులు, చెత్తాచెదారం తొలగించాలి
- పెండింగ్ ఫైళ్లు పరిష్కరించాలి : కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మార్చి 9 (జనంసాక్షి) :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక లో 99 రోజుల కార్యక్రమాల అమలుపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ఆయా శాఖల అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ప్రతి జిల్లా కార్యాలయం, సిరిసిల్ల, వేములవాడ, ఆయా ప్రాంతాల్లోని జిల్లా కార్యాలయాలు, మున్సిపల్, తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాల్లో స్వచ్ఛత.. పరిశుభ్రత పనులు పక్కాగా చేయాలని, ఆయా శాఖల అధికారులు, మండల అధికారులు పెండింగ్ ఫైళ్లు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి కార్యాలయంలో నిరుపయోగ వస్తువులు, చెత్తాచెదారం ఉండకూడదని స్పష్టం చేశారు.ఇట్టి సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్.. నీరు వృధా

**పిట్లం మార్చి 09 (జనం సాక్షి) :** మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ తో నీరు వృధా అవుతున్న సంబంధిత అధికారులు కానీ స్థానిక పాలకులు కు కానీ పట్టింపు లేదా? అని ధర్మారం గ్రామ ప్రజలు ఆరోపించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పిట్లం మండల పరిధిలోని చిన్న కొడప్గల్ నుండి ధర్మారం వెళ్లే దారిలో రోడ్డు ప్రక్కన మిషన్ భగీరథ నీరు వృధా అవుతుంది అని వెల్లడించారు. మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ దాదాపుగా గత ఎనిమిది రోజుల నుండి లీకేజీ అవుతున్న సంబంధిత అధికారులు స్థానిక పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు ఆరోపించారు. తక్షణమే లీకేజీ అరికట్టి మళ్లీ పునారవృత్తం కాకుండా సంబంధిత అధికారులు పూర్తి జాగ్రత్తలు చేపట్టి స్థానిక పాలకులు పై దృష్టి సరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## మెడికల్ బోర్డు నిర్వహించండి..

# కార్మికులను ఆదుకోండి

- సింగరేణి సిఎండితో చర్చిస్తాం
- ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతాం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి యాజమాన్యం తక్షణమే మెడికల్ బోర్డు నిర్వహించి, కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్యతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన సంవత్సరం కాలంగా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం వలన వేలాది మంది కార్మికుల పిల్లలు ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తపరిచారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతి నెలలో రెండు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. కోల్ బెల్ట్ ఏరియాలో అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు గెలిచామని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామిలు తక్షణమే స్పందించి మెడికల్ బోర్డు ఏర్పాటుకు చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, ఐఎన్ టి యుసి సంఘాలకు అధికారాన్ని అనుభవించడం మాత్రమే తెలుసు, కానీ కార్మిక సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గత సంవత్సరం నిర్వహించిన మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికులను సర్ఫేస్ విభాగానికి బదిలీ చేసిన వారిని, భూగర్భగంలో చేసే పాత పనిని కొనసాగించాలని ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి వారికి తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన బుద్ధ ప్రసాద్ తో చర్చిస్తామని, సిఎండి స్పందన ఆధారంగా భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని ఆయన వెల్లడించారు. జాతీయ కార్మిక సంఘాలు, సాజక్ చంద్రబాబు నాయుడుతో కలిసి డిపెండెంట్ ఉద్యోగాలను పోగొట్టారని కెసిఆర్ హయాములు తిరిగి కారుణ్య నియామకాల పేరిట వారసత్వ ఉద్యోగాలను కల్పించిన విషయాన్ని రాజిరెడ్డి గుర్తు చేశారు. కార్మిక కుటుంబాలకు ఉద్యోగం కల్పించే విషయంలో కోర్టు తలుపు కూడా కడతామని డీజీఎంఎస్ అధికారులను కలుస్తామని ఆయన వెల్లడించారు ఈ విలేకరుల సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకులు అబ్బు శ్రీనివాసరెడ్డి,పాశం శ్రీనివాసరెడ్డి, భేతి చంద్రయ్య, పల్లె సురేందర్, వాసర్ల జోసెఫ్, జనగామ మల్లేష్, రొడ్డ సంపత్, మాసిడి సాయి చరణ్, వేణు, కే నాగేశ్వరరావు, అనిల్ రెడ్డి, కళాధర్ రెడ్డి పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ.. అభివృద్ధి కొనసాగిస్తుంది

- చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి
- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్




**గోదావరిఖని, జనంసాక్షి :**
చెత్త రహిత రామగుండంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రామగుండం శాసన సభ్యులు ఎంఎస్. రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం ఆవరణలో 5కె రన్‌ను మేయర్ మహంకాళి స్వామితో కలిసి పచ్చ జెండా ఊపి ఆయన ప్రారంభించారు. నగర పాలక సంస్థ కార్యాల యం నుండి గోదావరిఖని చౌరస్తా వరకు రన్ నిర్వహించారు. చౌరస్తాలో మానవ హారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ రాజకీయాలకు అతీతతంగా అద్భుతమైన పరిపాలన అందిస్తున్నదని అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రదాన ఉద్దేశ్యం ఈ నగరాన్ని పరిశుభ్రమైన సుందరమైన నగరంగా తీర్చిదిద్దుకోవడమని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పచ్చదనం, ల్యాండ్ స్కేప్‌లతో అందంగా రూపొందించుకోవాలని అన్నారు. మహిళా సంక్షేమ కార్యక్రమాలను తమ ప్రభుత్వం చిత్త శుద్దితో అమలు చేస్తుందని అన్నారు. స్వంత వ్యాపారం పెట్టుకునే స్వశక్తి సంఘాలకు కోట్లాది రూపాయల సబ్సిడీ రుణం ఇస్తూ ప్రోత్సాహిస్తుందని అన్నారు. అలాగే ప్రభుత్వ రంగంలో లక్ష ఉద్యోగాలు, ప్రైవేటు రంగంలో రెండు లక్షల ప్రైవేటు ఉద్యోగాలు తమ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. రామగుండం నగర పునర్నిర్మాణం జరుగుతున్నదని ఇందులో భాగంగా రోడ్ల వెడల్పుతో పాటు వాణిజ్య భవనాల నిర్మాణం చురుగ్గా సాగుతుందని అన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో కనీ వినీ ఎరుగని విధంగా అన్ని రంగాల్లో రామగుండం అభివృద్ధి చెంది ఇతర ప్రాంతాల వారు ఆకర్షితులయ్యే విధంగా రూపు దిద్దుకుంటుందని అన్నారు.
ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం తప్పనిసరిగా అందిస్తామని హాజరై న వారితో మేయర్ మహంకాళి స్వామి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాలక వర్గం సానిటేషన్ కు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చిందని అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగు పరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజలు కూడా సహకరించి చెత్త బయట పడ వేయకుండా నగర పాలక సంస్థ స్వచ్ఛ వాహనాలకే అందివ్వాలని అన్నారు.. చెత్త బయట పడవేసి ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగించేవారికి జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు.
ఎంఎల్ఎ రాజ్‌ఠాకూర్ నేతృత్వంలో సుమారు 800 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో రామగుండం నగర రూపు రేఖలు త్వరలో మారనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్‌లతో పాటు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి, ఎస్ఇ గురువీర, ఇఇ. పివి రామన్, ఎసిపి శ్రీహరి, టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సిడిపిఓ అలేఖ్య పటేల్, వన్ టౌన్ సిఐ ఇంద్ర సేనా రెడ్డి, మెప్మా సిబ్బందితో పాటు ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కమాడెంట్లు తిరుపతి, కేడమ్ శ్రీనివాస్, నగర పాలక సంస్థ సంస్థ ఉద్యోగులు, వాకర్స్ అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. శాసన సభ్యులు ఎంఎస్ రాజ్‌ఠాకూర్, మేయర్ మహంకాళి స్వామి ఆద్యంతం పరుగెడుతూ అందరినీ ఉత్సాహపరిచారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
10 మార్చి 2026



# రంపాలతో రప్పా రప్పా


## రాత్రివేళల్లో వాహనాల్లో జిల్లా కేంద్రాలకు కలప

- ఫారెస్ట్ అధికారులతో, సిబ్బందితో కుమ్మక్కై నేరుగా..
- అధికారుల నిర్లక్ష్యం పట్ల ఆరోపణలు

**అక్రమాలు అరికట్టలేకపోతున్నారు**

**రంగంపేట సమీపంలో అడవి జంతువుల వేట, కేజీల రూపంలో అమ్మకం వంటివి కూడా జరుగుతున్నాయని, అధికారుల నిర్లక్ష్యం పట్ల పర్యావరణవేత్తలు, విద్యావేత్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వృక్షోరక్షక రక్షితః సూత్రంతో పల్లె ప్రకృతి వనాలు, వన నర్సరీలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అక్రమాలు అరికట్టలేకపోతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ అక్రమాలను అరికట్టేందుకు విజిలెన్స్ టీములు క్షేత్రస్థాయిలో పర్యటించి, టేకు కలప దారులను పట్టుకోవాలని జిల్లా పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రియులు జిల్లా అటవీ అధికారి, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌ను కోరుతున్నారు.**

**జగిత్యాల జిల్లా క్రైమ్ (జనంసాక్షి) :**
జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనం సమీపంలో అక్రమంగా టేకు చెట్లను గొడ్డలి, రంపాలతో నరికి తరలిస్తున్నారని, అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రేచపల్లి నుంచి రంగంపేట వెళ్లే మార్గంలో, ఎస్ఆర్ఎస్పీ కాలువ, పశువుల మందల సమీపంలోని అడవి ప్రాంతంలో టేకు చెట్లను అక్రమంగా నరుకుతున్నారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల సాయంతో చెట్లను కోసి, ట్రాక్టర్లలో లోడ్ చేసి సెలవు రోజుల్లో, పగటిపూట కూడా తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ద్విచక్ర వాహనాల ద్వారా కలపను తరలించడం సాధారణంగా మారిందని, అధికారులు 'మాకేం పట్టింపు లేదు' అన్నట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
ఆకాశ రామన్న వంటి వ్యక్తుల సమాచారం మేరకు అధికారులు అప్పుడప్పుడు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, తర్వాత మళ్లీ అక్రమ రవాణా కొనసాగుతోంది. సమీప తండాలు, గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, గతంలో అట్రాసిటీ కేసుల పేరుతో అధికారులను భయభ్రాంతులకు గురిచేసిన దాఖలాలు ఉన్నాయని పేర్కొన్నారు.



**ఫారెస్ట్ సిబ్బందికి సవాలు**
కొందరు అక్రమ కలప దారులు అడవి లో గొడ్డలతో ఫారెస్ట్ సిబ్బందికి సవాలు విసురుతున్నారని, రాత్రి వేళల్లో వాహనాల్లో కలపను జిల్లా కేంద్రాలకు తరలిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల వెదురు బొంగుల తరలింపు విషయం లో కూడా అధికారులు 'రైతులు వ్యవసాయానికి వాడుతున్నారు' అని సమాధానం ఇవ్వడం ఆశ్చర్యకరమని స్థానికులు అంటున్నారు. సమాచారం ఇచ్చిన వారిపై బెదిరింపులు, హెల్మెట్ ధరించిన వ్యక్తుల ద్వారా బెదిరించడం వంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇది జిల్లా అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చట్టరీత్య నేరం : జగిత్యాల జిల్లా అటవీ అధికారి రవి ప్రసాద్**
అక్రమ టేకు కలప నరకడం రవాణా చేయడం వంటి చర్యలు చట్టరీత్య నేరమని అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని అలాంటి సంఘటనలు జరుగుతే నేరుగా సంబంధిత ఫారెస్ట్ అధికారులకు తెలియజేయాలని జిల్లా అటవీ అధికారి రవి ప్రసాద్ తెలిపారు.

# నార్సింగి కాష్టాల స్మశాన వాటికపై కబ్జా కన్ను

- చర్యలు తీసుకోవాలి కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ యాదవ్





**రాజేంద్రనగర్, మార్చి9(జనంసాక్షి):** నార్సింగి ప్రాంతంలోని కాష్టాల స్మశాన వాటికపై జరుగుతున్న కబ్జా ప్రయత్నాలను వెంటనే అడ్డుకొని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నార్సింగి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖ్యాతం అశోక్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మా తాతల కాలం నుంచే ఈ ప్రాంతంలో గ్రామస్తుల అంత్యక్రియల కోసం కాష్టాల స్మశాన వాటిక కొనసాగుతుందని తెలిపారు. నిజాం కాలంలో గ్రామ పెద్ద ఫక్రుద్దీన్ సుమారు ఒక ఎకరం భూమిని గ్రామ ప్రజల అంత్యక్రియల కోసం ప్రత్యేకంగా కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాలుగా కేడియా రియాల్టర్స్ సంస్థ ఈ భూమిపై కన్నేసి అంచెలంచెలుగా కబ్జా ప్రయత్నాలు చేస్తున్నదని ఆయన ఆరోపించారు. రెండు సంవత్సరాల క్రితం కూడా ఇదే సంస్థ ఈ కాష్టాల గడ్డను ఆక్రమించేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకోవడంతో వెనక్కి తగ్గిందని తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ నేత జిగురు శ్రీనివాస్ అంత్యక్రియల సమయంలో కూడా ఈ సమస్యపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.
ప్రస్తుతం ఈ స్థలం బఫర్ జోన్ పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనల ప్రకారం కనీసం 50 మీటర్ల దూరం పాటించాల్సి ఉండగా వాటిని ఉల్లంఘిస్తూ కేడియా రియాల్టీ యాజమాన్యం అక్రమంగా నిర్మాణాలు చేపడుతోందని అశోక్ యాదవ్ ఆరోపించారు. హిందువుల స్మశాన వాటిక అని కూడా పట్టించుకోకుండా కోట్ల రూపాయల విలువైన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించడం పట్ల గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే అక్కడ అక్రమంగా షెడ్లు, కంటైనర్లు ఏర్పాటు చేసి కబ్జా పర్వం కొనసాగిస్తున్నారని చెప్పారు.
ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, రాజేంద్రనగర్ ఆర్డీవో గండిపేట్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్థలాన్ని పరిశీలించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అశోక్ యాదవ్ కోరారు. లేకపోతే గ్రామస్తుల ఆగ్రహం మరింత పెరిగి అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లు, కంటైనర్లను ప్రజలే కూల్చివేసే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు.

# మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం



**జగిత్యాల, మార్చి 09:** మైనారిటీ మహిళల ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహించేందుకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా, గల్ఫ్ దేశాల్లో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రే షియా సహాయం అందజేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మైనారిటీ మహిళలు ఆర్థికంగా బలపడేలా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. కుట్టు మిషన్ల ద్వారా మహిళలు ఇంటి వద్దే ఉపాధి పొంది కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు. మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి పునాదని పేర్కొన్నారు. గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లిన వారు అనుకోని పరిస్థితుల్లో మరణించినప్పుడు వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని, అలాంటి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సహాయం బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తు న్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, పథకాల ను గ్రామ స్థాయిలో చేరవేయాలని ఆదేశించారు. మైనారిటీల విద్య, ఉపాధి, స్వయం ఉపాధి రంగాల్లో మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి స్వయం ఉపాధి ద్వారా కుటుంబాల అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జిల్లా మైనారిటీ అధికారి చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మైనర్ విద్యార్థిపై లైంగిక దాడి

- అస్వస్థకు గురి కావడంతో ఆస్పత్రికి తరలింపు.. బాలిక గర్భవతిగా తెల్చిన డాక్టర్లు
- మోమిన్ పేట పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు... నిందితుడు రిమైండ్
- వివరాలు వెల్లడించిన మోమిన్ పేట సిఐ వెంకట్

**వికారాబాద్ జిల్లా బ్యూరో మార్చి 9 (జనం సాక్షి):** డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ఒకవైపు పోలీస్ శాఖ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ఒక మైనర్ విద్యార్థినిపై లైంగిక దాడి వెలుగు చూస్తుంది. మాయ మాటలతో మోసం చేశాడో మత్తుకు బానిసై వంచించాడో తెలియదు కానీ విద్యార్థిని మాత్రం గర్భవతిని చేశాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా మోమిన్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున వెలుగులోకి వచ్చింది. మోమిన్ పేట సిఐ వెంకట్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 8వ తేదీ ఆదివారం నాడు ఒక మైనర్ బాలిక విద్యార్థినిపై అత్యాచారం జరిగినట్లు అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫిర్యాదు వివరాల ప్రకారం, మోమిన్‌పేట్ మండల పరిధిలో నివసించే ఒక మైనర్ బాలిక (7వ తరగతి విద్యార్థిని) గత సంవత్సరం దీపావళి సెలవుల సమయంలో హాస్టల్ నుండి ఇంటికి వచ్చి అనంతరం ఇంటి వద్దే ఉంటున్నది. ఇటీవల ఆమె అస్వస్థతకు గురి కావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆమె గర్భవతి అయినట్లు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు విచారణ చేయగా, వారి నివాసానికి సమీపంలో అద్దె ఇంట్లో నివసిస్తున్న వ్యక్తి మైనర్ బాలికను మోసం చేసి ఆమెపై అనుచితంగా ప్రవర్తించినట్లు తెలిసింది.ఈ సమాచారం ఆధారంగా మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించబడింది. దర్యాప్తులో భాగంగా నిందితుడు ఉద్దల మాణిక్యం (25), సైదలిపూర్ గ్రామంకు చెందిన వ్యక్తి అని గుర్తించబడింది.ఇట్టి కేసులో స్నేహ మెహ్రా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ వికారాబాద్ జిల్లా, ఎన్ శ్రీనివాసరెడ్డి డి.ఎస్.పి వికారాబాద్ గారి నిరంతర పర్యవేక్షణలో జి. వెంకట్ మోమిన్‌పేట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గారు మరియు వారి సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి సోమవారం నిందితుడిని పట్టుకొని అరెస్ట్ చేయడం జరిగింది. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరు పరిచి జ్యుడీషియల్ రిమాండ్ కు పంపించారు. ఈ కేసుకు సంబంధించి మరింత దర్యాప్తు కొనసాగుతోంది.ఈ సందర్భంగా వెంకట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మోమిన్‌పేట్ సర్కిల్ , మైనర్ బాలికల భద్రత విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు హాస్టల్స్ లేదా పాఠశాలలకు వెళ్లే సందర్భాల్లో వారి రాకపోకలపై తగిన పర్యవేక్షణ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని సూచించారు. అలాగే పిల్లలపై జరిగే అన్యాయాల విషయంలో పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.



# కేంద్రం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను ఉపసంహరించాలి

- సిపిఎం వికారాబాద్ జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ డిమాండ్
- జైదుపల్లి గ్రామంలో సిపిఎం నిరసన ధర్నా

**పూడూర్ మార్చి 9 (జనం సాక్షి)** గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచుతూ 60 వేల కోట్ల రూపాయల : భారాన్ని ప్రజలపై వేయడాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, ఐద్వా జిల్లా కార్యదర్శి అనసూయ, ఒటఅ జిల్లా కార్యదర్శి అగ్బర్ లు డిమాండ్ చేశారు. ఇరాన్ పై ఇజ్రాయిల్ అమెరికా చేస్తున్న యుద్ధం పేరుతో చమురు నిల్వల కొరత ఉండనున్నదనే సాకుతో గ్యాస్ ధరలు పెంచడం వల్ల ఇతర నిత్యవసర వస్తువుల ధరలు పెరగనున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెంచినగ్యాస్ సిలిండర్ల ధరలను తక్షణమేరద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు నేడు నిరసన కార్యక్రమం చేపట్టింది. దీనికి ఆయన హాజరై మాట్లాడుతూ విశ్వ గురువును అని తనకు తాను చెప్పుకునే నరేంద్ర మోడీ యుద్ధాన్ని ఎందుకు ఆపలేకపోయారని దుయ్యబట్టారు. అమెరికా చెప్పు చేతల్లో మన దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. రానున్న రోజుల్లో ఇరాన్ పై యుద్ధం కొనసాగితే పెట్రోల్ డీజిల్ ధరలు కూడా పెంచనున్నారని చెప్పారు. బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. అమెరికా ఏది చెబితే అది వినే విధంగా మన బలహీన ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చమురు దిగుమతులు చేసుకోవద్దని అమెరికా అధ్యక్షుడు ట్రంపు చెపుతుండగా ఆయనకు మోడీమోకరిళుతున్నారని అన్నారు. ఈ విషయాలను గ్రహిస్తూ ఉన్న దేశ ప్రజలు ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులను నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనసూయ వెంకటమ్మ సుక్కమ్మ లక్ష్మీ స్వరూప స్పందన అనసూయ సునంద సావిత్ర అనన్య అనంత బి యాదమ్మ ఉగ్గు శాంతమ్మ పద్మమ్మ శేఖర్ పవన్ మహిళలు పాల్గొన్నారు.

# తమ భూమిని ఆన్లైన్ చేసి పట్టాదార్ పాస్ బుక్కులు ఇప్పించాలని కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి

- ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయని కలెక్టర్ ముందు ఆవేదన
- వికలాంగుడైన కుమారుడుతో కలిసి ప్రజావాణికి ఎల్లవ్వ



**చిగురుమామిడి మర్చి09 (జనంసాక్షి):** పాతరెవెన్యూ రికార్డులో తమ భూమి సరిగా ఉన్నప్పటికీ ఆన్లైన్లో నమోదు కాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని, విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన దర్శనం ఎల్లవ్వ తన వికలాంగుడైన కుమారుడితో కలిసి కరీంనగర్ లో సోమవారం జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ మిశ్రా ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తన భర్త దర్శనం పెద్ద రాజయ్య గత పది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారని, తన పేరు మీద ఉన్న సర్వే నెంబర్ 455లో ఉన్న ఎకరం 20గుంటల భూమిని ఇద్దరి కుమారులు, కూతురు పేరు మీద విరసత్ చేయాలని అధికారులకు దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. ఎలాంటి వివాదం లేని తమ భూమిని పాత వన్ బి రికార్డులను పరిశీలించి తమకు ఆన్లైన్ చేయాలని అధికారులను చాలాసార్లు వేడుకున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తమ భూమి ఆన్లైన్లో లేకపోవడం, పట్టాదారు పాస్ బుక్కులు రాకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని వారు దీనంగా చెప్పారు. వెంటనే అధికారులతో తగు విచారణ జరిపించి తమకు విరాసత చేసి ఆదుకోవాలని ఎల్లవ్వ, కుమారులు దర్శన స్వామి, దర్శనం శంకర్ లు కోరారు.

# పెద్దపల్లి పట్టణాన్ని స్వచ్ఛ పెద్దపల్లిగా మారుద్దాం


**మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య**



**పెద్దపల్లి, మార్చి 9 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య కార్యాలయం నుండి జెండా చౌరస్తా,మజీద్,ఆమర్ నగర్ చౌరస్తా మీదుగా జూనియర్ కాలేజ్ మైదానం వరకు ర్యాలీని చైర్మన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ నూగిల్ల మల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ర్యాలీలో పాల్గొంటున్న అందరికి ధన్యవాదాలు పెద్దపల్లి పట్టణ ప్రజలు తమ ఇండ్లలో నుండి వచ్చే చెత్తను తడి పొడి చెత్తగా వేరుచేసి మీవద్దకు వచ్చే మా మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి అందించాలని అలాగే ఎమ్మెల్యే విజ్జన్న సహకారంతో పెద్దపల్లి అభివృద్ధి పదంలో నడుస్తున్నందున ప్రజలందరూ సహకరిస్తూ పెద్దపల్లి పట్టణాన్ని స్వచ్ఛ పెద్దపల్లి పట్టణంగా మార్చడానికి సహకరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ ఆకుల వెంకటేష్‌కి, వైస్ చైర్మన్‌కి, తోటి కౌన్సిలర్లకు మున్సిపల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్,కౌన్సిలర్లు మోలుగురి కమల్, నల్లలా పద్మ సురేష్,అక్కేపల్లి సుజాత క్రాంతి మున్సిపల్ మేనేజర్ లింగయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్, మెప్మాటి (టిఎంసి)స్వప్న మున్సిపల్ సిబ్బంది మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 9 (జనం సాక్షి) :**
సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టి జి ఆర్ఈడిసిఓ ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమలో భాగంగా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కర్బన ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపల్ పరిధిలో అవగాహన కల్పించాలని సూచించారు.మూడు కిలోవాట్ల సోలార్ పలకలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని,దాంతో పాటు ప్రతీ నెలా రూ.2 వేల విద్యుత్ బిల్లు అదా చేయవచ్చని తెలిపారు. పెట్టుబడి 5 సంవత్సరాల్లో తిరిగి వస్తుందని అన్నారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమని తెలిపారు. మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు ఇస్తూ అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని, ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్-రెవెన్యూ .వి. విక్టర్, ఏసీఎల్ బి మధుమోహన్, జిల్లా ప్రజా సంబంధాల అధికారి. తిరుమల, టిజిఆర్ ఈడిసిఓ జిల్లా మేనేజర్ ఇ. రమణ,ఎఎఫ్ఒ జగదీప్ రామ్ పాల్గొన్నారు.




# మత్స్యకారుల సంక్షేమానికి 5000 కోట్లు కేటాయించాలి


- లోయర్ మానేరు డ్యాంలో చినవారి కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్
- హైదరాబాద్‌లో మార్చి 17న భారీ ధర్నా పిలుపు



**కరీంనగర్ బ్యూరో, మార్చి 09 (జనంసాక్షి) :** మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చే 2026-27 బడ్జెట్‌లో రూ.5000 కోట్లు కేటాయించాలని, గత 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 986 మంది మత్స్యకారుల మరణాలకు సంబంధించిన ఎక్స్‌గ్రేషియా నిధులను ఈ బడ్జెట్‌లోనే విడుదల చేయాలని టిఎంకెఎంకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మత్స్యకారులు ధర్నా చేసి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో మాట్లాడిన బాలకృష్ణ మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణిస్తున్నా ప్రభుత్వ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. నాటి ప్రభుత్వం జీవో నెంబర్ 6 ద్వారా మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు సహాయం చేయాలని నిర్ణయించినా ఇప్పటివరకు అమలు కాకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ జీవోలే అమలు కాకుంటే సామాన్యులకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మత్స్య శాఖ నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నా అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు.
రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారులు ఐక్యంగా ఉద్యమించాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయమైన సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే భారీ ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.
టిఎంకెఎంకెఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకన్న, ప్రధాన కార్యదర్శి జనగరి గణేష్, కోశాధికారి పప్పు సదానందం మాట్లాడుతూ.. లోయర్ మానేరు డ్యాంలో చేపల వేటకు వెళ్లిన మేకల అజయ్ (28) మార్చి 2న, పెసరు జంపయ్య (30) మార్చి 5న తెప్ప బోల్తా పడి మరణించడం బాధాకరమన్నారు. ఈ ఇద్దరి కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా వెంటనే ప్రకటించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 5 రోజుల్లో ఇద్దరు మరణించడంతో మత్స్యకారులందరూ భయాందోళనలో ఉన్నారని, జిల్లా మత్స్యశాఖ అధికారులు కనీసం పలకరించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.
సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించగా.. కలెక్టర్ సానుకూలంగా స్పందించి, లోయర్ మానేరు డ్యాంలో మరణించినవారి కుటుంబాలకు వెంటనే న్యాయం చేస్తామని, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ కేసులను త్వరగా పరిష్కరించాలని మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.
ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సౌతాకారి సంపత్, నూనె శేఖర్, మేకల ఆంజనేయులు, మేకల కిరణ్, కంటే సురేష్, పి.హనుమంతు, పి.కుమార్, గడప పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం
# సద్వినియోగం చేసుకోవాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 9 (జనం సాక్షి) :**




సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టి జి ఆర్ ఈ డి సి ఓ ఆధ్వర్యంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.కార్యక్రమ లో భాగంగా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా ప్రతీ విద్యుత్ వినియోగదారుడు తమ ఇళ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని, కర్బన ఉద్గారాలు జీరో స్థాయికి తేవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపల్ పరిధిలో అవగాహన కల్పించాలని సూచించారు.మూడు కిలోవాట్ల సోలార్ పలకలు ఏర్పాటు చేసుకొంటే కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని,దాంతో పాటు ప్రతీ నెలా రూ.2 వేల విద్యుత్ బిల్లు అదా చేయవచ్చని తెలిపారు. పెట్టుబడి 5 సంవత్సరాల్లో తిరిగి వస్తుందని అన్నారు. సోలార్ విద్యుత్ పర్యావరణ హితమని తెలిపారు. మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు ఇస్తూ అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చని, ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్-రెవెన్యూ .వి. విక్టర్, ఏసీఎల్ బి మధుమోహన్, జిల్లా ప్రజా సంబంధాల అధికారి. తిరుమల, టిజిఆర్ ఈ డి సి ఓ జిల్లా మేనేజర్ ఇ. రమణ,ఎఎఫ్ఒ జగదీప్ రామ్ పాల్గొన్నారు.

## పెద్దపల్లి ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో 6 షార్ట్ టర్మ్ కోర్సులు

**పెద్దపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 6 షార్ట్ టర్మ్ కోర్సులను ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు.ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణా రావు.

## లింక్ డాక్యుమెంట్ పోయినది

నేను కె. క్రాంతికుమార్, తండ్రి।। కీ।।శే।। చిన్న య్య నివాసి: తిమ్మసానిపల్లి, యెనుగొండ, మహ బూబ్ నగర్. అసలు లింక్ **డాక్యుమెంట్ నం. 3304/ 2002, తేదీ 20.08.2002** (ఇంటినం. 9-2-1, తిమ్మసాని పల్లి, 92.775 చ. గజాలు) నా తల్లి కె. **బాలకొండమ్మ భర్త।। కీ।।శే।। చిన్నయ్య** పేరుపై ఉండేది. 2026 జనవరి 29న బైక్‌పై తిమ్మసాని పల్లి నుండి ఎస్‌విఎస్ ఏరియాకు వెళ్తుండగా కవర్ పడిపోయి డాక్యుమెంట్ పోయింది. వెతికినా దొరక లేదు. ఈ డాక్యుమెంట్ దొరికితే దయచేసి తిరిగి ఇవ్వండి. దుర్వినియోగం చేస్తూ ఏ లావాదేవీలు చేసినా చట్టవిరుద్ధం.

**సంప్రదింపు నంబర్ : కె. క్రాంతి కుమార్**
**ఫోన్: 9912065352.**

# ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్‌గా సంతోష్

- బాధ్యతలు స్వీకరించిన అధికారి



హైదరాబాద్, మార్చి9 (జనంసాక్షి) : గిరిజన సంక్షేమశాఖ నూతన సంచాల కులుగా సంతోష్ బిఎం బాధ్యతలు సవీకరించారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సోమవారం సంతోష్ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో వారి వారి విధులు, పనులను గూర్చి సమీక్ష చేశారు. చేయవలసిన పనులను గూర్చి తనకు విభాగాల వారీగా తెలియజే యాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఈ–ఫైల్స్ పెట్టడం కూడా ప్రారంభిం చాలన్నారు. విభాగాలవారీగా అధికారులు తమ విధులు, బాధ్యతల గురించి తనకు వివరాలు ఇవ్వాలని, ఆ మేరకు పనులు చేసుకుంటూ వెళ్తామని అన్నారు. గిరిజన సంక్షేమ పథకాలు అన్ని కూడా అడవులలో చివరి మజిలీలో ఉన్న చివరి గిరిజనులకు కూడా చేరేటట్లు ప్రణాళికలు రచించాలని, ప్రత్యేకించి గిరిజనుల ఆరోగ్యం, విద్యావకాశాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గిరిజన సంక్షేమం మీద పూర్తి అవగాహన ఏర్పరచుకుని వారం రోజులలో గిరిజన ప్రాంతాలలో పర్యటించి గిరిజన సమస్యలను, సంక్షేమ అవసరాలను తెలుసు కుని తదనుగుణంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా సంతోష్ బి.ఎం. కి గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ బాలు, గిరిజన పరిశోధన సంస్థ సంచాలకులు డా. వి. సముజ్వల, జీసీసీ జీఎం ప్రతాప్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్లు పోచం, శ్రీమతి సంధ్యారాణి తదితర అధికారులు పూల మొక్కలు ఇచ్చి ఆహ్వానించారు. గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సచివాలయానికి వెళ్ళి సంక్షేమ శాఖల స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్‌కు పూల మొక్క ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు.

# రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన కేంద్ర నిధులు సాధించాలి

## గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బాట

- బడ్జెట్‌లో పీఆర్ ఆర్డీకి పెద్దపీట
- బడ్జెట్ ప్రతిపాదనలపై అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందిం చడం, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల పాత్రను బలపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, శాఖకు చెందిన అన్ని విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ వినియోగం, వచ్చే ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించారు. విభాగాల వారీగా అధికారులు బడ్జెట్ ప్రతిపాదనలు మంత్రికి సమర్పించగా, వాటిలో పలు మార్పులు చేయాలని మంత్రి సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను పూర్తి స్థాయిలో తెచ్చుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక్క రూపాయి కూడా లాప్స్ కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాల కారణంగా కేంద్ర నిధులు చాలా వరకు పెండింగ్ లో ఉన్నాయని, రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన వాటాను తప్పకుండా సాధించాలని అన్నారు. కేంద్రానికి రాష్ట్రం భారీగా పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో, రాష్ట్రానికి రావాల్సిన నిధులను సమర్థంగా సాధించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ప్రతి రూపాయిని జాగ్రత్తగా ఖర్చు చేస్తే అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు ఉండవని తెలిపారు. ముఖ్యంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, అవసరమైన యుటిలిటీ సర్టిఫికేట్లు సమర్పించి వాటిని త్వరగా విడుదల చేయించాలన్నారు. ఉపాధీ హమీ పథకం స్థానంలో కేంద్రం ప్రవేశ పెట్టిన వీబీ జీ రాం జీ చట్టానికి సంబంధించి ఇంకా రూల్స్ ఫ్రేమ్ కాలేదని పేర్కొన్న మంత్రి సీతక్క..గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధీ కల్పన కోసం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శాఖలోని అన్ని విభాగాలు తమ ప్రగతి నివేదికలను క్రమం తప్పకుండా రూపొందించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. జల సంరక్షణ కార్యక్రమాల్లో రాష్ట్రానికి ఉత్తమ రాష్ట్రంగా అవార్డులు వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, అదే విధంగా అన్ని విభాగాలు మెరుగైన పనితీరు కనబరచాలని అన్నారు. 99 డేస్ ప్రణాళికల్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నంబర్ వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. జిల్లాల వారీగా నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం అయిన జూన్ 2 నాటికి ఈ భవనాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల ఆర్థిక బలోపేతం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, మహిళలకు ఉపాధి మరియు స్వయం ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

అనంతరం వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆదివాసీ, ఏజెన్సీ మరియు గిరిజన ప్రాంతాల్లో అనేక వాగులు ఉన్నప్పటికీ వేసవికాలంలో సాగు మరియు తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. వర్షాకాలంలో వరదలు, వేసవిలో నీటి ఎద్దడి సమస్యలు ఎదురవుతున్నందున వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా వాగులు, వంకలు, తోగులపై చెక్ డ్యాంల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.

# సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభం



హైదరాబాద్, మార్చి 9 (జనంసాక్షి) : తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ శాఖ యువతను అత్యవసర సేవలు చేరుకునే ముందు ప్రథమ స్పందనకారులుగా తయారు చేయడానికి 'సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ శిక్షణ కార్యక్రమం 9 నుండి 15–2026 వరకు మొత్తం ఏడు రోజుల పాటు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమాన్ని సోమవారం నాడు హైదరాబాద్‌లోని పీజీ కాలేజ్, సైఫాబాద్‌లో ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జివి నారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమం అన్ని శాఖలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అత్యవసర పరిస్థితులు, ముఖ్యంగా ఎయిర్ రైడ్స్, కెమికల్ దాడులు, న్యూక్లియర్ ప్రమాదాలు మరియు ఇతర విపత్తుల సమయంలో శిక్షణ పొందిన వాలంటీర్లు ప్రభుత్వ శాఖలకు సహకరించగలరని చెప్పారు. ఈ శిక్షణలో వాలంటీర్లకు రక్షణ చర్యలు, అగ్ని మాపక చర్యలు, ఫస్ట్ ఎయిడ్ చికిత్స, గుంపు నియంత్రణ, సహాయక సామగ్రి పంపిణీ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వబడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో వాలంటీర్లు పోలీస్, ఫైర్ సర్వీసెస్, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేస్తారు. అలాగే ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. శిక్షణ పొందిన వాలంటీర్లతో బలమైన కమ్యూనిటీ ఏర్పడడం అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఫ్ఓ ఎమ్‌జడ్–1 బి. సుధాకర్ రావు, ప్రిన్సిపల్ డి. కరుణ సాగర్, వైస్ ప్రిన్సిపల్ ఈ. రామా ఫైర్ శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులను మోసగించిన ప్రభుత్వం

- ఉద్యోగ నోటిఫికేషన్లపై హామీలకు దిక్కేది?
- అసెంబ్లీలో అన్ని సమస్యలపైనా నిలదీస్తాం : వేముల



నిజామాబాద్, మార్చి9 (జనంసాక్షి) : ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ గాలిలో కలిసింది. అసెంబ్లీ సాక్షిగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ అభాసుపాలయ్యింది. రెండున్నరేండ్లు గడుస్తున్నా నోటిఫికేషన్లు ఎండమావిగా మారాయని మాజీమంత్రి,, బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి అన్నారు. వీటన్నటిపైనా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఎంగడతామని అన్నారు. ఉద్యోగాల కల్పన, హామీలను నిలదీస్తామని అన్నారు. అయితే సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్దంగా లేదని అర్థం అవుతోందన్నారు. నిరుద్యోగులు రెండున్నరేండ్లుగా కండ్లుకాయలు కాసేలా ఎదురుచూసినా ఫలితం లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తమను నమ్మించి మోసం చేసిందంటూ నిరుద్యోగులు నిరసనలు వ్యక్తం చేస్తున్నా, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. హామీ మేరకు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వాలని వేముల డిమాండ్ చేశారు. ఇదిలావుంటే పోలీస్‌శాఖలో తక్షణమే 20 వేల పోస్టులతో ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని 'పోలీస్ ఉద్యోగాల నిరుద్యోగ జేఏసీ' డిమాండ్ చేస్తున్నది. భారీగా నిరసలకు పిలుపునిచ్చింది. భారీ ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఇప్పటికే ఆవిష్కరించింది. వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, వయోపరిమితిని 35 ఏండ్లకు పెంచాలని, జీవో 46ను రద్దు చేయాలని, లాంగ్‌జంప్‌ను 3.8 మీటర్లకు తగ్గించాలనే ప్రధాన డిమాండ్లతో నిరసన చేపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పోలీస్ ఉద్యోగార్థులకు అలవిగాని హామీలు ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ఇదిలావుంటే ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్‌ల కోసం కర్ణాటక తరహాలో ఉద్యమిస్తామని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. జనరల్ ఉద్యోగాలకు తక్షణం నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ నిరుద్యోగ జేఏసీ' ఆధ్వర్యంలో 13న నిరుద్యోగ మార్చ్ నిర్వహించనున్నారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలమైనందున నిరుద్యోగ మార్చ్‌కు భారీగా నిరుద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. 13న అసెంబ్లీ ముట్టడితోపాటు, టీజీపీఎస్సీని కూడా ముట్టిస్తామని నిరుద్యోగ జేఏసీ నాయకులు ప్రకటించారు. ఏడాదికి ఇస్తామన్న రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో, బడ్జెట్ సమావేశాలలోపు అన్నిశాఖల్లో ఉన్న ఖాళీలతో మరో జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేసారు. 2024 ఆగస్టులో అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితంలా మారిపోయిందని మండిపడ్డారు. ఆ జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు వస్తాయని ఆశించారని, నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో కోచింగ్ సెంటర్లలోనే సమయం, డబ్బు వృథా అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో డబ్బులు పంపేందుకు కూడా తల్లిదండ్రులు సంకోచిస్తున్నారని, స్వగ్రామాలకు వెళ్తే తలెత్తుకొని తిరిగే పరిస్థితి లేదని నిరుద్యోగులు వాపోతున్నారు.



# వెలుగులోకి సింథటిక్ డ్రగ్స్

## ఈగిల్ ఫోర్స్ దాడుల్లో వెలుగులోకి సంచలన విషయాలు

హైదాబాద్, మార్చి 9 (జనంసాక్షి) : తెలంగాణలో భారీ సింథటిక్ డ్రగ్స్ రాకెట్‌ను పోలీసులు వెలుగులోకి తెచ్చారు. షాద్‌నగర్‌లో రహ స్యంగా మెఫెడ్రోన్ డ్రగ్ తయారీ చేస్తున్న గ్యాంగ్ కార్యకలా పాలను ఈగిల్ ఫోర్స్ దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో సంచలన విషయాలు బయటపడటంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది. దర్యాప్తులో భాగంగా ఎస్సార్ ఇన్నోవేషన్స్ అనే సంస్థ ద్వారా డ్రగ్స్ తయారీలో ఉపయోగించే నిషేధిత రసాయనాలను సరఫరా చేస్తున్నట్టు గుర్తిం చారు. ముఖ్యంగా మెఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 2 బ్రోమో–4 మెథైల్ ప్రోపియోఫీనోన్ అనే రసాయనంతో పాటు, క్లోఫెడ్రోన్ తయారీలో ఉపయోగించే 3 క్లోరో–1 ఫెనైల్–1 ప్రోపనోన్ అనే కెమికల్స్‌ను సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎస్సార్ ఇన్నోవేషన్స్ డైరెక్టర్ షేక్ రఫీ కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఇండియా మార్ట్ ద్వారా రాజస్థాన్‌కు చెందిన నిందితులకు ఈ రసాయనాలను సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. రాజస్థాన్‌కు చెందిన గ్యాంగ్ మూడు విడతల్లో దాదాపు 300 కిలోల రసాయనాలను కొనుగోలు చేసినట్లు సమాచారం. నిందితులు తప్పుడు కంపెనీ పేర్లతో కెమికల్స్ కొనుగోలు చేసి షాద్‌నగర్‌లో అద్దె గదిని తీసుకుని అక్కడే డ్రగ్స్ తయారీ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తయారు చేసిన డ్రగ్స్‌ను తిరిగి రాజస్థాన్‌కు తరలించి విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ గ్యాంగ్‌కు రాజస్థాన్‌కు చెందిన గిరీష్ థాపర్ అలియాస్ వీరేంద్ర స్వామి నాయకత్వం వహిస్తున్నాడు. నకిలీ పేర్లతో వ్యవహరిస్తూ డ్రగ్స్ తయారీకి అవసరమైన ముడి సరుకును సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌లో మనీష్ బిష్ణోయి, మనోజ్ మాథూర్, శిశుపాల్, సుమిత్, రాజు కీలక పాత్ర పోషించినట్టు తెలిసింది. ఈ కెమికల్స్ సరఫరాకు సంబంధించి లక్షల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈగిల్ పోలీసుల సమాచారంతో రాజస్థాన్ పోలీసులు వీరేంద్ర స్వామి, మనీష్ బిష్ణోయిని అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో షాద్‌నగర్‌లో నడుస్తున్న డ్రగ్ ల్యాబ్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నార్కోటిక్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కేసు నమోదు చేశారు. పోలీసులు మరికొంతమంది నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

జనంసాక్షి కథనం

# తెలంగాణ టూ యూపీ

- ఆశిక్‌కు వైద్యం అందిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే
- వైద్యం కోసం తెలంగాణ నుండి యూపీకి ఆశిక్ కుటుంబం
- హర్షం వ్యక్తం బాలుడి బంధువులు

## స్పందించిన యూపీ మధోఘర్ ఎమ్మెల్యే మూల్ చంద్ నిరంజన్



ఆపదలో అభం శుభం తెలియని బిడ్డ!

5వ తరగతి విద్యార్థికి రెండు కిడ్నీలు ఫెయిల్

- చికిత్సకు 35 లక్షలు
- పానిపూరి అమ్మే కుటుంబానికి పెద్ద కష్టం

ఒక్కసారిగా ఆవేదనకు లోనైన స్నేహితులు

జనంసాక్షి 07 Mar 2026 - Page 12 https://epaper.janamsakshi.org/news/8090/69ab16c78d43b

జనంసాక్షిలో 7వ తేదీన ప్రచురితమైన కథనం



एक बच्चा जिसे अच्छे-बुरे का कोई ज्ञान नहीं है, खतरे में है!

पांचवीं कक्षा के एक छात्र के दोनों गुर्दे खराब हो गए।

- इलाज के लिए 35 लाख रु
- पानीपुरी बेचने वाले परिवार के सामने एक बड़ी चुनौती है

मित्रों पर अचानक संकट आ गया

जनंसाक्षि 07 Mar 2026 - Page 12

ఎమ్మెల్యేకు చేరవేసిన జనంసాక్షి తర్జుమా కథనం

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) : అభం శుభం తెలియని ఓ బిడ్డ ఆపదలో పడ్డాడు. ఆ విద్యార్థి చదువుతుంది కేవలం ఐదో తరగతి. వయసు కేవలం పది సంవత్సరాలు మాత్రమే ఆడి పాడే వయసులో ఆ విద్యార్థికి పెద్ద కష్టం వచ్చి పడింది. రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్న దుస్థితి నెలకొంది ఆ తల్లిదండ్రులు పానీపూరి అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూర్ గ్రామంలో (యూపీ) ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రనికి చెందిన రవీంద్ర కుమార్, సుమన్ దేవి, బతుకు దేరువు కోసం యూపీ నుండి తెలంగాణకు వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నారు అయితే ఈ దంపతులకు ఆశిక్ ఉన్నాడు. నెల రోజులుగా బాబు తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తే అసలు సమస్య వెలుగులోకి వచ్చింది ఆశిక్ రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యం కోసం 35 లక్షల రూపాయలు ఖర్చవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.జనంసాక్షి ఆపదలో అభం శుభం తెలియని బిడ్డ అనే శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించింది. కుటుంబ సభ్యులు ఈ కథనాలను చేరవేయడంతో స్పందించిన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మధోఘర్ ఎమ్మెల్యే మూల్ చంద్ నిరంజన్ సోమవారం నాడు ఆశిక్ తల్లిదండ్రులతో మాట్లాడి వెంటనే తమ రాష్ట్రానికి రావాలని ఆశిక్ కు మెరుగైన వైద్యం అందిస్తామని కుటుంబ సభ్యులకు తెలపడంతో కుటుంబ సభ్యులు యూపీకి బయలుదేరనున్నారు. తమ బాబు సమస్యలు గుర్తించి వెలుగులోకి తెచ్చిన జనంసాక్షికి రుణపడి ఉంటామని అన్నారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాల్సిందే..

- దక్షిణ మధ్య రైల్వే జీఎంకు బీఆర్ఎస్ వినతి



హైదరాబాద్, మార్చి9 (జనంసాక్షి) : బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీ బొయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌బాబు సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తో సోమవారం భేటీ అయ్యారు. కాజీపేట రైల్వే డివిజన్ తో పాటు స్థానికులే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ కావాలని 40 ఏళ్ల నుంచి డిమాండ్ ఉందని, అయితే కేంద్రం పదేళ్ల క్రితం వ్యాగన్ ఫ్యాక్టరీ కోసం ప్రకటన చేసిందని తెలిపారు. స్థానిక నాయకులు ఈ ప్రాంత రైతులతో మాట్లాడి తక్కువ ధరతో భూమి ఇవ్వడానికి ఒప్పుకున్నారని వివరించారు. అయితే ఫ్యాక్టరీలో స్థానికులకు కాకుండా ప్రైవేట్ వారిచే పనులు చేస్తున్నట్టు జీఎం పేర్కొన్నారని, స్థానికులకు అవకాశమివ్వాలని కోరినట్లు వారు వెల్లడించారు. కాజీపేట రైల్వే డివిజన్ విషయం రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంటుందని జీఎం వివరించారని తెలిపారు. స్థానికులకు ఇచ్చిన విధంగా కాజీపేటలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# విద్యుద్ఘాతంతో ఇద్దరు వ్యక్తులు బలి

మంచిర్యాల, మార్చి 9 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మేదరిపేటలో విషాదం నెలకొంది. ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద సోమవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెట్రోల్ బంక్ నుంచి ఎత్తైన ఇనుప స్టాండ్ ను తీసుకెళ్లే క్రమంలో మెయిన్ లైన్ విద్యుత్ తీగలు స్టాండ్ కు తగలడంతో ఇద్దరు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. మృతులు మాదాపూర్‌కు చెందిన చల్ల లక్ష్మీనారాయణ (45), వెల్గనూర్‌కు చెందిన చందనగిరి నాగరాజు (40) గా గుర్తించారు. ఇరువురు స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఇద్దరి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బంకు నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, నష్ట పరిహారం అందించాలని కోరుతూ మృతుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సై తహసీనుద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని కేసు వివరాలు సేకరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370